


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



శ్రమశక్తి విధానంలో మనుస్మృతి ప్రస్తావన...
'రాజ్యాంగానికే అవమానం'

ట్రంప్‌ను ఎదుర్కొనే ధైర్యం మోదీకి లేదు

చాబహార్ పోర్ట్‌పై 6 నెలల గడువు పెంపు

05


సంపుటి 08, సంచిక: 329 | శుక్రవారం | 31-10-2025 | ఖమ్మం    Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**    పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# జలదిగ్బంధంలో వరంగల్





## మున్నేరుకు వరదముప్పు

- మొంథా తుఫాన్ ధాటికి వరంగల్, కరీంనగర్, సిద్దిపేట, నల్లగొండ, ఖమ్మం అతలాకుతలం
- నేలకొరిగిన కోతకొచ్చిన పంటలు
- రైతుకు తీవ్ర నష్టం
- ప్రాథమిక అంచనాల ప్రకారం 4,47,864 ఎకరాల్లో పంటనష్టం
- కోతకు గురైన రహదారులు.. పలుచోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- నీటమునిగిన మెదక్ జిల్లాలోని వనదుర్గాదేవి ఆలయం

**నేడు వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే**

ప్రజాపక్షం/హైదరాబాద్/హనుమకొండ/ఖమ్మం

మొంథా తుఫాన్ ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు తెలంగాణలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. ఈ వానల కారణంగా ఉమ్మడి జిల్లాలైన వరంగల్, కరీంనగర్, సిద్దిపేట, నల్లగొండ, ఖమ్మం తదితర జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. ఈ వర్షపు నీరు చేరడంతో ఆయా ప్రాంతాల్లోని రహదారులు జలమయం అయ్యాయి. మరోవైపు కోత దశకు వచ్చిన పంటలు నేలకొరిగాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక అంచనాల ప్రకారం 4,47,864 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. మరికొన్ని చోట్ల రహదారులపై వరద చేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వరంగల్ జలదిగ్బందంలో చిక్కుకుంది. హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లోని పలు కాలనీల చెరువులను తలపిస్తున్నాయి. ఖమ్మంలో మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. 28 అడుగులకుపైగా ప్రవాహం పెరగడంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వరద ఉధృతికి పరిసర ప్రాంతాల్లోని పలు కాలనీలు ముంపునకు గురయ్యాయి. మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం మళ్లీ నీటమునిగింది. భారీ వర్షాలకు వరంగల్ నగరం జలదిగ్బంధంలో చిక్కుకుపోగా, వరంగల్ హనుమకొండను అనుసంధానం చేసే హంటర్ రోడ్డులో బొంది వాగు ఉప్పొంగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ములుగు రోడ్డు వద్ద నాలా ఉధృతంగా ప్రవహించడంతో వరంగల్ హనుమకొండకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.హన్మకొండలోని ఊర చెరువు తెగడంతో సంతోషిమాత కాలనీ డికె నగర్, ఎన్ఎన్ నగర్, మైసయ్య నగర్, సమ్మయ్య నగర్, తరువాయి 2లో



## జిన్‌పింగ్‌తో భేటీ అద్భుత విజయం

- చైనాపై విధించిన సుంకాలు తగ్గిస్తా
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన

**ఎయిర్ ఫోర్స్ వన్ (ప్రయాణిస్తున్న సమయంలో) :** చైనాపై విధించిన సుంకాలను తగ్గించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. చైనా అధ్యక్షుడు క్సీ జిన్‌పింగ్‌తో జరిగిన ముఖాముఖి భేటీని అద్భుత విజయంగా వర్ణించారు. అరుదైన భూలోహాలను ఎగుమతి చేయడానికి, అలాగే అమెరికన్ సోయాబీన్ల కొనుగోళ్లను తిరిగి ప్రారంభించడానికి బీజింగ్ అంగీకరించిందని ట్రంప్ గురువారం తెలిపారు. ఎయిర్ ఫోర్స్ వన్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ, ఫెంటానిల్ తయారీలో ఉపయోగించే రసాయనాలను విక్రయించినందుకు ప్రతిగా, ఈ ఏడాది ప్రారంభంలో విధించిన 20 శాతం సుంకాన్ని 10 శాతానికి తగ్గిస్తామని చెప్పారు. దీంతో చైనాపై ఉన్న మొత్తం సుంకాల భారం 57 శాతం నుండి 47 శాతానికి పడిపోతుందని వివరించారు. 'ఉత్తమమైన భేటీలకు 0 నుండి 10 వరకు స్కేల్‌ను నిర్ణయిస్తే, ఈ సమావేశానికి నేను 12 పాయింట్లు ఇస్తాను' అని ట్రంప్ అన్నారు. తాను వచ్చే ఏప్రిల్‌లో చైనాకు వెళతానని, ఆ తర్వాత జిన్‌పింగ్ అమెరికా వస్తారని పేర్కొన్నారు. అలాగే, అధునాతన కంప్యూటర్ చిప్స్ ఎగుమతిపై చర్చించామని, ఈ విషయంపై నీవిడియా సంస్థ చైనా అధికారులతో చర్చలు జరపనుందని వివరించారు. చైనాతో వాణిజ్య ఒప్పందంపై సంతకం చాలా త్వరలోనే జరగవచ్చని ట్రంప్ అన్నారు. ఇందుకు చెప్పుకోదగిన అడ్డంకులు ఏవీ లేవని ట్రంప్ అన్నారు. ఇలావుంటే, దక్షిణ కొరియాలో జిన్‌పింగ్‌తో 100 నిమిషాల పాటు తరువాయి 12లో

## ముంపు ప్రాంతాల్లో శాశ్వత చర్యలు చేపట్టాలి

- ప్రభుత్వం వెయ్యి కోట్లు కేటాయించాలి : సిపిఐ డిమాండ్
- వరంగల్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

ప్రజాపక్షం/హనుమకొండ

వరంగల్ నగరంలోని ముంపు ప్రాంతాల్లో శాశ్వత చర్యలు చేపట్టాలని అందుకు ప్రభుత్వం వెయ్యి కోట్లు కేటాయించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మొంథా తుఫాన్ ప్రభావంతో నీట మునిగిన నగరంలోని పలు ప్రాంతాలను సిపిఐ బృందం గురువారం సందర్శించింది. నగరంలోని హనుమకొండ బస్టాండ్, ములుగు రోడ్, హనుమాన్ నగర్, పలువేల్పుల, గోపాల్ పూర్, సమ్మయ్య నగర్, తరువాయి 2లో





## ప్రాణనష్టం జరగనీయొద్దు

- తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు
- ధాన్యం సేకరణకు అత్యంత ప్రాధాన్యం
- కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మొంథా తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్న జిల్లాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడ కూడా ప్రాణనష్టం జరగకుండా చూడాలని, పశువులకు ఆపద రాకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, ముంపు గ్రామాలు, కాలనీల్లో ఉంటున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగిన సహాయం అందించాలని ఆదేశించారు. మొంథా తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సిఎం రేవంత్ రెడ్డి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి బి.శివధర్ రెడ్డి, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, తరువాయి 2లో

## మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం నేడు

ప్రజాపక్షం/హైదరాబాద్

కాంగ్రెస్ సీనియర్ నాయకులు, భారత క్రికెట్ జట్టు మాజీకెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ శుక్రవారం మధ్యాహ్నం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రేటర్ హైదరాబాద్ నుంచి ఆయన తొలి మంత్రి కాబోతున్నారు. మధ్యాహ్నం 12:15 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్టుదేవ్ వర్మ అజారుద్దీన్‌తో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఇందుకు సంబంధించి రాజ్‌భవన్‌లో ఏర్పాట్లు చేశారు. తెలంగాణలో 18 మంది మంత్రులకు అవకాశం ఉండగా ప్రస్తుతం 15మంది ఉన్నారు. మరో ముగ్గురికి అవకాశం ఉన్నప్పటికీ మూడవ దఫా జరుగుతున్న మంత్రి వర్గం విస్తరణలో కేవలం అజారుద్దీన్ మాత్రమే మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయిందనున్నారు. అజారుద్దీన్‌తో పాటు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌లను ఎంఎల్‌సిగా ప్రభుత్వం నామినేట్ చేయగా, గవర్నర్ ఆమోదించాల్సి ఉంది.

**అజాహర్‌పై బిజెపి కుట్రలు : భట్టి**

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్‌ను రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకోకుండా బిజెపి కుట్రలు చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క విమర్శించారు. కుట్రలో భాగంగా ఎన్నికల కమిషన్‌కు బిజెపి ఫిర్యాదు చేసిందన్నారు. 'అజారుద్దీన్ దేశ క్రికెట్ జట్టుకు సుదీర్ఘ కాలం కెప్టెన్‌గా వ్యవహరించారు. క్రికెట్‌లో తరువాయి 2లో



## కొత్త సిజెఐ నియామకానికి రాష్ట్రపతి ఆమోదం

- 53వ సిజెఐగా ప్రమాణం చేయనున్న జస్టిస్ సూర్యకాంత్



**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి అవసరమైన ప్రక్రియ పూర్తయ్యింది. సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. దీంతో సుప్రీంకోర్టు 53వ సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. నవంబరు 24న సిజెఐగా ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. 2027 ఫిబ్రవరి 9న పదవీ విరమణ చేయనున్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టబోతున్న తొలి హరియాణా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ నిలవనున్నారు. జస్టిస్ సూర్యకాంత్‌కు అభినందలు తెలుపుతూ కేంద్ర న్యాయమంత్రి తరువాయి 12లో

## రాష్ట్రంలో బిజెపి ఆటలు సాగవు

- గత బిఆర్ఎస్ ప్రభుత్వ అప్పులు, కేంద్ర సర్కార్ కుట్రలతో తెలంగాణకు తిప్పలు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




ప్రజాపక్షం/హుజూర్‌నగర్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవడానికి గత ప్రభుత్వాలు చేసిన అప్పులు ఒక కారణమైతే, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అనాథగా చేసేందుకు కుట్రలు పన్నుతుండటం మరో కారణమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బిజెపి ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణ రాష్ట్రంలో వారి ఆటలు సాగవని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి సిపిఐ పూర్తి మద్దతు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని తరువాయి 2లో

### ప్రజా ఉద్యమాల పునరుజ్జీవంతోనే మార్పు

**సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి**



ప్రస్తుతం దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న రాజకీయ సవాళ్లు మతోన్మాదం, పెట్టుబడి ఆధిపత్యం, కార్పొరేట్ శక్తుల దోపిడీ వంటి వాటికి పరిష్కారం కమ్యూనిజం మాత్రమేనని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. సామ్రాజ్యవాద లౌకిక శక్తులన్నీ ఐక్యంగా ప్రజా ఉద్యమాలను పునర్జీవింప చేయడమే మార్పుకు కారణం అవుతుందని తరువాయి 2లో



## చిన్నారుల నిర్బంధం పోలీస్ కాల్పుల్లో నిందితుడు హతం

**ముంబయి :** ముంబయిలో ఆడిషన్స్ కోసం వచ్చిన చిన్నారులను ఓ వ్యక్తి బంధించాడు. ఈ ఘటనలో 17 మంది చిన్నారుల సహా 19 మందిని పోలీసులు రక్షించగా.. ఈ క్రమంలో జరిగిన ఎదురు కాల్పుల్లో నిందితుడు హతమయ్యాడు. రెస్క్యూ ఆపరేషన్ సమయంలో నిందితుడు కాల్పులు జరిపాడని, దీంతో ఎదురు కాల్పులు జరపాల్సి వచ్చిందని పోలీసులు వెల్లడించారు. తీవ్ర గాయాలైన అతడిని ఆసుపత్రికి తరువాయి 12లో

## దారి మార్చారని బీమా తిరస్కరించొద్దు

- ప్రమాదం జరిగినప్పుడు యజమాని లేదా ఆపరేటర్‌ను ప్రత్యక్ష బాధ్యత నుంచి రక్షించడమే బీమా పాలసీ ఉద్దేశ్యం
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** ప్రమాదానికి గురైన వాహనం మార్గం విచలనం (రూట్ డీవియేషన్) కారణంతో, అది పర్మిట్‌ను ఉల్లంఘించిందని బీమా కంపెనీలు ప్రమాద బాధితులకు పరిహారాన్ని తిరస్కరించలేవని గురువారం సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రస్తుత విషయంలో బీమా పాలసీ ఉద్దేశ్యం అటువంటి ఊహించని లేదా దురదృష్టకర సంఘటన జరిగినప్పుడు యజమాని లేదా ఆపరేటర్‌ను ప్రత్యక్ష బాధ్యతనుండి రక్షించడమేనని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కరోల్, ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం చెప్పింది. 'ప్రమాదం పర్మిట్ పరిధికి తరువాయి 12లో

## హెచ్-1బి వీసా ఆటోమేటిక్ పొడిగింపు రద్దు

భారత వలసదారులు, ఐటి ఉద్యోగులు, విదేశీ కార్మికులపై తీవ్ర ప్రభావం




**వాషింగ్టన్:** హెచ్1బి వీసా ఫీజును 1 లక్ష డాలర్లకు పెంచిన కొన్ని వారాలకే, అమెరికా ప్రభుత్వం విదేశీయుల పని అనుమతుల ఆటోమేటిక్ పొడిగింపును రద్దు చేసింది. ఈ నిర్ణయం భారత వలసదారులు, ఐటి ఉద్యోగులు, విదేశీ కార్మికులపై తీవ్ర ప్రభావం చూపనుంది. అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డిహెచ్ఎస్) విడుదల చేసిన ప్రకటనలో, విదేశీయుల ఉద్యోగ అనుమతులు పొడిగించే ముందు తగిన విధంగా పరిశీలన, భద్రతా ధృవీకరణ జరగడం అవసరమని పేర్కొంది. కొత్త నిబంధనల ప్రకారం, తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో 18 ఉగ్రవాదుల కాల్చివేత

**క్వెట్టా :** నిరసనలు, ప్రదర్శనలు, హింసాత్మక ఘటనలతో అట్టుడుకుతున్న బలోచిస్తాన్ ప్రావిన్స్‌లో జరిగిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో 18 మంది ఉగ్రవాదులను హతమార్చినట్లు పాకిస్తాన్ సైన్యం గురువారం ప్రకటించింది. నిఘా వర్గాల సమాచారం మేరకు ఈ ఆపరేషన్లను నిర్వహించినట్లు తెలిపింది. సైన్యంలోని ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పిఆర్) విడుదల చేసిన ప్రకటనలో, బుధవారం రాత్రి క్వెట్టా జిల్లాలోని చిల్తాన్ పర్వత ప్రాంతంలో, అదే విధంగా కేచ్ జిల్లాలోని బులేదా ప్రాంతంలో రెండు వేర్వేరు ఇంటెలిజెన్స్ ఆధారిత ఆపరేషన్లు జరిగాయి. ఉగ్రవాదులు తమతమ స్థావరాల్లో ఉన్నప్పుడు భద్రతా బలగాలు దాడి చేశాయి. ఉగ్రవాదులు ఎదురుకాల్పులకు దిగారు. కాల్పుల అనంతరం చిల్తాన్‌లో 14 మంది ఉగ్రవాదులు, కేచ్‌లో మరో నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ ప్రాంతాల నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రి మరియు పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు పాకిస్తాన్ సైన్యం తెలిపింది. ఆ ప్రాంతంలో ఇంకా దాగి ఉన్న ఉగ్రవాదులను పూర్తిగా నిర్మూలించేందుకు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నట్లు పేర్కొంది.



## విద్యుత్ వ్యవస్థలపై రష్యా దాడులు

### ఉక్రేన్ ఆరోపణ.. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కీవ్ :** తమ విద్యుత్ మౌలిక సదుపాయాలపై రష్యా భారీ డ్రోన్, క్షిపణి దాడులు కొనసాగిస్తున్నదని ఉక్రేన్ ఆరోపిస్తున్నది. తాజా దాడి కారణంగా దేశంలోని అనేక ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు, పరిమితులు తప్పలేదని పేర్కొంది. ఈ దాడులను వ్యవస్థీకృత 'ఇంధన ఉగ్రవాదం'గా అభివర్ణించింది. తీవ్ర చలి కాలం సమీపిస్తున్న వేళ రష్యా దాదాపు ప్రతిరోజూ ఉక్రేన్ విద్యుత్ వ్యవస్థపై దాడులు చేస్తోందని ఉక్రేన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీ విమర్శించారు. కాగా, ఈ తాజా దాడుల్లో కనీసం ఇద్దరు మరణించగా, 2 నుండి 16 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలు సహా 17 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. వారి ప్రకటనను అనుసరించి, ప్రకారం, రష్యా ఈ దాడిలో 650కి పైగా డ్రోన్లు, 50కిపైగా వివిధ రకాల క్షిపణులు ప్రయోగించింది. ఉక్రేన్ నగరాలు నీటి సరఫరా, కాలువలు, వేడి వ్యవస్థలు వంటి మౌలిక సదుపాయాలను నిర్వహించడానికి కేంద్రీకృత ప్రజా వ్యవస్థలను ఉపయోగిస్తాయి. విద్యుత్ అంతరాయం వాటి పనితీరును పూర్తిగా నిలిపేస్తుంది. అందుకే, విద్యుత్ వనరులను దెబ్బతీయడానికి రష్యా ప్రయతిస్తున్నదని ఉక్రేన్ ఆరోపిస్తున్నది. ప్రజల మనోధైర్యాన్ని దెబ్బతీయడం, అలాగే ఆయుధ తయారీ, యుద్ధ సంబంధిత కార్యకలాపాలను అడ్డుకోవడమే రష్యా ప్రధాన లక్ష్యంగా పేర్కొంటున్నది. రష్యా తన పొరుగు దేశంపై పూర్తి స్థాయి ఆక్రమణ ప్రారంభించి దాదాపు నాలుగేళ్లు కావస్తున్న విషయం తెలిసిందే.

## ఆండ్రూస్ నివేదిక తప్పులతడక

### ఐక్యరాజ్య సమితిలో భారత్ విమర్శ.. ఆధారరహిత ఆరోపణలు చేశారని ఆగ్రహం



**జనరల్ అసెంబ్లీ, ఐక్యరాజ్యసమితి:** మయన్మార్‌లో మానవ హక్కుల పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి థామస్ ఆండ్రూస్ సమర్పించిన నివేదికను తప్పులతడకగా భారత్ అభివర్ణించింది. ఇందులో ఆధారరహిత ఆరోపణలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆగ్నేయాసియా దేశం నుండి వచ్చిన శరణార్థులు పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని ఆ నివేదికలో పేర్కొన్నారు. అయితే, పక్షపాతంతో కూడిన దృష్టితో చేసిన విశ్లేషణగా దీనిని భారత్ పేర్కొంది. ఈ నివేదికను ఖండిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలోని సాధారణ సభ మూడవ కమిటీలో జరిగిన ఇంటరాక్టివ్ చర్చలో మయన్మార్‌లో మానవ హక్కుల పరిస్థితిపై భారతదేశం తరఫున పార్లమెంటు సభ్యుడు దిలీప్ సైకియా ప్రకటన చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ఆండ్రూస్ తన నివేదికలో ప్రస్తావిస్తూ, జమ్మూకశ్మీర్‌లో హిందూ పర్యాటకులపై జరిగిన ఆ దాడి అనంతరం, మయన్మార్ శరణార్థులు భారత్‌లో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని ఆరోపించారు. నిజానికి ఆ దాడిలో మయన్మార్ పౌరులు ఎవరూ పాల్గొనకపోయినా, వారు తీవ్ర వివక్షకు గురవుతున్నారని పేర్కొన్నారు. భారత్‌లోని శరణార్థులను అధికారులు ఇటీవల పిలిపించి, నిర్బంధించి, విచారణ పేరుతో వేధించారని, జైలుశిక్ష తప్పదని భయపెట్టారని ఆండ్రూస్ నివేదిక తెలిపింది. ఈ ఆరోపణలను ఖండిస్తున్నట్లు, పహల్గామ్ ఉగ్రదాడి మయన్మార్ నుండి తరలివచ్చిన ప్రజలపై ప్రభావం చూపిందని చెప్పడం పూర్తిగా అసత్యమని సైకియా అన్నారు. ఇలాంటి పాక్షికతతో కూడిన, ఏకపక్ష విశ్లేషణను తిరస్కరిస్తున్నామని, నిజానికి వివిధ దేశాల నుంచి వస్తున్న శరణార్థుల్లో తీవ్రవాదం ప్రమాదకర స్థాయిలో ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితి సమాజానికే చట్టం, శాంతి, భద్రతాపరమైన అంశాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఎవరూ ధ్రువీకరించని అంశాలపైగాని, వాస్తవాలను వక్రీకరించే ఒక వర్గం మీడియా కథనాలపైగాని ఆధారపడి నివేదికలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. భారత్‌లో అన్ని మతాల వారు నివసిస్తున్నారని, వారిలో ముస్లింలు 20 కోట్ల మంది ఉన్నారని సైకియా అన్నారు. ఇది ప్రపంచ ముస్లింలలో దాదాపు 10 శాతంగా వివరించారు. మయన్మార్‌తో భారత్ దశాబ్దాలుగా సత్సంబంధాలు ఉన్నాయని, అక్కడ శాంతి, స్థిరత్వం, ప్రజాస్వామ్యానికి దారి చూపే అన్ని చర్యలను మద్దతు ఇస్తూనే ఉందని అన్నారు. ఈ ఏడాది మార్చిలో భూకంపం సంభవించిన వెంటనే, భారత్ 'ఆపరేషన్ బ్రహ్మ'ను ప్రారంభించి, 1,000 మెట్రిక్ టన్నులకుపైగా సహాయక సామగ్రిని పంపించిందని, వైద్య బృందాలను పంపిందని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య అనుమానాలు రేకెత్తించే రీతిలో నివేదికలు దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.

## 2030 నాటికి చంద్రుడిపైకి చైనా వ్యోమగాములు



**జియుక్వాన్ (చైనా) :** చంద్రుడిపై 2030 నాటికి వ్యోమగాములను దింపేందుకు చేసిన ప్రణాళికలు సమయానుసారంగా సాగుతున్నాయని చైనా గురువారం ప్రకటించింది. అంతరిక్ష పరిశోధనలో ప్రపంచ నాయకత్వం సాధించాలనే దేశ లక్ష్య భాగంగా, ఈ అంతరిక్ష కేంద్రానికి వెళ్ళబోయే తదుపరి వ్యోమగాముల బృందాన్ని కూడా పరిచయం చేసింది. చంద్రుడిపైకి మనిషిని పంపే పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలన్నీ సజావుగా సాగుతున్నాయని చైనా మానవ సహిత అంతరిక్ష కార్యక్రమ ప్రతినిధి ఝాంగ్ జింగ్‌బో తెలిపారు. ఆయన లాంగ్ మార్చ్10 రాకెట్, చంద్ర ల్యాండింగ్ సూట్లు, పరిశోధన వాహనం వంటి పరికరాలను ఈ ప్రాజెక్టులో విజయవంతమైన దశలుగా పేర్కొన్నారు. 2030 నాటికి చంద్రుడిపై చైనా వ్యోమగామిని దింపాలన్న తమ స్థిరమైన లక్ష్యం దృఢంగానే ఉందని అన్నారు. చైనా ప్రస్తుతం తన విస్తృత అంతరిక్ష ప్రణాళికలో భాగంగా తియాంగోంగ్ (ఆకాశభవనం) అంతరిక్ష కేంద్రంలో మిషన్‌ను కొనసాగించేందుకు కొత్త వ్యోమగాముల బృందాన్ని పంపేందుకు సిద్ధమవుతోంది. ప్రతి బృందం ఆ కేంద్రంలో ఆరు నెలలు గడుపుతూ వివిధ శాస్త్రీయ ప్రయోగాలు నిర్వహిస్తుంది. తాజా బృందంలో ఝాంగ్ లూ, వూ ఫేయి, ఝాంగ్ హోంగ్‌ఝాంగ్ ఉన్నారు. వీరు చైనా కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి 11:44 గంటలకు జియుక్వాన్ ప్రయోగ కేంద్రం నుండి బయలుదేరుతారు. ఝాంగ్ లూ ఇంతకుముందు షెన్‌ఝౌ 15 మిషన్‌లో పాల్గొన్నారు. అయితే, వూ ఫేయి, ఝాంగ్ హోంగ్‌ఝాంగ్‌లకు ఇది మొదటి అంతరిక్ష ప్రయాణం అవుతుంది. ఈ ప్రయాణంలో వ్యోమగాములు నలుగురు తమ వెంట రెండు ఆడ, మరో రెండు మొగ ఎలుకలను కూడా తీసుకువెళతారు. గురుత్వాకర్షణ ప్రభావం లేని వాతావరణం, పరిమిత స్థల జీవన పరిస్థితులు జంతువులపై ఎలాంటి ప్రభావం చూపుతాయనే విషయంపై వీరు అధ్యయనం చేస్తారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) ప్రాజెక్టులో అమెరికా జాతీయ భద్రతా కారణాల వల్ల చైనాకు అనుమతి ఇవ్వలేదు. దీనితో చైనా తన స్వంత అంతరిక్ష కేంద్రం తియాంగోంగ్ (అంటే దివ్య ప్రాసాదం) నిర్మాణాన్ని ప్రారంభించింది.

## పొడిగింపు రద్దు (మొదటి పేజీ తరువాయి)

ఈనెల 30వ తేదీ లేదా ఆ తర్వాత తమ 'ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్' (ఇఎడి) పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసే విదేశీయులకు ఆటోమేటిక్ పొడిగింపు లభించదు. అయితే దీనిని సాధారణ జాగ్రత్త చర్య మాత్రమేనని యుఎస్‌సిఐఎస్ డైరెక్టర్ అధికారి స్పష్టం చేశారు. అమెరికాలో పనిచేయడం హక్కు కాదని, అది ఒక సౌభాగ్యమని వ్యాఖ్యానించారు. కాగా, ఈ మార్పు వల్ల అమెరికాలో ఉద్యోగ అనుమతులకు దరఖాస్తు చేసే విదేశీయులపై మరింత లోతైన భద్రతా పరిశీలనలు జరుగుతాయి. ఈ నిర్ణయంతో ప్రభావితమయ్యే వారిలో హెచ్1బి, ఎల్, ఇ– వీసా కలిగిన ప్రధాన వలసదారుల జీవిత భాగస్వాములు, అలాగే శరణార్థులు, ఆశ్రయం పొందిన వారు ఉంటారు. ఇలావుంటే, డిహెచ్ఎస్ విదేశీయులను హెచ్చరిస్తూ, తమ ఇఎడి గడువు ముగియడానికి కనీసం 180 రోజుల ముందు పునరుద్ధరణ దరఖాస్తు సమర్పించాలని సూచించింది. అయితే, ఈనెల 30వ తేదీకి ముందు ఆటోమేటిక్‌గా పొడిగించిన పని అనుమతులపై కొత్త నిబంధనల ప్రభావం ఉండదని వివరించింది. మునుపటి బైడెన్ పరిపాలనలో అమలులో ఉన్న నిబంధన ప్రకారం, సమయానికి ఫామ్ I 765 దాఖలు చేసిన విదేశీయులకు 540 రోజుల పాటు ఆటోమేటిక్ పొడిగింపు లభించేది. కాగా, ఈ ఏడాది సెప్టెంబర్ 19న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేసిన ఉత్తర్వు ద్వారా హెచ్1బి వీసా ఫీజు సంవత్సరానికి 1 లక్ష అమెరికన్ డాలర్లుగా పెంచారు. యుఎస్ జనగణన బ్యూరో గణాంకాల ప్రకారం, 2022 నాటికి అమెరికాలో సుమారు 48 లక్షల మంది భారతీయ మూలాలున్న అమెరికన్లు నివసిస్తున్నారు.

## పునరుజ్జీవంతోనే మార్పు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. అదాని గ్రూపుకు ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెట్టి ప్రజల సొమ్మును మోదీ ప్రభుత్వం దారాదత్తం చేస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వాల హయాంలో కేంద్రంలో ఏర్పాటు చేసిన సంస్థలన్నింటిని ప్రైవేట్ పరం చేస్తూ బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లాభం చేకూరుస్తుందన్నారు. నష్టాలు వస్తున్నాయనే వంకతో కేంద్రంలోని సంస్థలను కార్పొరేట్ వ్యక్తులకు అప్పగించి వారికి రుణాలు మాఫీ చేయడం, రాయితీలు ఇవ్వడం, సహాయం చేయడంపై కేంద్ర ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తారు.ఎల్ఐసి లాంటి సంస్థల్లో కూడా ప్రైవేట్ సంస్థలకు లాభం చేకూర్చేలా మార్పులు చేస్తూ కార్పొరేట్ శక్తులకు జాతీయ సంపదను దోచిపెట్టేందుకు మార్గం ఏర్పాటు చేశారన్నారు. కేంద్రంలోని ఎన్నికల సంఘం పారదర్శకంగా పనిచేయవల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితాను సవరిస్తూ అర్హులైన అణగారిన వర్గాల ఓట్లను తొలగిస్తుందని తెలిపారు.

## బిజెపి ఆటలు సాగవ్

(మొదటి పేజీ తరువాయి)

విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో గురువారం సిపిఐ జిల్లా విస్తృతస్థాయి సమావేశం సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కూనంనేని ప్రసంగిస్తూ దేశంలో సిపిఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంలో డిసెంబర్ 26న భారీ బహిరంగ సభను 5 లక్షల మందితో నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్భాటాల కోసం 100 వసంతాల బహిరంగ సభ నిర్వహించడం లేదని, గత త్యాగాల చరిత్రను ప్రజల ముందు ఉంచేందుకు సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వలన దేశంలో మతోన్మాదం పెరుగుతుందని అన్ని రంగాల్లో మత ప్రాధాన్యత ఉంటుందని దేశాన్ని మత రాజ్యంగా మార్చేందుకు బిజెపి కుయుక్తులు పన్నుతున్నదని విమర్శించారు. సామ్యవాద లౌకిక భావాలను పెంపొందించేందుకు సామాజిక మార్పు తెచ్చేందుకు కమ్యూనిస్టులు కృషి చేస్తారని తెలిపారు. అధికారంలోకి రాకున్నా కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు త్యాగాలు బలిదానాల వలన 100 సంవత్సరాలు ప్రజల గుండెల్లో ఉందన్నారు.

### ఆంక్షలు విధించకుండా పంట కొనుగోళ్లు : నెల్లికంటి

తుఫాన్‌తో రాష్ట్రంలో పత్తి, వరి తదితర పంటలకు అపార నష్టం జరిగిందని, రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. రాష్ట్రంలో వరి, పత్తి లాంటి వ్యవసాయ ఉత్పత్తులను ఎటువంటి ఆంక్షలు విధించకుండా ప్రభుత్వం కొనుగోలు చేసి, పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేసి, రైతులను ఆదుకోవాలని కోరారు. కేంద్రం తెలంగాణ రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమ చూపకుండా నష్టపోయిన రైతులందరికి వెంటనే సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రధాని వి.పి.సింగ్ మండల్ కమిషన్‌ను అమల్లోకి తెచ్చినప్పుడు కూడా బిసి ప్రజలను పక్కదారి పట్టించింది, మోసం చేసింది బిజెపి పార్టీనే అని విమర్శించారు. 42 శాతం బిసి రిజర్వేషన్ బిల్లు నోటితో మద్దతు పలికి, నొసటితో విమర్శించినట్లు ఉంది బిజెపి పార్టీ విధానం అన్నారు. బిసిల ప్రథమ శత్రువు బిజెపి ప్రభుత్వం పార్టీనేనని తెలంగాణ ప్రజలు గ్రహించారన్నారు. సిపిఐ పార్టీ 100 వసంతాల బహిరంగ సభలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్ ప్రసంగించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు స్వాగత ఉపన్యాసం చేయగా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్ అమరుల సంతాపతీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరం మల్లేశ్వరి, ధూళిపాల ధనుంజయ నాయుడు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉస్తెల నారాయణరెడ్డి, మండవ వెంకటేశ్వర్లు, సాయిబ్ అలి, మేకల శ్రీనివాస్, బద్దం కృష్ణారెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## శాశ్వత చర్యలు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

వరంగల్‌లోని హంటర్ రోడ్ తదితర ప్రాంతాలను సిపిఐ నాయకులు సందర్శించి స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ముంపు ప్రాంతాలను పరిశీలించిన అనంతరం సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతీ ఏటా వర్షాకాలంలో భారీ వర్షాలకు వరంగల్ నగరం అతలాకుతలం అవుతున్న దని, లోతట్టు ప్రాంత కాలనీలతో సహా రోడ్లు అన్నీ నీట మునుగుతున్నాయని అన్నారు. ఈ సారి మొంథా తుపాన్ ప్రభావం కారణంగా అత్యంత భారీ వర్షాలు కురియడంతో వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీస్ పూర్తిగా నీట మునిగి ప్రజలు ఇండ్లలో నుండి బయటికి రాలేని పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. గతంలో వరంగల్‌ను రెండవ రాజధానిగా చేస్తామని ప్రగల్భాలు పలికిన పాలకులు నగరాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని అన్నారు. ప్రతీ ఏటా కాలనీలు నీట మునుగుతున్నా గత ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం కోసం నిధులను కేటాయించలేదని, దాంతో అదే పరిస్థితి ప్రతి ఏటా పునరావృతం అవుతున్నదని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అయినా ముంపు ప్రాంతాల శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని, అందుకు రూ. 1000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ సిటి, హెరిటేజ్ సిటీగా ప్రకటించిన కేంద్రం ప్రకటనలకే పరిమితం అయింది తప్ప నిధుల కేటాయింపులో సవతి తల్లి ప్రేమను కనబరుస్తూ వస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యదర్శి సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు అశోక్ స్టాలిన్,మునిగాల బిక్షపతి, ఏదునూరి వెంకట్రాజం, బాషబోయిన సంతోష్, బత్తిని సదానందం, గుంటి రాజేందర్, అలువాల రాజు, జూకంటి పద్మ, పొనుగోటి రాములు, గోపాల్ చారి, పూజారి అమృతయ్య, రమ తదితరులు పాల్గొన్నారు.

## జలదిగ్బంధంలో వరంగల్

(మొదటి పేజీ తరువాయి)

సంతోషి మాతకాలనీ, సాయి గణేష్ కాలనీలోని ప్రవహించడంతో ఇళ్లలోకి వరద నీరు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వరంగల్ తూర్పులో ఆరు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముంపు ప్రాంతాల వాసులను పడవల సహాయంతో పునరావాస కేంద్రాలకు తరలించారు. హనుమకొండలోని ప్రగతి నగర్, వివేక్ నగర్, 100 ఫీట్ రోడ్, కాపువాడ,పోచమ్మకుంట కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. తెల్లవారుజామున 4:30 నుండి ఇళ్లలోనే బిక్కుబిక్కుమంటూ ప్రజలు గడుపుతున్నారు. కరెంటు లేక వాటర్ లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం ఎవరు పట్టించుకోవడం లేదంటూ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రొక్లయిన్ ల ద్వారా పలు చోట్ల నాలాలు తెంపుతూ వరద నీటిని తరలిస్తున్నారు.అలాగే ప్రధాన రహదారులపై కూడా నీరు నిల్వ ఉండడంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి.దీంతో ఆర్టీసి సైతం ముఖ్యమైన రూట్లకు కూడా బస్సులను నిలిపి వేసింది. ఈ క్రమంలో రహదారులపై కూడా నీరు నిల్వఉండకుండా అధికారులు చర్యలు చేపట్టారు.జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ,వరంగల్ ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యేలు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్‌లు సత్యశారధ, స్నేహ శబరీష్, పలు పార్టీల నాయకులు గురువారం వరద కారణంగా నీట మునిగిన పలు కాలనీలను, ప్రధాన రహదరులను,లోతట్టు ప్రాంతాలను సందర్శించారు.

### 118 కాలనీలను ముంచిన మొంథా..!

వరంగల్‌హనుమకొండ జిల్లాలను మొంథా తుఫాన్ ముంచెత్తింది. నగర వ్యాప్తంగా దాదాపు 118 కాలనీలు జలమయమయ్యాయి. కాపువాడ, 100 ఫీట్ల రోడ్డు పరిసర కాలనీలు, హంటర్ రోడ్డు, వివేక్ నగర్, ప్రగతి నగర్, రామన్నపేట, ఉర్సు, సమ్మయ్య నగర్, టీఎన్జీవో కాలనీ, పోతన రోడ్డు ప్రాంతాలు నీట మునిగాయి. పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.ముఖ్యంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వరంగల్,హనుమకొండలోని పలు ప్రాంతాలలో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసి వారికి అవసరమైన నిత్యావసర వస్తువులను అందిస్తున్నారు.

### మున్నేరుకు వరద పోటు

భారీ వర్షాలతో ఖమ్మం జిల్లాలోని మున్నేరుకు వరద పోటెత్తింది. మున్నేరు పరివాహక ప్రాంతంలోని మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురవడంతో బుధవారం సాయంత్రం నుంచి క్రమేపి పెరిగిన మున్నేటి వరద గురువారం ఆరు గంటల సమయానికి 28 అడుగులకు చేరుకుంది. ఎగువ ప్రాంతంలో కాస్త స్థిరంగా ఉన్నప్పటికీ దిగువ ప్రాంతంలో నెమ్మదిగా పెరుగుతుండడం గమనార్హం. మున్నేరుకు భారీగా వరద రావడంతో నగరంలోని పలు కాలనీలు నీట మునిగాయి. మున్నేరుకు ఇరువైపులా ఉన్న కాలనీల్లోకి నీరు చేరడంతో బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నిరంతరం వరద పరిస్థితులను పర్యవేక్షిస్తూ అధికారులకు సూచనలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మున్నేరు ప్రభావిత ప్రాంతాలలో పర్యటించారు. మున్నేరు వరద ఖమ్మం బోనకల్ రోడ్డుపైకి చేరడంతో ఖమ్మం బోనకల్ మధ్య రాకపోకలను నిలిపివేశారు. అర్ధరాత్రి నుంచి మున్నేరుకు వరద తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

### నీట మునిగిన వనదుర్గామాత ఆలయం

మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం మళ్లీ జలదిగ్బంధంలో చిక్కుకుంది. మొంథా తుఫాన్ ధాటికి ఎగువన కురుస్తున్న వర్షాలకు మంజీరా నదికి వరద పెరిగింది. దీంతో గర్భగుడి ఎదుట ఉన్న నదిపాయ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా ఆలయాన్ని మూసివేశారు. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి భక్తులకు దర్శనాన్ని కల్పిస్తున్నారు.

## ప్రమాణ స్వీకారం (మొదటి పేజీ తరువాయి)

దేశానికి ఎంతో సేవ చేశారు. దేశ కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పిన క్రీడాకారులలో అజారుద్దీన్ ఒకరు. అజారుద్దీన్ లాంటి విఖ్యాత క్రీడాకారుడికి మంత్రివర్గంలో అవకాశం కల్పిస్తుంటే బిజెపి అడ్డుకుంటోంది' అని భట్టివిక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో రాజస్థాన్‌లో శ్రీగంగానగర్ జిల్లా శ్రీకరణ్‌పూర్ నియోజకవర్గం ఉప ఎన్నికలో బిజెపి అభ్యర్థిగా ఉన్న సురేంద్ర పాల్ సింగ్‌ను మంత్రివర్గంలోకి తీసుకుందని ఆయన స్పష్టం చేశారు. గాంధీ భవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడారు. అజారుద్దీన్‌పై బిజెపి, బిఆర్ఎస్ కలిసి కుట్ర చేస్తున్నాయని, బిజెపి, బిఆర్ఎస్ తెర వెనుక బంధం గురించి ఇప్పటికే కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారని, రెండు పార్టీల తెర వెనక బంధాన్ని ఆమె బయటపెట్టారని భట్టివిక్రమార్క అన్నారు. గతంలో పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ సహకారంతోనే బిజెపి రాష్టంలో 8 సీట్లు గెలుచుకుందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బిజెపి గెలిచే అవకాశం లేదని తెలిసినందునే బిఆర్ఎస్‌కు లాభం చేసేందుకు చాలా ఆలస్యంగా బలహీనమైన అభ్యర్థిని బిజెపి ప్రకటించిందన్నారు. జూబ్లీహిల్స్‌లో మైనారిటీలు ఎవరూ బిజెపికి ఓటు వేయబోరని, జూబ్లీహిల్స్‌లో బిఆర్ఎస్‌కు లాభం కలిగించడం కోసమే అజారుద్దీన్‌ను మంత్రి కాకుండా బిజెపి అడ్డుకుంటోందన్నారు. అజారుద్దీన్‌తో ప్రమాణ స్వీకారం చేయించకుండా రాష్ట్ర గవర్నర్‌పై బిజెపి ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం ఉందని, తనకున్న సమాచారం ప్రకారం గవర్నర్ గొప్ప వ్యక్తి అని, అలా చేయబోరని భావిస్తున్నానని డిప్యూటీ సిఎం చెప్పారు.

**బిజెపి ద్వంద ప్రమాణాలకు నిదర్శనం :** గతంలో రాజస్థాన్‌లో ఉప ఎన్నిక అభ్యర్థిని మంత్రివర్గంలోకి తీసుకుని, ఉప ఎన్నికకు 20 రోజుల ముందు ఆ యనతో ప్రమాణ స్వీకారం చేయించిన బిజెపి తెలంగాణాలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోకుండా అడ్డుకోవడం బిజెపి ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని భట్టి విక్రమార్క అన్నారు. కేవలం మైనారిటీ అనే ద్వేషంతోనే బిజెపి అజారుద్దీన్ ప్రమాణస్వీకారాన్ని అడ్డుకుంటోందన్నారు. బిజెపి, బిఆర్ఎస్ కుట్రలను మైనారిటీలు అర్థం చేసుకోవాలన్నారు.

## ప్రాణనష్టం జరగనీయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఓఎస్‌డి వేముల శ్రీనివాసులు, విపత్తుల నిర్వహణ విభాగం స్పెషల్ సెక్రెటరీ అరవింద్ కుమార్, హైదరాబాద్ జలమండలి ఎండి అశోక్ రెడ్డితో పాటు తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఈ కాన్ఫరెన్సలోపాల్గొన్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రధానంగా వరి, పత్తి పంటకు నష్టం వాటిల్లిందని మంత్రులు, కలెక్టర్లు ముఖ్యమంత్రికి వివరించారు. ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాతో పాటు, హుస్నాబాద్ నియోజకవర్గంలో వరద నష్టం ఎక్కువగా ఉందని అంచనాకు వచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ధాన్యం సేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మొంథా తుపాను వల్ల ఉత్పన్నమైన పరిస్థితులను గమనంలోకి తీసుకుని ప్రతి కొనుగోలు కేంద్రానికి మండల స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించి బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. అన్ని చోట్ల వరి కోతలు మొదలయ్యాయని, అనుకోని ఉపద్రవం ఏది వచ్చినా రైతులకు ఆవేదన మిగులుస్తుందని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఈసారి 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు తగినట్లుగా పౌరసరఫరాల విభాగం కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. వర్షంతో చాలా చోట్ల ధాన్యం తడిసిపోయిందని, ఐకెపి కేంద్రాలలో ధాన్యం కొట్టుకుపోవడంతో రైతులు నష్టం జరగడం ఆందోళన కలిగించిందని అన్నారు. కళ్లాల్లో, ఐకెపి కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే దగ్గరలోని గోదాములు, మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను సిఎం ఆదేశించారు. మిల్లుల, గోదాములు అందుబాటులో లేని చోట దగ్గరలో ఉన్న ఫంక్షన్ హాళ్లలో నిల్వ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఐకెపి కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికో ఇన్‌చార్జి అధికారిని నియమించాలని, ఇప్పుడున్న ఇన్‌ఛార్జీలు నిర్లక్ష్యంగా ఉంటే వెంటనే వేరే వారిని నియమించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతీ ఐకెపి సెంటర్ నుంచి ఏరోజుకు ఆరోజు సాయంత్రం రిపోర్టు తెప్పించుకోవాలని, రిపోర్ట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించే అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను అప్రమత్తం చేశారు. అధికారులు, ఉద్యోగుల సెలవులు రద్దు చేసి అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించేలా, ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. వర్షాలకు ధాన్యం తడవకుండా తగినన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి. విధానపరమైన నిర్ణయాలు అవసరమైతే వెంటనే సివిల్ సప్లయిస్ కమిషనర్, సిఎస్ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వరద తగ్గిన తర్వాత వ్యవసాయ, రెవెన్యూ విభాగం అధికారులు సంయుక్తంగా సర్వేలు చేసి నష్టం అంచనాలు తయారు చేయాలని నివేదించారు.

### జిల్లా ఇంచార్జ్ మంత్రులు ఎప్పటికప్పుడు సమీక్షించాలి

తుఫాను, వర్షాల ప్రభావమున్న జిల్లాల్లో చేపడుతున్న సహాయక చర్యలు, రోడ్లు, రహదారుల పునరుద్ధరణ చర్యలు ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు జిల్లా ఇంచార్జ్ మంత్రులు సమీక్షించాలని సిఎం కోరారు. తమ సొంత జిల్లాల్లో క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ, ఇన్‌ఛార్జీగా ఉన్న జిల్లాల్లో ప్రజలను ఆదుకునే చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని చెప్పారు. ఎంతటి విపత్తు వచ్చినా ప్రజలను ఆదుకునేందుకు జిల్లాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, అందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సిఎం సూచించారు. ఇప్పటికే రాష్ట్రంలో 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిందని సిఎం అధికారులను అప్రమత్తం చేశారు.

### విద్యుత్, వైద్య సేవలు, రోడ్డు రవాణాకు అంతరాయం కలగవద్దు

వర్షాలతో పాటు ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వెంటనే విద్యుత్తు పునరుద్ధరించే విధంగా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వర్షాలతో ఖమ్మం జిల్లాలో ఒక డిసిఎం వ్యాన్, డ్రైవర్ వాగులో కొట్టుకుపోవటం దురదృష్టకరమని సిఎం అన్నారు. అన్ని రోడ్లు, రహదారులపై ఉన్న బ్రిడ్జిలు, లో లెవల్ కాజ్‌వేలు, కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉంటే ఇలాంటి ఘటనలను నివారించవచ్చని సిఎం అన్నారు. రోడ్లు, రహదారులపైకి వరద నీళ్లు వచ్చే ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాలు అటువైపు వెళ్లకుండా పోలీసులు నిషేధాజ్ఞలు అమలు చేయాలన్నారు. స్థానిక సిఐ, రెవెన్యూ అధికారులు వాహనాలు అటువైపు వెళ్లకుండా రెండు వైపులా బారికేడ్లు పెట్టాలన్నారు. దెబ్బతిన్న రోడ్ల వద్ద ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయాలని, కుంభవృష్టి కురిసే సమయంలో ప్రజలు అవసరమైతే తప్ప రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని అన్నారు. వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరంగల్ లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పోలీసుల సేవలను వినియోగించుకోవాలని, అవసరమైతే హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్‌లను, అవసరమైన సామగ్రిని పంపించాలని సిఎస్, డిజిపిలను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరంగల్‌లో తక్షణ సహాయక చర్యలకు అవసరమైనన్ని పడవలను అక్కడికి పంపించాలని, వివిధ జిల్లాలలో అందుబాటులో ఉన్న ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బందిని తక్షణమే తరలించాలని సిఎస్, డిజిపిని ఆదేశించారు. హైదరాబాద్ నుంచి హైడ్రా సిబ్బందిని, హైడ్రా వద్ద ఉన్న వరద సహాయక సామాగ్రిని కూడా అత్యవసరమైన చోట వినియోగించుకునే చర్యలు చేపట్టాలని సిఎం ఆదేశించారు. ఇప్పటికే 9 రిలీఫ్ క్యాంప్‌లను ఏర్పాటు చేసి రెండు వేల మందిని వరంగల్‌లో వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని, ఎక్కడైనా వరదలో ఇండ్ల కప్పులు, బంగ్లాలపై చిక్కుకున్న కుటుంబాలకు డ్రోన్ల ద్వారా తాగునీటితో పాటు, ఫుడ్ పాకెట్లు సరఫరా చేయాలని సూచించారు. వరంగల్‌లో వరద బాధితులకు అందించే సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, 24 గంటలు పరిస్థితిని పర్యవేక్షించేందుకు వీలుగా కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ హెల్ప్ సెల్‌ను ఏర్పాటు చేయాలని సిఎం సూచించారు. రాష్ట్ర స్థాయిలోనూ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో హెల్ప్ లైన్ ఏర్పాటు చేసి వర్షాలు, వరదలు, విపత్తులు వచ్చినప్పుడు వెంటనే స్పందించే విధంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

### సిఎం ఏరియల్ సర్వే

వరంగల్, హుస్నాబాద్ వరద ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే చేపట్టనున్నారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న ప్రాంతాలు, పంట నష్టం వాటిల్లిన ప్రాంతాలను సిఎం పరిశీలిస్తారు. గురువారం ఉదయమే వరద ప్రభావిత జిల్లాలకు వెళ్లేందుకు రేవంత్ రెడ్డి సిద్ధపడ్డారు. ఆఖరి నిమిషంలో సిఎం పర్యటన రద్దయింది. వాతావరణం అనుకూలించకపోవటంతో హెలికాప్టర్ ప్రయాణం వీలు కాదని ఏరియల్ సర్వేకు అధికారులు అనుమతించలేదు. గురువారం వాతావరణం అనుకూలించకపోవటంతో తాను రాలేకపోయానని, శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వేకు వస్తానని వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం ప్రకటించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## న్యాక్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ
### అభ్యర్థులకు సర్టిఫికెట్, ఉద్యోగావకాశాలు కల్పించిన
### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసి) ఆధ్వర్యంలో, వారధి ట్రస్ట్ సహకారంతో ఉద్యోగావకాశాలతో కూడిన నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, ఎన్ఏసి వైస్ చైర్మన్ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సివిల్ సూపర్వైజర్‌తో పాటు ఎలక్ట్రీషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, శిక్షణతో పాటు ఉచిత భోజనం, నివాసం మరియు వసతి సదుపాయాలు కల్పించబడతాయన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగావకాశాలు అందించబడుతాయని, ఈ శిక్షణ కార్యక్రమం నవంబర్ 3 నుండి నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసి) హైదరాబాద్‌లో ప్రారంభమవుతుందని మంత్రి తెలిపారు. శిక్షణకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం నంబర్లు: 8008937800 / 9032504507 సంప్రదించాలని తెలిపారు.

## మొంథా తుఫాన్ ప్రభావంతో ...
# ప్రాథమిక అంచనా ప్రకారం 4,47,864 ఎకరాల్లో పంట నష్టం
### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మొంథా తుఫాన్ ప్రభావంతో చోటు చేసుకున్న పంట నష్టంపై పూర్తి స్థాయి సర్వే చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. తుఫాన్ కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పంట నష్టంపై ప్రాథమిక నివేదికను గురువారం మంత్రి వెల్లడించారు. తుఫాన్ ప్రభావంతో 12 జిల్లాల్లో 179 మండలాల్లో 2,53,033 మంది రైతులకు చెందిన 4,47,864 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు అంచనా వేశారని తెలిపారు. ఇందులో వరి 2,82,379 ఎకరాలు, పత్తి 1,51,707 ఎకరాల్లో నష్టపోయినట్లు నివేదికలో తెలిపారు.....పంట నష్టం ఎక్కువగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో చోటు చేసుకుందని, 1,30,200 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లగా ,తరువాత స్థానంలో ఖమ్మం జిల్లా 62,400 ఎకరాల్లో, నల్గొండ జిల్లాలో 52,071 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక నివేదిక అందని వెల్లడించారు. పూర్తి స్థాయి సర్వే చేపట్టి తక్షణమే నివేదిక అందజేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

**నష్ట పోయిన ప్రతి రైతును ఆదుకుంటాం : మంత్రి తుమ్మల**

మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. వరద ప్రభావిత జిల్లాల్లో సిఎం రేవంత్ రెడ్డి పర్యటిస్తారని, రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రకటించారు. ఎకరాకు ఎంత పంట నష్ట పరిహారం ఇవ్వాలో సిఎం రేవంత్ రెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి తుమ్మల వెల్లడించారు.

## ఓవర్సీస్ స్కాలర్ షిప్ బకాయిల నిధులు
# రూ.304కోట్లు విడుదల
### మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పెండింగ్‌లో ఉన్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులు రూ.304 కోట్లు విడుదల చేశామని ఎస్‌సిఎస్‌టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని నిధులు విడుదలచేశామని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాల విద్యార్థులందరికీ విద్య ద్వారా సమాన అవకాశాలు వారి ఉజ్వల భవిష్యత్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఒక్క విద్యార్థికి ఓవర్సీస్ నిధులు 20 లక్షలు ఇచ్చామని తెలిపారు. 2,288 మంది విద్యార్థులకు అక్టోబర్‌లో సుమారు రూ.304కోట్ల నిధులు విడుదల చేశామని అన్నారు. ఇప్పటివరకు మొత్తం 3642 మంది విద్యార్థులకు గాను రూ.463 కోట్లు విడుదల చేశామని పేర్కొన్నారు. 2022 నుంచి ఈ రోజు వరకు బకాయిలను విడుదల చేశామని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమవుతుందన్నారు. విదేశాల్లో ఉన్నత విద్యను కొనసాగిస్తున్న తెలంగాణ విద్యార్థులు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గమనించి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ నిధుల విడుదల ద్వారా విద్యార్థుల కలలను నెరవేర్చడంతో పాటు వారి కుటుంబాల్లో వెలుగులు నింపింది. విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదనను మా ప్రభుత్వం అర్థం చేసుకుంది. యూకే,అమెరికా, యూరప్, ఆస్ట్రేలియాతో పాటు పలు దేశాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మా ప్రభుత్వం ఊరట కల్పించింది.ప్రస్తుతం విదేశాల్లో అననుకూల పరిస్థితుల కారణంగా మన రాష్ట్ర విద్యార్థులు పడుతున్న ఇబ్బందులకు ఈ నిధుల ద్వారా వారికి ఉపశమనం లభిస్తుంది. సంక్షేమ హాస్టల్స్‌లో (ఎస్‌సి,ఎస్‌టి,బిసి, మైనార్టీ) హాస్టల్స్ తక్షణ ఇబ్బందులను అధిగమించేందుకు రూ. 60 కోట్లు విడుదల చేశామని తెలిపారు. ఈ నిధులు జిల్లా కలెక్టర్లు, సెక్రటరీ పరిధిలో ఉంచామని స్పష్టం చేశారు. సిఎం సహాయ నిధి నుంచి సంక్షేమ హాస్టల్ పిల్లలకు నిదులు అందించామని తెలిపారు. 119 నియోజకర్గాల్లో సుమారు రూ. 200 కోట్ల బడ్జెట్ తోని యంగ్ ఇంటి గ్రేటేడ రెసిడెన్షియల్ పాఠశాలలకు సిఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. సంక్షేమ హాస్టల్లో ఏ సమస్య ఉన్న తక్షణ పరిష్కారం కోసం నిధులు మంజూరు చేశామన్నారు. గత 10 ఏళ్లు పరిపాలించిన వారు సంక్షేమ హాస్టల్స్ పిల్లల డైట్ కోసం ఆలోచన చేయలేదన్నారు. సిఎం, డిప్యూటీ సిఎం చొరవతో డైట్ ఛార్జీలు పెంచామని అన్నారు. తమ అధికారులందరూ సంక్షేమ పాఠశాలలు, హాస్టల్స్ విద్యార్థులకు ఏ సమస్య ఉన్న తక్షణం పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తున్నారన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి అర్హత ఉన్న వారికే ఇస్తాం .... అనర్హులకు ఇవ్వం అని స్పష్టం చేశారు. ఈ నిధుల విడుదలకు కృషి చేసిన మా సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క కు ధన్య వాదాలు తెలిపారు. ఈ సమావేశంలో వెల్ఫేర్ చీఫ్ సెక్రటరీ సభ్యసాచి గోష్, ఎస్ సి డి డి చీఫ్ సెక్రటరీ బుద్ధ ప్రకాష్, కమిషనర్ క్షితిజ, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అదనపు డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జ్యుడీషియల్ రిమాండ్‌కు యాదగిరిగుట్ట ఇన్‌చార్జి ఎస్ఇ
### రూ.11.90 లక్షల బిల్లుకు 20 శాతం కమిషన్ డిమాండ్

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కిన ఇన్‌చార్జి ఎస్ఇ ఊడెపు రామారావును జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎసిబి డిఎస్పీ జగదీశ్ చందర్ తెలిపారు. యాదగిరిగుట్టలో ఇవాళ విలేకరులతో మాట్లాడారు. రామారావు ప్రస్తుతానికి దేవాదాయ శాఖలో ఎలక్ట్రిసిటీ ఇన్‌చార్జి ఎస్ఇగా వ్యవహరిస్తున్నారు. యాదగిరిగుట్టకు చెందిన ఒక కాంట్రాక్టర్ గుట్ట దేవస్థానంలో లడ్డూ మిషనరీని మూడు నెలల క్రితం టెండర్ ద్వారా సప్లై చేశాడు. దీనికి సంబంధించి రూ.11.90లక్షల బిల్లు అయింది. అయితే ఈ బిల్లు మంజూరు చేయడానికి టెంపుల్ ఇఇ రామారావు బిల్లులో 20 శాతం లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అయితే అంత ఇచ్చుకోలేనని చెప్పడంతో రూ.1.90లక్షలు ఇవ్వడానికి అంగీకరించాడు. అయితే లంచం ఇవ్వడం ఇష్టం లేక వెంటనే నల్లగొండ ఎసిబి అధికారులను సంప్రదించాడు. దీంతో ఎసిబి అధికారులు రంగంలోకి దిగి రామారావుపై నిఘా పెట్టారు. ప్రస్తుతం మేడారం జాతర ఇన్‌చార్జి ఎస్ఇగా రామారావు వ్యవహరిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం మేడారంకు వెళ్లి తిరిగి వస్తూ ఫిర్యాదుదారుడైన కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి హైదరాబాద్ బోడుప్పల్‌లో కలవమని చెప్పాడు. కాంట్రాక్టర్ అక్కడ కలిసిన తర్వాత ఆయన నుంచి రామారావు రూ.1.90లక్షలు తీసుకున్నాడు. వెంటనే అక్కడే ఉన్న ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా రామారావును అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. రామారావును నాంపల్లి ఎసిబి కోర్టులో ప్రవేశపెట్టి అక్కడి నుంచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎసిబి అధికారులు వెల్లడించారు.

### ఎసిబికి పట్టుబడ్డ మెదక్ ట్రాన్స్‌కో డిఇ



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజినీర్ షేక్ షరీఫ్ చాంద్ బాషా ఎసిబికి పట్టుబడ్డాడు. రూ.21వేల నగదు తీసుకుంటుండగా ఉమ్మడి మెదక్ జిల్లా ఎసిబి డిఎస్పీ సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పట్టుకున్నారు. డిఎస్పీ వివరాల ప్రకారం మెదక్ జిల్లా పాపన్నపేట మండలం సీతానగరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొత్త పౌల్ట్రీ ఫారం ఏర్పాటు చేసుకొనుటకు అందుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చుటకు డిఇ 40 వేల రూపాయలు డిమాండ్ చేయగా, 30వేల ఇచ్చుటకు ఒప్పందం కుదిరింది. ముందుగా తొమ్మిది వేలు చెల్లించగా, గురువారం 21 వేల రూపాయలు లంచం ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## హెచ్‌ఆర్సీ ఉత్తర్వులపై స్టే

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థుల సర్టిఫికెట్లు, ఇతర డాక్యుమెంట్స్ షరతులు విధించకుండా ఇవ్వాలంటూ పలు కాలేజీలకు స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు స్టే ఆదేశాలను జారీ చేసింది. కమిషన్ ఆదేశాలను సవాల్ చేస్తూ సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ, సెయింట్ పాల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ వేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ ఎకె.సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ గురువారం విచారించింది సర్టిఫికెట్ల జారీ వంటి అంశాలు హెచ్‌ఆర్సీ యాక్ట్‌ని సెక్షన్ 2(డీ) పరిధిలోకి రావని చెప్పి స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. కౌంటర్ వేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి, విద్యార్థులకు నోటీసులు జారీ చేసింది. విచారణను వాయిదా వేసింది.

## ఇద్దరు పిల్లల నిబంధనపై పిటిషన్ డిస్మిస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండాలన్న నిబంధనను సవాల్ చేసిన పిటిషన్ను హైకోర్టు కొట్టేసింది. ఈ నిబంధనను ఎత్తివేతకు ఆదేశాలు జారీ చేయలేమని స్పష్టం చేసింది. ఎన్నికల్లో పోటీ చేయడం వ్యక్తుల ప్రాథమిక హక్కు కిందకు రాదని గుర్తు చేసింది. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21 (3) నిబంధనను కొట్టివేతకు నిరాకరించింది. ఈ నిబంధనను ఎత్తివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ అందుకు అనుగుణంగా గవర్నర్ ఆమోదం లభించలేదని, ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని చెప్పింది. ఈ నిబంధన ప్రకారం ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలున్న వ్యక్తులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులనే నిబంధన రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా కంది మండలానికి చెందిన వీరన్న వేసిన పిటిషన్ను చీఫ్ జస్టిస్ ఎకె.సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ డివిజన్‌బెంచ్ కొట్టివేసింది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో దాఖలు చేసిన నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ తిరస్కరించడాన్ని సవాల్ చేసిన పిటిషన్లను కూడా డివిజన్ బెంచ్ కొట్టేసింది. ఎన్నికల ప్రక్రియ మొదలైన తర్వాత కోర్టుల జోక్యానికి వీల్లేదని సుప్రీం కోర్టు తీర్పుల మేరకు పిటిషన్లను కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. నామినేషన్ల తిరస్కరణపై ఎలక్షన్ పిటిషన్లు దాఖలు చేసుకోవచ్చునని సూచన చేసింది.

## నర్సింగ్ స్కూళ్లు, కళాశాలల అవకతవకలపై..
# పూర్తి స్థాయి విచారణ జరిపించాలి
### ఎఐవైఎఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నర్సింగ్ స్కూళ్లు, కళాశాలల అవకతవకలపై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యుతలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, వలి ఉల్లా ఖాద్రీ. ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. నర్సింగ్ స్కూళ్లు, కళాశాలల అవకతవకలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టడంతో పాటు డీఎంఈ, నర్సింగ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కోఠిలోని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం డైరెక్టర్ నరేంద్ర కుమార్ పేషీలో ఎఐవైఎఫ్ రాష్ట్ర బృందం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం సంబంధిత చిరునామాల్లో నర్సింగ్ స్కూల్స్, కళాశాలలు నిర్వహించకుండా ఇతర ప్రాంతాల్లో, జిల్లాల్లో నిర్వహిస్తున్నారన్నారు. అలాగే ఒకే భవనంలో 2 నుండి 6 ఇన్స్టిట్యూషన్స్ నిర్వహించడం, భవనాలు, ఫ్యాకల్టీ, మౌలిక వసతులు, విద్యార్థులు క్లినికల్ సైడ్ ప్రాక్టీస్ చేస్తున్నారా లేదా అనే విషయాల పట్ల బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నారని వారు ధ్వజమెత్తారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యార్థుల భవిష్యత్తును, ప్రభుత్వ వ్యవస్థని భ్రష్టు పట్టించిన ఈ అధికారుల పైన, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో నర్సింగ్ ఎడ్యుకేషన్ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దాసు, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్‌ల పైన ఎసిబి ద్వారా విచారణ చేయించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా నర్సింగ్ కళాశాలల్లో లెక్చరర్ ప్రమోషన్లలో తీవ్ర జాప్యం కారణంగా దాదాపు 200 మందికిపైగా నర్సింగ్ ఆఫీసర్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. స్టాఫ్ నర్సులుగా పనిచేస్తూ ఎంఎస్ నర్సింగ్ చేసిన వారికి ఈ పదోన్నతులు ఇవ్వాల్సి ఉండగా.. అధికారుల అలసత్వం కారణంగా ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదని వారు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 560 లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉండగా, ఇటీవల 93 మందికి అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించారని, దీంతో ఖాళీల సంఖ్య 653కు చేరిందని తెలిపారు. అదేవిధంగా నర్సింగ్ ఆఫీసర్లకు లెక్చరర్ పోస్టులు ఇప్పిస్తానని చెప్పి డిఎంఇ కార్యాలయంలో పని చేసే ఓ మహిళా అధికారి గతంలో 100 మంది వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.10వేలు, ఇటీవల 12 మందికి అర్హత లేకున్నా.. ప్రమోషన్లు కల్పిస్తానని చెప్పిన సదరు మహిళాధికారి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.2 లక్షలు వసూలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. అన్ని అంశాలపై విచారణ జరిపించి బాధ్యతలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతేపెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్యప్రసాద్, శ్రీమాన్ రాష్ట్ర సమితి సభ్యులు ఆర్.బాలకృష్ణ, పి. శివకుమార్, షేక్ మహమూద్, తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలు ఇవ్వమంటే ...
# విజిలెన్స్ దాడులు అంటూ బెదిరింపులా?
### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు డిమాడ్ చేస్తూ నవంబర్ 3 నుండి నిరవధిక బంద్ చేస్తామని ప్రకటిస్తే ప్రభుత్వం విజిలెన్స్ దాడులు అంటూ బెదిరింపులకు పాల్పడడం సరికాదని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్‌లు అన్నారు. ప్రభుత్వం ఇది పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడడమేనని వారు విమర్శించారు. ముందు ఫీజు బకాయిలు మొత్తాన్ని విడుదల చేసి ఆ తర్వాతే తనిఖీలు నిర్వహించాలని, అక్రమాలకు పాల్పడిన కళాశాలను నిగ్గు తేల్చివాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫీజులు అడిగితే తప్ప ప్రభుత్వంకు తనిఖీలు గుర్తుకురావా అనివారు ప్రశించారు. రాష్ట్రంలో రూ.8వేల కోట్ల పెండింగ్ ఫీజులు బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పెండింగ్ ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్,స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థులు చదువులతో చెలగాటమాడుతోందన్నారు. సిఎంరేవంత్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే ఒకే సారీ ఫీజు బకాయిలు విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక మాట తప్పారని, అసెంబ్లీ సాక్షిగా రేవంత్ రెడ్డి ప్రతినెల రూ. 500 కోట్ల బకాయిలు విడుదల చేస్తామని చెప్పి హామీ విస్మరించడం సరికాదన్నారు. దసరా పండుగ ముందు సమ్మె చేస్తే దసరా,దీపావళి పండుగ లోపు యాజమాన్యాలకురూ. 1200 కోట్లు విడుదల చేస్తామని చెప్పి మోసగించి ఇప్పటికీ కేవలం రూ.300 కోట్లు మాత్రమే విడుదల చేశారని, ఓవైపు విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోలేక, యాజమాన్యాలు కళాశాల నిర్వహణ చేయలేక సిబ్బందికి జీతాలు ఇవ్వలేక ఇబ్బందులు పడుతూన్నారన్నారు. విజిలెన్స్ తనిఖీల పేరుతో బెదిరింపులకు పాల్పడడం కాకుండ పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు.



## హరీష్‌రావుకు సిపిఐ నేతల పరామర్శ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ మంత్రి, ఎంఎల్ఏ టి.హరీష్‌రావును సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం పరామర్శించారు. హరీష్ రావు తండ్రి సత్యనారాయణ రావు మృతి పట్ల తీవ్ర విచారాన్ని, సంతాపాన్ని వ్యక్తం చేసిన పల్లా వెంకటరెడ్డి, నెల్లికంటి సత్యంలు ఆయన చిత్రపటానికి నివాళ్లు అర్పించారు.

## మంత్రివర్గ విస్తరణకు అనుమతి ఇవ్వొద్దు
### రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డికి బిజెపి ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడాన్ని బిజెపి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మంత్రివర్గ విస్తరణ అంశం ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డికి బిజెపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్, సీనియర్ నేత మర్రి శశిధర్ రెడ్డితో పాటు లీగల్ సెల్ కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పాయల్ శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తుందని విమర్శించారు. ఓ వర్గం ఓట్ల కోసమే ఇప్పుడు మంత్రివర్గ విస్తరణ చేపట్టారన్నారు. అజారుద్దీన్ గతంలో జూబ్లీహిల్స్‌లో పోటీ చేశారని అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రివర్గ విస్తరణ ఆపాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తుందని, కానీ ఈ రెండేళ్లలో మైనార్టీల మీద లేని ప్రేమ ఇప్పుడు ఎందుకు చూపిస్తున్నారని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ కావాలనే మాజీ క్రికెటర్, కాంగ్రెస్ ముస్లిం నేత అజారుద్దీన్‌కు మంత్రి పదవి అప్పగిస్తున్నారని విమర్శించారు.

## మొంథా తుపాన్‌తో నష్టపోయిన
# రైతులను ఆదుకోవాలి
### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మొంథా తుపాన్‌తో పంటలు నీటిపాలై నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. నష్టపోయిన పంటలను సర్వే చేసి వరికి ఎకరాకు రూ.30వేలు, పత్తికి ఎకరాకు రూ.50 వేల మొక్కజొన్నకు ఎకరాకు 20 వేల రూపాయలు, ఉద్యాన పంటలకు ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొంథా తుపాన్ ప్రభావంతో ఏక ధాటి వర్షాల వల్ల ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం, జిల్లాలలో వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు నీటిలో మునిగి పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. సుమారు 5 లక్షలకు పైగా ఎకరాలలో పంటలు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. విపరీతమైన గాలికి చేతికి వచ్చిన వరి పంట వంగిపోవడం పూర్తిగా నీటి పాలు కావడంతో పాటు కామారెడ్డి పెద్దపల్లి జిల్లాలలో మార్కెట్ యార్డులలో ఆరబెట్టిన ధాన్యం కొట్టుకపోయిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వరి, పత్తి పంటలను కాపాడటానికి తగు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించడం సంతోషకరమైని వారు పేర్కొన్నారు. గతంలో దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం కేంద్ర పాలకులు ఇవ్వలేదు. అదే పరిస్థితి నేడు ఏర్పడకుండా కేంద్రపాలకులపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడిని తీవ్రతరం చేయాలని రైతులకు నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా తుపాన్ వల్ల ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబానికి రూ.కోటి నష్ట పరిహారం ఇవ్వాలని పశువులు ఇతర జీవాలు ప్రాణాలు కోల్పోతే ఆ బాధిత కుటుంబాలకు నష్టపరిహారంఅ ందించాలని హేమంతరావు, పశ్యపద్మలు విజ్ఞప్తి చేశారు.

## చట్టం, వ్యవస్థల వైఫల్యం కావడం ప్రత్యక్ష నిదర్శనం
### ఘట్‌కేసర్ కాల్పుల ఘటనతో..
### కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఘట్‌కేసర్‌లో గోరక్షక్ సేవకుడు ప్రశాంత్ కుమార్ (సోనుసింగ్)పై మజ్లిస్ పార్టీ నాయకుడు ఇబ్రహీం ఖురేషీ తుపాకీతో కాల్పులు జరిపిన ఘటన రాష్ట్రంలో చట్టం, వ్యవస్థ పూర్తిగా వైఫల్యానికి గురైందనడానికి ప్రత్యక్ష నిదర్శమని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రశాంత్‌కు తగిన వైద్యం అందేలా తాము స్వయంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

రాచకొండ కమిషనర్ ముగ్గురిని అరెస్ట్ చేసి, మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని పేర్కొన్నారన్నారు. గోవులను అక్రమంగా తరలించే వారిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, బదులుగా గోరక్షకులపైనే కేసులు బనాయిస్తున్నారని కిషన్ రెడ్డి విమర్శించారు. ఇబ్రహీం ఖురేషీ చత్తీస్‌గఢ్ సహా పలు రాష్ట్రాల్లో నేరాల్లో రాటుదేలిన వ్యక్తి అన్నారు. అతనికి మజ్లిస్ నాయకులతో సహా హైదరాబాదు ఎంపి అసదుద్దీన్ ఓవైసీతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. అక్రమ స్లాటర్ హౌసులకు మజ్లిస్ నేతల మద్దతు ఉందని కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో న్యూ బోయిగూడ, గోల్నాకలో అక్రమ స్లాటర్ హౌసులు నడుస్తున్నాయన్నారు. వీటిని వెంటనే నిషేధించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**మజ్లిస్ ఆదేశాలతోనే కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక..**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో కిషన్ రెడ్డి కాంగ్రెస్ మజ్లిస్ సంబంధాలపై కిషన్ విమర్శించారు. యూసుఫ్‌గూడలో కిషన్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మజ్లిస్ ఆదేశాలతోనే కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక జరిగిందన్నారు. ఖబ్రస్తాన్ భూముల కేటాయింపులు కూడా రాజకీయ ప్రయోజనాల కోసమే అని ఆరోపించారు. కేవలం మైనారిటీ ఓటర్ల సంతుష్టీకరణ కోసం కాంగ్రెస్ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తోందన్నారు. అభివృద్ధి కోసం ఈ ఎన్నికల్లో బిజెపికి అవకాశం ఇవ్వాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఒకప్పుడు బిఆర్ ఎస్ కలిసి అరాచకం చేసిన మజ్లిస్ పార్టీ ఇప్పుడు కాంగ్రెస్‌తో కలిసి చేస్తుందన్నారు.


తెలంగాణ ప్రభుత్వము
**రోడ్లు మరియు భవనాల శాఖ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) కార్యాలయం, రంగారెడ్డి డివిజన్.

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ NIT నోటీస్ నెం. 06/RD/DB/HD/D2/2025-26/Short Tender, తేది: 29.10.2025

రంగారెడ్డి జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) ద్వారా ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆన్‌లైన్‌లో టెండర్లు స్వీకరిస్తారు. 8 (ఎనిమిది) పనులకు రిజిస్టర్డ్ సంస్థలు / కాంట్రాక్టర్లు క్లాస్-V మరియు అంతకంటే ఎక్కువ నుండి గోషామహల్ 1) రూ.7.59 లక్షలు, 2) రూ.4.74 లక్షలు, 3) రూ.7.01 లక్షలు, 4) రూ.7.68 లక్షలు, 5) రూ.3.02 లక్షలు, 6) రూ.7.36 లక్షలు, 7) రూ.7.36 లక్షలు, 8) రూ.7.54 లక్షలు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ www.'e'Procurement.gov.inలో 04.11.2025న సా.4.00గం.ల నుండి చూడవచ్చు. **టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది:** 11.11.2025న మ.3.30గం.ల వరకు, **టెండర్లు తెరుచుటకు ఆఖరి తేది:** 11.11.2025న సా.4.00గం.లకు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B),
రంగారెడ్డి జిల్లా

DIPR R.O. No. : 9957-PP/CL/ADVT/1/2025-26, Date: 30-10-2025

## దూమపానం ఆరోగ్యానికి హానికరం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : దూమపానం, పొగాకు ఉత్పత్తుల వాడకం ఆరోగ్యానికి హానికరమని డిప్యూటి డెమో వి సంజీవరెడ్డి అన్నారు. గురువారం ఎంజెపిటిబిసిడబ్లు డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పొగాకు, పొగాకు ఉత్పత్తుల వాడకం వలన కలుగు ఆరోగ్య సమస్యల గురించి అవగాహన కల్పించారు. పొగాకు ద్వారా అధిక రక్తపోటు, గుండె జబ్బులు, పక్షవాతం, నరాల బలహీనత, శ్వాసకోస వ్యాధులు, మూత్రపిండ జబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఏ రూపములో కూడా పొగాకు వాడకూడదని హెచ్చరించారు. అసంక్రమిత వ్యాధుల కోఆర్డినేటర్ సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థినిలు పాటించవల్సిన వ్యక్తిగత ఆరోగ్య అంశాల గురించి ఆరోగ్య విద్య అంశాలు పాటించడము వలన సాధారణంగా వ్యా పించు అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. డయేరియా, డిసెంట్రీ, స్కేబిస్, వార్మ్ ఇన్ ఫెస్టేషన్, కీటక జనిత వ్యాధులు, నీరు, ఆహార కలుషితం వలన కలుగు ఆరోగ్య దుష్ప్రభావాల గురించి తెలిపారు. అంబేద్కర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ అమూల్య ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మానస, సిహెచ్ఓ నర్సింహా, ఏఎన్ఎం సుకన్య, కళాశాల అధ్యాపక బృందం ఉన్నారు.

## ఐకెపి సెంటర్ల ఘనత కాంగ్రెస్‌దే



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : ఐకెపి సెంటర్లను 2004లో తీసుకవచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 1వ వార్డు కుడకుడలో శ్రీగౌతమి ఫార్మర్ మార్కెటింగ్ మ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐకెపి కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరి ధాన్యాన్ని మార్కెట్ యార్డ్‌కు తీసుకువచ్చేటప్పుడు ఆరబెట్టుకొని, తేమ శాతం లేకుండా తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, కోతి గోపాల్ రెడ్డి, వేములకొండ పద్మ, తన్వీర్ హుస్సేన్ రైతులు పాల్గొన్నారు.



## రైతులను ఆదుకుంటాం – ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ**: మొంథా తుఫాన్ కారణంగా మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మిర్యాలగూడ నియోజకవర్గంలో దెబ్బతిన్న వరి పొలాలను ఆయన పరిశీలించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయాధికారులకు ఫోన్ చేసి వెంటనే నేలవాలిన పంట పొలాలను సందర్శించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం అందేలా కృషి చేయాలని ఆయన ఆదేశించారు. రైతులు అధైర్యపడవద్దని పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన హామి ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా అవాంతరాలను వెంటనే పునరుద్ధరించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట** : మొంథా తుఫాన్ కారణంగా విద్యుత్ సరఫరా అవాంతరాలను వెంటనే పునరుద్ధరించాలని తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ సిహెచ్ చక్రపాణి అధికారులను ఆదేశించారు. గురువారం తుఫాన్ ప్రభావం వల్ల కరెంట్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడిన ప్రాంతాలన్ని ఆయన సందర్శించారు. అనంతరం సూర్యాపేటలోని 132 కెవి సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరాన్ని సమీక్షించి మాట్లాడారు. జిల్లాలో వర్షాలకి జరిగినటువంటి డ్యామేజి అన్ని కూడా పరిశీలించి వాటిని సత్వరమే పునరుద్ధరించాలన్నారు. జిల్లాలో సుమారు రూ.30లక్షల విలువ గల 72 పోల్స్ ఎల్టిలో, హెటి 22 పోల్స్, 5 ట్రాన్స్‌ఫార్మర్లు నష్టం జరిగినట్లు అధికారులు వివరించారు. వీటన్నింటిని సాయంత్రం లోగా పునరుద్ధరించి కరెంట్ సరఫరా అవాంతరాలు లేకుండా చూడాలన్నారు. సిబ్బంది, ఇంజనీర్లు రాత్రి కూడా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఏఈ ఫ్రాంక్లిన్, సూర్యాపేట డిఇ శ్రీనివాస్, ఏఈలు, ఏడిలు, ట్రాన్స్‌కో డిఈ రామకృష్ణ ఉన్నారు.

## రైతులను ఆదుకోవాలి : సిపిఐ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ**: తుఫాన్ వల్ల నష్టపోయిన పంట పొలాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎకరాకు రూ.30వేల పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మిర్యాలగూడ మండలం యాదగిరిపల్లి, కాల్వపల్లి గ్రామాల్లో నేలకొరిగిన పంట పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల వల్ల ప్రతి ఏటా అన్నదాతలకు తీరని నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈదురుగాలలు, వర్షం కురవడంతో వరి పొలాలు పూర్తిగా నేలమట్టమై పచ్చదనం నుంచి ఎరుపు రంగుకు మారాయని అన్నారు. ధాన్యం నీటిలో మునిగి మొలకలు రావడం వల్ల గిట్టుబాటు ధర వచ్చే పరిస్థితి లేదని వాపోయారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాల వల్ల తీరని నష్టం జరుగుతుందన్నారు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన పంట పొలాలను పరిశీలించి పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట రైతులు రవికుమార్, భీమ్లానాయక్, వెంకన్న, సప్లి తదితరులు ఉన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

### నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :శాంతి భద్రతల పరిరక్షణలో విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అమరులైన వారి ఆత్మ శాంతి కలగాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ అన్నారు. పోలీస్‌అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా గురువారం పట్టణ కేంద్రంలోని ఎన్‌జి కళాశాల నుండి సైకిల్ ర్యాలీని జిల్లా ఎస్‌పి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ రామగిరి మీదుగా,క్లాక్ టవర్ వరకు పోలీసు సిబ్బంది,పట్టణ యువకులు, విద్యార్థులతో కలిసి అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ విధి నిర్వహణలో అమరులైన అమరవీరుల త్యాగాలు గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నామనీ తెలిపారు. వారి త్యాగాల గుర్తుగా అమరవీరుల వారోత్సవాలు జరుపుకుంటున్నామని అన్నారు. దీనిలో భాగంగా పోలీస్ అమరులను గుర్తు చేసుకుంటూ సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి రమేష్,నల్లగొండ డిఎస్పి శివరాంరెడ్డి, ఏఆర్ డిఎస్‌పి శ్రీనివాసులు, సిఐలు రాఘవరావు, రాజశేఖర్ రెడ్డి,మహా లక్ష్మయ్య శ్రీను నాయక్ ఆర్ఐ లు సంతోష్, శ్రీను,సూరప్ప నాయుడు, హరిబాబు ఎస్ఐలు సైదులు, శంకర్, గోపాల్ రావు,వీరబాబు, శ్రావణి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బ్రెయిలీ లిపిలో హనుమాన్ చాలీసా బోధన ప్రపంచానికే ప్రేరణ

### రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : తెలుగు రాష్ట్రాలకే కాకుండా భారతదేశ వ్యాప్తంగా విజువల్లి ఛాలెంజెడ్ పిల్లలకు భగవద్గీత హనుమాన్ చాలీసా బ్రెయిలీ లిపిలో వ్రాయించి అంధులకు బోధిస్తూ ఆత్మవిశ్వాసాన్నీ పాదుకొలుపుతూ జీవిత వికాసానికి తోడ్పడుతున్న వేద భారతి చారిటబుల్ ట్రస్ట్ సప్తపర్ణి సంయుక్తంగా ఒక యజ్ఞం వలే చేస్తున్న కృషి ప్రపంచానికే ప్రేరణ అని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మ కొనియాడుతూ అభినందించారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం పిల్లాయిపల్లి గ్రామంలో స్థాపించిన వేద భారతి,సప్తపర్ణి వేద పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అంధుల కోసం బ్రెయిలీ లిపిలో రచించిన భగవద్గీత హనుమాన్ చాలీసా పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. గవర్నర్ గోషాలను సందర్శించి డిజిటల్ శబ్ద భగవద్గీత పుస్తకానికి స్ఫటిక లింగానికి పూజలు చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. బ్రెయిలీ లిపిలో రాసిన భగవద్గీత శ్లోకాలను నిర్వాహకులు అంధ విద్యార్థులచే చదివే కార్యక్రమాన్ని ఆయన వీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్ చాలీసా ధైర్యానికి సాహసానికి ఒక సంకేతం అని జీవితంలో దేనినైనా ఎదిరించి విజయం సాధించడానికి హనుమాన్ చాలీసా సంజీవనిలా పనిచేస్తుంది కాబట్టి అంధులకు ఆత్మస్థైర్యం నింపేలా ఈ ప్రయత్నం చేస్తున్న వారికి అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి వేద భారతి ఫౌండర్, రేవెళ్ల అవధాని చిన్మయ మిషన్ చైర్మన్ సర్వేశానందస్వామి, సప్తపర్ణి ఫౌండర్ వారణాసి సూర్యనారాయణ కంచి పీఠం శ్రీకార్యం , పిల్లాయిపల్లి వేద భారతి సప్తపర్ణి నిర్వాహకులు జయరాం అధ్యాపక బృందం పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం ప్రాధాన్యత

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు

**ప్రజాపక్షం/బీబీనగర్** : ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య ఇస్తుందని నిన్న కురిసిన భారీ వర్షం నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు కలవకుండా ధాన్యం కొనుగోలు జరగాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం బీబీనగర్ మండల కేంద్రంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎన్ని ధాన్యం కుప్పలు వచ్చాయని, ఇంకా పంట మీద ఎంత ధాన్యం ఉందని రైతులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా ఏమైనా తడిసిందా తడవకుండా టార్పాలిన్‌లు కప్పుకోవాలని సూచించారు. పంట మీద ఉన్న వరి కూడా కొంచెం ఆరిన తరువాత కోత కోయాలని సూచించారు. కేంద్రంలో ఉన్న ధాన్యంను ఎంత మేరకు తేమ శాతం ఉందని పరిశీలించారు. తేమ శాతం వచ్చిన ధాన్యం ఎప్పటికపుడు కొనుగోలు చేసి లారీలకు లోడ్ చేసి మిల్లులకు తరలించాలని అన్నారు. ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన పంట నష్టం కాకుండా అధికారులు బాధ్యతాయుతంగా ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలన్నారు. ట్రాక్ షీట్ అప్డేషన్ ఎప్పటికప్పుడు జరగాలని, ప్రతి కేంద్రంలో కనీస మౌలిక వసతులు ఉండాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసిన అన్ని ధాన్యం కేంద్రాలలో కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగాలని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, ఎపియం మీనా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



రుద్రవెల్లి మూసీ బ్రిడ్జిని పరిశీలించిన జిల్లా కలెక్టర్

హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నదిని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు బుధవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా బ్రిడ్జి వద్ద కాపలా ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా యాదాద్రి భువనగిరి జిల్లా కార్యనిర్వహణ అధికారి శోభారాణి మండలానికి వచ్చిన ట్రైనింగ్ శిక్షణ డిప్యూట్ కలెక్టర్ సాత్విక్‌తో మూసి పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు.

## కొనుగోలు కేంద్రం నిర్వహణలో నిర్లక్ష్యం

### ధాన్యం కొనుగోలు కేంద్రం ఆకస్మికంగా తనిఖీ సెంటర్ ఇన్‌ఛార్జికి షోకాజు నోటీసు

**ప్రజాపక్షం/నల్లగొండ(తిప్పర్తి)** : తిప్పర్తి మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లు,లారీల ఏర్పాటులో నిర్లక్ష్యం వహించినందుకు గాను ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌ఛార్జికి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.గురువారం ఆమె జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తో కలిసి తిప్పర్తి మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తుపాను కారణంగా గత రెండు, మూడు రోజులు గా వర్షం వల్ల కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడిసిపోయింది. కొంత మంది రైతులనుండి ధాన్యం కొన్నప్పటికి సకాలంలో లారీ రాకపోవటం ,టార్పాలిన్లు లేకపోవడంతో ధాన్యం తడిసి పోయింది. సెంటర్ ఇన్చార్జి తమకు టార్పాలిన్లు ఇవ్వలేదని, కొన్న ధాన్యాన్ని తరలించేందుకు లారీలు ఏర్పాటు చేయలేదని రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి,డిఎస్ఓ వెంకటేష్,పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ ,మార్కెటింగ్ ఏడి ఛాయాదేవి,డిసిసిబి డైరెక్టర్ సంపత్ రెడ్డి ఉన్నారు.

తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలి

### అనుమతి లేకుండా ఎవరూ సెలవుపై వెళ్లకూడదు

మొంథా తుఫాను దృష్ట్యా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పని చేసేలా ఈనెల 27 నుండి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు,జిల్లా అధికారులతో మొంథా తుఫాను ప్రభావం సహాయక చర్యలు,తదితర పై అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా,డివిజన్,మండల,గ్రామస్థాయి అధికారులు,సిబ్బంది తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ లోని ఫోన్ నెంబర్ 1800 425 1442 నంబర్ కు సమాచారం అందించాలని తెలిపారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,జిల్లా అధికారులు ఉన్నారు.



## యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో అవినీతి

### అవినీతి అధికారుల అక్రమ ఆస్తులను దేవాలయానికి అటాచ్ చేయాలి : సిపిఐ డిమాండ్



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అవినీతి అధికారుల ఆస్తులను దేవాలయానికి అటాచ్ చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం యాదగిరిగుట్టలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాలయం ప్రసాద తయారీ మిషన్ నిర్వాణ కాంట్రాక్టర్‌కు చెల్లించవలసిన రూ.11 లక్షల బిల్లును ఇవ్వడం కోసం 20 శాతం డబ్బులు తనకి ఇవ్వాలని సదరు కాంట్రాక్టర్ డిమాండ్ చేసి రూ.1,90,000లకు అవినీతికి పాల్పడి లంచం తీసుకుంటూ నిన్న ఏసీబీకి చిక్కినా ఊడపు వెంకట రామారావు పవిత్రమైన పుణ్యక్షేత్రంలో ఉన్నత స్థాయి అధికారిగా పని చేస్తూ ఎంతో నిజాయితీగా పని చేయాల్సిన అధికారి ఈ రకమైన అవినీతికి అక్రమాలకు పాల్పడడం సిగ్గుచేటని అన్నారు. ఒక ఇంక్రిమెంట్ రాకుండా ఉంటేనే ప్రమోషన్కి అర్హతను కోల్పోతాడు కానీ మూడు ఇంక్రిమెంట్లు కూడా రాకుండా ఉన్నప్పటికీ రామారావుకు మాత్రం మూడు ప్రమోషన్లు ఇచ్చి అవినీతి అధికారిగా తయారు చేశారని అన్నారు. దేవదాయ కమిషనర్‌కి, గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి యాదాద్రి దేవాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాల పైన అనేకసార్లు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐగా ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదని చెప్పారు. ఈ రకంగా అధికారుల పైన నిర్లక్ష్యంగా ఉండడం వలన వాళ్ళ ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, సిపిఐ మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సిపిఐ మున్సిపల్ శాఖ కార్యదర్శి బబ్బురి శ్రీధర్, మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, ఎఐటియుసి మండల కార్యదర్శి గోపగాని రాజు పాల్గొన్నారు.

## సురేష్ మృతికి కారణమైన అధికారులపై చర్యలు

### సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/మోత్కూర్** : మోత్కూరు మండలం పాలడుగు గ్రామ శివరులో బుధవారం ఉదయం విద్యుత్ శాఖలో పనిచేస్తున్న అసిస్టెంట్ లైన్‌మెన్ ఒర్సు సురేష్ (33) ప్రమాదానికి గల కారకులైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకొని అతని కుటుంబానికి తగు న్యాయం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్‌తో కలిసి ఓర్సు సురేష్ మృతదేహాన్ని భువనగిరి జిల్లా హాస్పిటల్ మార్చురీలో సందర్శించి ఆయన కుటుంబానికి పరామర్శించి అనంతరం కుటుంబ సభ్యులు చేస్తున్న రాస్తారోకోకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడుతూ ముశిపట్ల, పనకబండ, రాగి బావి గ్రామాలకు సంబంధించిన ఏ ఎల్ ఎం సురేష్ ను పాలడుగు గ్రామానికి తీసుకువెళ్లి అత్యవసరం లేకున్నా అతనితో అదనపు పని చేయిస్తున్న సందర్భంలో ఎల్‌సి తీసుకోకుండా సంబంధిత ఏఈ అక్కడే ఉండి నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల నిండు ప్రాణం బలైపోయింది. అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి కారకులైన ఏఇను సస్పెండ్ చేస్తూ అతను పై చర్యలు తీసుకొని మరణించిన సురేష్‌కు ఉద్యోగరీత్యా రావాల్సిన బెనిఫిట్స్‌తో పాటు అదనంగా 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి అతని కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాసం కల్పించాలని , అతని పిల్లల చదువుల పూర్తి బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



## ప్రజలు ప్రమాదాలకు దూరంగా ఉండాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్** : ప్రజలు ప్రమాదాలకు దూరంగా ఉండాలి, నీటితో నిండి ఉన్న చెరువులు, కుంటలు, నదుల్లోకి ప్రజలు దిగవద్దని జిల్లా ఎస్‌పి కె నరసింహ సూచించారు. వర్షాల దృష్ట్యా మూసి నది ఉధృతంగా ప్రవహిస్తున్నందున గురువారం సూర్యాపేట రూరల్ పరిధి వేదెరివారిగూడెం వద్ద మూసీ నదిపై భీమారంలో లెవెల్ బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహ పరిస్థితిని ఆయన పరిశీలించారు. వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధిక వర్షాల వల్ల చెరువులు, నదులు, కుంటలు నిండి ప్రమాదకర రీతిలో ఉన్నాయని వాటిలోకి చేపల వేటకు వెళ్ళవద్దన్నారు. జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమై ప్రమాదకరంగా ఉన్న స్థలాల వద్ద భద్రతా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేయడం, నీటి ప్రవాహంలోకి ఎవరు వెళ్లకుండా రోడ్లపై బారికెడ్‌లు, వాహనాలు అడ్డుగా పెట్టడం జరిగిందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సెలవులు రద్దు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. ఎస్‌పి వెంట సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, రూరల్ ఎస్ఐ బాలు నాయక్, సిబ్బంది ఉన్నారు.





## ఆదుకుంటాం.... అధైర్యపడొద్దు

### వరద ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** మొంథా తుఫాను ప్రభావం వలన గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ముంపుకు గురయిన కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, గౌరికుంట తండా, చింతకుంట్ల గ్రామాలలోని వరద ప్రాంతాలను గురువారం దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలు నాయక్ వివిధ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. వరద ప్రాంతాల ప్రజలతో ఎంఎల్‌ఏ మాట్లాడి ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా ఆదుకుంటామని, అధైర్య పడవద్దని హామీ ఇచ్చారు. కొండమల్లేపల్లి నుండి నల్గొండ రహదారి వెంబడి వరద నీరు గౌరికుంటతండాలోకి వెళ్ళకుండా 5ఫీట్ల వెడల్పుతో సిసి కాలువను నిర్మించాలని, దెబ్బతిన్న చెక్ డ్యాంను పునర్‌నిర్మించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ లైన్లు, రోడ్లు, త్రాగు నీటి సదుపాయాలు, డ్రైనేజి వ్యవస్థను, మంచినీటి సరఫరాను వెంటను పునరుద్దరించాలని అధికారులకు సూచించారు. వర్షాల నేపథ్యంలో చిన్నపిల్లలను, మూగజీవాలను ముంపు ప్రాంతాలకు వెళ్ళకుండా అప్రమత్తం చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకులు నాయిని మాధవ రెడ్డి, మండల అధ్యక్షుడు ఊట్కురి వేమన్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి సలహాదారుడు పసునూరి యుగేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సైదులు పాల్గొన్నారు.

## పంట నష్టంపై నివేదిక అందించాలి

### దెబ్బతిన్న రోడ్లను, నేలకు వాలిన వరి పంటను పరిశీలించిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్‌పవర్



**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్))** : సూర్యాపేట దంతాలపల్లి రోడ్డులో నెమ్మికల్లు వద్ద చౌడ చెరువు నుండి రోడ్డుపై నీరు ప్రవహించడం వల్ల రోడ్డు కుంగిపోవటంతో వెంటనే పునరుద్ధరించాలని శుక్రవారం ఉదయం నాటికి రాకపోకలు జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. గురువారం ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ వద్ద అధిక వర్షం వల్ల కుంగిపోయిన రోడ్డును, నేలకు వాలిన వరి పంటను పరిశీలించి పంట నష్టంపై పూర్తినివేధిక అందించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆత్మకూర్(ఎస్) మండలం దాచారం వద్ద ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి తేమ శాతం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తేమ శాతం 17 రాగానే వెంటనే కాంటా వేసి మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. వర్షం వల్ల ఏమైనా ధాన్యం తడిచాయా అని అడుగగా కొనుగోలు కేంద్రం ఎత్తులో ఏర్పాటు చేయటంతో పాటు, ధాన్యంపై టార్పాలిన్ పట్టాలు కప్పటం వల్ల ధాన్యం తడవలేదని నిర్వాహకులు తెలిపారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ అమీన్‌సింగ్, ఎంపిడిఓ ఎండి హాసీం, ఏఓ దివ్య, సెంటర్ ఇంచార్జి అనిత తదితరులు ఉన్నారు.

## చెట్లు నరికివేసిన దేవాలయ కమిటీకి జరిమానా

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** అక్రమంగా చెట్లను నరికివేసిన తాజ్ పూర్ శ్రీ లింగేశ్వర స్వామి దేవాలయ కమిటీకి జరిమానా విధించినట్లు అటవీ శాఖ రేంజ్ అధికారి రమేష్ నాయక్ తెలిపారు. ఇటీవల చెట్లు నరికి వేసినందుకు గాను అటవీశాఖ రేంజ్ అధికారి రమేష్ నాయక్ విచారణలో భాగంగా ఫిర్యాదు నిరూపణ అవ్వడంతో కమిటీ సభ్యుల పై రూ.12,160 జరిమానా విధించారు. రానున్న రోజుల్లో చెట్లను నరికినచో కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. సకాలంలో స్పందించి చర్యలు తీసుకునందుకు తాజ్ పూర్ గ్రామ ప్రజలు అటవీశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## శ్రమశక్తి విధానంలో మనుస్మృతి ప్రస్తావన...'రాజ్యాంగానికే అవమానం'

### కేంద్రంపై కాంగ్రెస్ ఆరోపణల దాడి

**న్యూఢిల్లీ :** శ్రమశక్తి నీతి ముసాయిదాపై గురువారం కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై దాడిని మరింత తీవ్రతరం చేసింది.మనుస్మృతి వంటి పురాతన గ్రంథాల నుండి ప్రేరణ పొందిందని, అందువల్ల రాజ్యాంగానికి 'అవమానం' చేయడమే కాకుండా బిఆర్.అంబేద్కర్ వారసత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరాం రమేశ్ శ్రమశక్తి నీతి2025 ముసాయిదాను ఉటంకిస్తూ మన దేశంలో కులవ్యవస్థ, కులతత్వానికి దోహదపడిన మనుస్మృతి నుండి ఇది ప్రేరణ పొందిందన్నారు. జైరాం రమేశ్ ఇక్కడ 'పిటిఐ'తో మాట్లాడుతూ 1949 నవంబరు 26న రాజ్యాంగాన్ని ఆమోదించినప్పటి నుంచి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) రాజ్యాంగానికి వ్యతిరేకంగానే ఉన్నదని ఆరోపించారు. అది మనుస్మృతి విలువలపై ఆధారపడి లేదని విమర్శించారు. మన రాజ్యాంగాన్ని అవమానించడాన్ని ఖండించాలని ఆయన అన్నారు.

## ట్రంప్‌ను ఎదుర్కొనే ధైర్యం మోదీకి లేదు

### బిహార్ ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ



**నలంద :** భారత్–పాక్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలను ఖండించే ధైర్యం ప్రధాని మోదీకి లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. నీతీశ్ కుమార్ పాలనలో బిహార్ పేపర్ లీకేజీలు, పేలవమైన ఆరోగ్య మౌలిక సదుపాయాలకు నిలయంగా మారిందని ఆరోపించారు. బిహార్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు భూమి లేదని అమిత్ షా అన్న వ్యాఖ్యలపై రాహుల్ మండిపడ్డారు. అదానీ లాంటి వ్యాపారవేత్తలకు రూపాయికే భూమి ఎలా కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు చోరీ ద్వారానే ఎన్‌డిఎ అధికారం చేపట్టిందని రాహుల్ మరోసారి ఆరోపించారు. రెండు భారత్‌దేశాలు ఉన్నాయని, అందులో ఒకటి అదానీ, అంబానీ, మోదీలదే అని విమర్శించారు. మరొకటి తనది, ప్రజలదేని, ఏమి చేసినా ఉద్యోగాలు రావని పేర్కొన్నారు. గురువారం బిహార్‌లోని నలందలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్‌గాంధీ ప్రసంగిస్తూ ప్రధాని మోదీపై ఈ మేరకు విరుచుకుపడ్డారు. 'ఒక హిందూస్థాన్ అదానీ, అంబానీ, ప్రధాని మోదీలది. రెండో హిందూస్థాన్ మీది (ప్రజలు). రెండో దాంట్లో ఏమి చేసినా మీకు (ప్రజలు) ఉద్యోగాలు రావు. ఎందుకంటే ప్రధాని మోదీ అదానీ, అంబానీల చేత చైనా వస్తువులను విక్రయించాలని చూస్తున్నారు. వాటిని దేశ పౌరులతో పాటు బిహారీలు కొనుగోలు చేసేలా చూస్తున్నారు. ప్రధాని మోదీ ఇక్కడకు (బిహార్) వచ్చి యువతకు ఒక్క మాట చెప్పారు. బిజెపి మొబైల్ డేటా ఛార్జీలను తగ్గించిందని చెప్పారు. తద్వారా యువత ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో రీల్స్ చేసుకుంటున్నారని చెప్పారు. నేను బిహార్ యువతను ఒక్కటి అడుగుతున్నాను. రీల్స్, ఇన్‌స్టా చూడటం ద్వారా ఏమైనా ప్రయోజనం ఉందా? ఇన్‌స్టా చూస్తే మీ జేబులోకి డబ్బు చేరుతుందా? మీరు ఇన్‌స్టా, ఫేస్‌బుక్ చూస్తే అంబానీ జేబులోకి డబ్బు వెళుతుంది' అని రాహుల్ గాంధీ అన్నారు.

**'ఇందిరా గాంధీ అంత ధైర్యం మోదీకి లేదు'**

ప్రధాని మోదీని భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో పోల్చారు రాహుల్‌గాంధీ. 1971 యుద్ధం సమయంలో ఇందిరాగాంధీ అమెరికా ముందు భయపడలేదని తలవంచలేదని, కానీ ప్రధాని మోదీకి ట్రంప్‌ను ఎదిరించే సామర్థ్యం లేదని అన్నారు.' 1971 బంగ్లాదేశ్ యుద్ధంలో భారత్‌ను బెదిరించడానికి అమెరికా తన విమానాలను, నావికాదళాన్ని పంపింది. ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరా గాంధీ, మీ నావికాదళానికి మేం భయపడం. మీరు చేయాల్సింది చేయండి. మేం చేయాల్సింది మేము చేస్తామని అన్నారు. ఇందిరా గాంధీ ఒక మహిళ. కానీ ఆమెకు ఒక పురుషుడి కంటే ఎక్కువ ధైర్యం ఉంది. నరేంద్ర మోదీ పిరికివారు. ఆయనకు అమెరికా అధ్యక్షుడిని ఎదిరించే సామర్థ్యం లేదు. నేను ఆయనను సవాలు చేస్తున్నా. నరేంద్ర మోదీకి ధైర్యం ఉంటే, బిహార్‌లో జరిగే ఏ సమావేశంలోనైనా , అమెరికా అధ్యక్షుడు అబద్ధం చెబుతున్నారని అని చెప్పాలి. అలాగే ఆపరేషన్ సిందూర్‌ను ఆపలేదని కూడా చెప్పాలి. కానీ ఆయన అలా చేయలేరు. ట్రంప్ ఇప్పటికే 50 సార్లు మోదీని అవమానించారు. కానీ ట్రంప్ అబద్ధం చెబుతున్నారని చెప్పే ధైర్యం మోదీకి లేదు. ట్రంప్‌ను కలిసే ఛాన్స్ మోదీకి వచ్చింది. కానీ, ఆయన భయంతో ఆయనను కలవడం లేదు. ఆయన అజ్ఞాతంలో కూర్చున్నారు. ప్రధానికి అంత ధైర్యం లేదు' అని రాహుల్ గాంధీ విమర్శించారు.

## 'ఛట్ పూజ'ను కాంగ్రెస్, ఆర్‌జెడి అవమానిస్తున్నాయ్


### ఓటు బ్యాంకు, బుజ్జగింపు రాజకీయాల కోసం చొరబాటుదారులను రక్షిస్తున్నాయి : ప్రధాని మోదీ విమర్శ



**ఛాప్రా/ముజఫర్‌నగర్ :** బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ దగ్గరపడుతోన్న వేళ ప్రచార వేడి పెరుగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కాగా, ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన ఛట్ పూజను కాంగ్రెస్, ఆర్‌జెడి పార్టీలు అవమానించాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఓటు బ్యాంకు, బుజ్జగింపు రాజకీయాల కోసం చొరబాటుదారులను రక్షిస్తున్నాయని మండిపడ్డారు. ఛట్ పూజ సందర్భంగా యమునా నదిలో స్నానం చేయాలని ప్లాన్ చేయడం ద్వారా మోదీ డ్రామా చేసేందుకు ప్రయత్నించారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించిన విషయం తెలిసిందే. రాహుల్ వ్యాఖ్యలపై బిహార్‌లోని ముజఫర్‌పూర్, చాప్రా పట్టణాల్లో గురువారం జరిగిన ర్యాలీలలో ప్రధాని స్పందించారు. ఛట్ పూజ తర్వాత ఇది తన మొదటి బీహార్ పర్యటన, ఈ పండుగ భక్తికి మాత్రమే కాదు, సమానత్వానికి కూడా నిలయమని, అందుకే తమ ప్రభుత్వం ఈ పండుగకు యునెస్కో వారసత్వ ట్యాగ్ పొందడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో తాను ఛట్ పూజకు దక్కాల్సిన గౌరవం లభించేలా చూసుకుంటూ బిజీగా ఉండగా, కాంగ్రెస్, ఆర్‌జెడికు చెందిన వారు ఈ పండుగను తిట్టిపోస్తున్నారు, దీనిని డ్రామా, నౌతంకి అని పిలుస్తున్నారని ఆయన ఏ నాయకుడి పేరును ప్రస్తావించకుండా మోదీ విమర్శలు చేశారు. ఇండియా కాంగ్రెస్ కూటమి, ఆర్‌జెడి–కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు, ఓటు బ్యాంకు రాజకీయాలు తప్ప మరేమీ చేయలేకపోయాయి, వాటి కోసం వారు చొరబాటుదారులను రక్షిస్తున్నారని ఆరోపించారు. తమ ప్రత్యర్థులను 'నామ్‌దార్' (వంశపారంపర్య వ్యక్తులు) అని అభివర్ణిస్తూ, టీ అమ్మే వెనుకబడిన తరగతి నాయకుడు ఇంతటి ఉన్నత స్థాయికి చేరుకోవడం ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని మోదీ అన్నారు. ఆర్‌జెడి–కాంగ్రెస్ మ్యానిఫెస్టో నిజానికి రేటు చార్ట్, వారి వాగ్దానాలు 'రంగ్‌దారీ', విమోచన క్రయధనం, అవినీతి, దోపిడీ కోసమే అని ఆయన ఆరోపించారు. 'ఆర్‌జెడి–కాంగ్రెస్ పాలనను ఐదు పదాల్లో చెప్పొచ్చు. కట్టా (నాటు తుపాకీ), క్రూరతా (క్రూరత్వం), కటుత (దురుద్దేశం), కుశాసన (సుపరిపాలన లేకపోవడం), కరప్షన్ (అవినీతి).. ఇవే ఆ పార్టీల పాలనా విధానాలు. ఆయుధం ఉన్న చోట క్రూరత్వం ఉంటుంది. ఆటవిక రాజ్యం వస్తుంది. ఆర్‌జెడి అధికారంలో ఉన్న సమయంలో షోరూంలో నుంచి వాహనాలను దోచుకెళ్లారు. వారి హయాంలో బిహార్‌లో 35వేల నుంచి 40వేల వరకు కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి' మోదీ మండిపడ్డారు. ఇక, మహాఘట్‌బంధన్‌లో విభేదాల గురించి ప్రస్తావిస్తూ మోదీ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ఆర్‌జెడి–డీకాంగ్రెస్ పార్టీలది నూనె నీటి లాంటి బంధమని, ఆ రెండూ ఎప్పటికీ కలవవన్నారు. బిహార్‌లో వారు కలిసి చేస్తున్న ర్యాలీలన్నీ ఓట్ల కోసం చేస్తున్న బూటకపు చర్యలే అని ప్రధాని ఎద్దేవా చేశారు. తనను విమర్శించడం అంటే.. కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ, ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ తమ జన్మహక్కులా భావిస్తున్నారని అన్నారు.

## చాబహార్ పోర్ట్‌పై 6నెలల గడువు పెంపు

### అమెరికా ఆంక్షల నుంచి భారత్‌కు ఊరట



**న్యూఢిల్లీ :** ఇరాన్‌లోని చాబహార్ పోర్టు విషయంలో భారత్‌కు భారీ ఊరట లభించింది. అమెరికా విధించే ఆంక్షలు ఈ పోర్టుపై పడవని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. ఆరు నెలల వరకు అమెరికా ఆంక్షల నుంచి దీనికి మినహాయింపు లభించిందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు భారత్ చర్చలు చేస్తూనే ఉందని చెప్పారు. ఇటీవల రష్యా చమురు కొనుగోళ్లపై అమెరికా విధించిన ఆంక్షల ప్రభావంపైనా అధ్యయనం చేస్తున్నామని పేర్కొన్నారు. 140 కోట్ల భారతీయుల ఇంధన భద్రతే లక్ష్యంగా తమ నిర్ణయం ఉంటుందని వివరించారు. మధ్య ఆసియా దేశాలతో భారత్ వాణిజ్యం చేసేందుకు చాబహార్ పోర్టు ప్రధాన మార్గంగా ఉంది. ఈ పోర్టు అభివృద్ధి, నిర్వహణలో భారత్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టులో భారీగా పెట్టుబడులు పెట్టింది. కజఖిస్థాన్, తజికిస్థాన్, తుర్క్‌మెనిస్థాన్, కిర్గిజ్ రిపబ్లిక్, ఉజ్బెకిస్థాన్ వంటి దేశాలకు భారత్ ఇక్కడినుంచి సరకు రవాణా చేయవచ్చు. పాకిస్థాన్‌తో సంబంధం లేకుండా అఫ్గానిస్థాన్‌కు భారత్ అందించే ఆహార ధాన్యాలను కూడా ఈ మార్గంలోనే చేరవేస్తున్నారు.

**370 మిలియన్ల మేర పెట్టుబడులు**

ఈ ఓడరేవులో 10ఏళ్ల పాటు టెర్మినల్ నిర్వహణ కోసం గత ఏడాది భారత్–ఇరాన్‌ల మధ్య ఒప్పందం కుదిరింది. భారత్‌కు చెందిన ఇండియా పోర్ట్స్ గ్లోబల్ లిమిటెడ్ సంస్థ 370 మిలియన్ల మేర పెట్టుబడులు పెట్టింది. తొలుత ఆంక్షలు విధించిన అమెరికా, ఆ తర్వాత మినహాయింపును ఇచ్చింది. అయితే, తాజాగా ఆ గడువు ముగిసిన నేపథ్యంలో మళ్లీ ఈ గడువు పొడిగించింది. ఫలితంగా చాబహార్ పోర్ట్‌లోని షహీద్ బెహెస్తీ టెర్మినల్ అభివృద్ధి, నిర్వహణకు భారత్‌కు వీలు కలిగింది. అయితే, ఈ ఒప్పందం తర్వాత భారత్‌కు అమెరికా హెచ్చరికలు జారీ చేసింది. 'ఇరాన్‌పై అమెరికా కొన్ని ఆంక్షలు విధించింది. వాటి అమలు కొనసాగుతూనే ఉంటుంది. ఏ సంస్థ అయినా, దేశమైనా టెహ్రాన్‌తో వ్యాపార లావాదేవీలు జరిపితే, వారు కూడా వాటి పరిధిలోకి వస్తారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి' అని పేర్కొంది. ఈ ఒప్పందాన్ని సంకుచిత దృష్టితో చూడకూడదని అప్పట్లో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అమెరికాకు కౌంటర్ ఇచ్చారు. 'వాషింగ్టన్ గతంలో ఎన్నడూ ఇలా చేయలేదు. చాబహార్ విషయంలో అమెరికా వైఖరే గమనించండి. ఆ పోర్టును విస్తృత కోణంలో చూస్తే సరైనదే అని వెల్లడించింది. చాలా కాలం నుంచి పోర్టుపై పనిచేస్తున్నాం. కానీ, ఎప్పుడూ సుదీర్ఘకాలం ఒప్పందం చేసుకోలేదు. దీనికి ఇరాన్ వైపు సమస్యలు, జాయింట్ వెంచర్ భాగస్వామి మార్పులు, నిబంధనలు ఇలా చాల సమస్యలు ఉన్నాయి. వాస్తవానికి దీర్ఘకాలిక ఒప్పందంతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. చివరికి ఎట్టకేలకు సమస్యలు పరిష్కరించుకొని డీల్‌పై సంతకాలు చేశాం. ఇది లేకపోతే రేవు నిర్వహణ కష్టమైపోతుంది. అంతిమంగా చాబహార్ వల్ల ఈ ప్రాంతం మొత్తానికి ప్రయోజనం లభిస్తుంది.' అని జై శంకర్ అభిప్రాయపడ్డారు.

## వివిప్యాట్‌లు ఉపయోగించాలనే నిబంధనేమీ లేదు : ఎస్ఇసి




**ముంబయి :** స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్ (వివిప్యాట్) యంత్రాలను ఉపయోగించడానికి చట్టాలు లేదా నియమాలలో ఎటువంటి నిబంధన లేదని మహారాష్ట్ర రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఇసి) పేర్కొంది. ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించడానికి మహారాష్ట్రలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వివిప్యాట్ యంత్రాలను ఉపయోగించి నిర్వహించాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. వివిప్యాట్ యంత్రాల వినియోగం సాధ్యం కాకపోతే, గ్రామీణ, పట్టణ పౌర సంస్థలకు ఎన్నికలు బ్యాలెట్ పత్రాలను ఉపయోగించి నిర్వహించాలని కాంగ్రెస్ శాసనసభ్యుడు (సిఎల్‌పి) నాయకుడు విజయ్ వాడేట్టివార్ అన్నారు. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌తో సహా రాష్ట్రంలోని వివిధ స్థానిక సంస్థలకు ఎన్నికలు జనవరి 2026 నాటికి పూర్తి కానున్నాయి. కొన్ని మినహాయింపులు మినహా, రాష్ట్రంలోని దాదాపు అన్ని స్థానిక సంస్థల ఎన్నికలు బహుళ సభ్యుల వార్డు వ్యవస్థ కింద నిర్వహించబడుతున్నాయని ఎస్ఇసి బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌లతో కూడిన సాంకేతిక మూల్యాంకన కమిటీ (టిఇసి), బహుళ సభ్యుల వ్యవస్థల కోసం వివిప్యాట్ అటాచ్‌మెంట్‌లకు అనుకూలమైన ఓటింగ్ యంత్రాల అభివృద్ధిని అధ్యయనం చేస్తోందని అది తెలిపింది. కమిటీ తుది నివేదిక ఇంకా సమర్పించాల్సి ఉందని, అందువల్ల స్థానిక సంస్థల ఎన్నికల్లో వివిప్యాట్‌లను ఉపయోగించడం ప్రస్తుతం సాధ్యం కాదని ఎస్ఇసి తెలిపింది. స్థానిక సంస్థల ఎన్నికలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఇవిఎంలు) ఉపయోగించాలనే నిబంధనను 2005లో సంబంధిత చట్టాలు, నియమాలలో చేర్చారు. అయితే, వివిప్యాట్‌ల వినియోగానికి సంబంధించి ఎటువంటి చట్టపరమైన నిబంధన లేదని అది పేర్కొంది. మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికలు ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ చట్టం, 1888, బాంబే ప్రావిన్షియల్ మున్సిపల్ కార్పొరేషన్ల చట్టం, 1949, మహారాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్స్, నగర్ పంచాయతీలు, పారిశ్రామిక టౌన్‌షిప్‌ల చట్టం, 1965, మహారాష్ట్ర జిల్లా పరిషత్‌లు, పంచాయతీ సమితీల చట్టం, 1961, ముంబై గ్రామ పంచాయతీల చట్టం, 1958 నిబంధనల ప్రకారం నిర్వహించబడుతున్నాయని ఎస్ఇసి తెలిపింది. ఈ చట్టాలను లేదా నియమాలను సవరించడం దాని అధికార పరిధిలోకి రాదని కూడా స్పష్టం చేసింది.

## ఓటర్ల జాబితాలో అవకతవకలకు వ్యతిరేకంగా రేపు నిరసన



**ముంబయి :** మహారాష్ట్రలో ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా ప్రతిపక్ష కూటమి నవంబరు 1వ తేదీన నిరసన ప్రదర్శన నిర్వహించనుంది. కార్యక్రమానికి శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రే, ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన అధ్యక్షుడు రాజ్ థాక్రేతో సహా మహా వికాస్ అఘాడీ భాగస్వామ్యపక్షాల అగ్ర నాయకులు నాయకత్వం వహించనున్నారు. నిరసన కార్యక్రమానికి సంబంధించి రోడ్‌మ్యాప్‌ను ఖరారు చేయడానికి గురువారం ముంబయిలోని వైబి చవాన్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నసీమ్ ఖాన్, రైతులు, కార్మికుల పార్టీ (బిడబ్ల్యుపి) జయంత్ పాటిల్, వామపక్షాల నాయకులు సమావేశమయ్యారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శివసేన (యుబిటి) నాయకుడు అనిల్ పరాబ్ మాట్లాడుతూ దక్షిణ ముంబయిలోని ఫ్యాషన్ స్ట్రీట్ నుండి బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) ప్రధాన కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 4 గంటల మధ్య నిర్వహించబడుతుందని చెప్పారు. నిరసన ప్రదర్శన వల్ల పౌరులకు ఎటువంటి అసౌకర్యం కలగదని ఆయన అన్నారు. శరద్ పవార్, ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాకరే సహా రాష్ట్రంలోని మొత్తం ప్రతిపక్ష నాయకత్వం ఈ మార్చ్‌లో పాల్గొంటుందని, ఇది శాంతియుతంగా జరుగుతుందన్నారు. ఓట్ల దొంగతనం, ఓటర్ల జాబితాలలో అవకతవకలు వంటి అంశాలను హైలైట్ చేస్తామని సేన (యుబిటి) ఎమ్మెల్సీ అన్నారు. మహారాష్ట్ర రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఇసి) స్థానిక సంస్థల ఎన్నికలను నియంత్రించే చట్టాలు లేదా నియమాలలో ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్ (వివిప్యాట్) యంత్రాలను ఉపయోగించడానికి ఎటువంటి నిబంధన లేదని పేర్కొనడంపై పరాబ్ స్పందిస్తూ ప్రతిపక్షాలు ఎస్ఇసి ప్రకటనను అధ్యయనం చేస్తున్నాయని చెప్పారు. 2017లో నాందేడ్ వాఘాలా నగర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయంలో వివిప్యాట్ పరీక్ష జరిగినందున ఎస్ఇసి వాదన నమ్మశక్యం కాదని కాంగ్రెస్ ప్రతినిధి సచిన్ సావంత్ అన్నారు. ఈ వాదనకు ఎటువంటి ఆధారం లేదని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ స్వయంగా ఈ అంశాన్ని హైలైట్ చేసినందున కాంగ్రెస్ పూర్తిగా ఉమ్మడి నిరసన ర్యాలీకి మద్దతు ఇస్తుందని ఆయన అన్నారు. పార్టీ నాయకత్వం ఈ మోర్చాలో పాల్గొంటుందని సావంత్ అన్నారు. జనవరి 31, 2026 నాటికి పూర్తి కానున్న గ్రామీణ, పట్టణ సంస్థల ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాలను సరిదిద్దాలని, క్రమరాహిత్యాలను తొలగించాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయని, రాష్ట్రంలోని ఓటర్ల జాబితాలో దాదాపు కోటి మంది బోగస్ ఓటర్లు ఉన్నారని వారు పేర్కొన్నారు. ఈ నెల ప్రారంభంలో, శివసేన (యుబిటి), కాంగ్రెస్, ఎన్‌సిపి (ఎస్‌పి), ఎంఎన్ఎస్ నాయకులు రాష్ట్ర ఎన్నికల కమిషనర్, ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి వివిధ చిరునామాలు, అసెంబ్లీ విభాగాలలోని ఓటర్ల జాబితాలో నకిలీ ఓటర్లు ఉన్నట్లు ఎత్తి చూపారు.

## కేంద్ర కార్మిక విధాన ముసాయిదాపై కేరళ ప్రభుత్వం మండిపాటు



**తిరువంతపురం :** కేంద్ర కార్మిక విధాన ముసాయిదాపై కేరళ కార్మిక, విద్యా శాఖ మంత్రి శివన్ కుట్టి తీవ్ర విమర్శలు గుప్పించారు. దీనిని కార్మిక వ్యతిరేక, రాష్ట్రాల హక్కులను హరించేదిగా ఆయన అభివర్ణించారు. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 'శ్రమ శక్తి నీతి 2025' అనే కొత్త విధానం రాజ్యాంగబద్ధమైన కార్మిక హక్కులను, సామాజిక న్యాయం అనే భావనను పూర్తిగా తిరస్కరిస్తుందని ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. కార్మికుల హక్కుల గురించి మాట్లాడే విధాన పత్రం ఆధారంగా భారత రాజ్యాంగానికి బదులుగా 'మనుస్మృతి' వంటి పురాతన గ్రంథాలు, 'రాజధర్మ', 'శ్రమధర్మ' వంటి భావనలను ఉదహరించే విధానాన్ని కేరళ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని మంత్రి అన్నారు. ఇది తీవ్రంగా ఖండించదగినదన్నారు. కార్మికులు 'హక్కులు కలిగిన పౌరులు' అని, వారిని లొంగిపోయే బానిసలుగా చేసే ఒక రహస్య ప్రయత్నమని ఆయన మండిపడ్డారు. కుల ఆధారిత కార్మిక విభజనను సమర్థించే అటువంటి ఆలోచనలను తిరిగి తీసుకురావడం సామాజిక న్యాయానికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి, కార్మిక సంక్షేమం రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలోని అంశాలు అని మంత్రి అన్నారు. 'కొత్త ముసాయిదా విధానం రాష్ట్రాలను పూర్తిగా విస్మరిస్తుంది. కార్మిక, ఉపాధి విధాన మూల్యాంకన సూచిక వంటి విధానాల ద్వారా రాష్ట్రాలను ర్యాంక్ చేయడానికి, కేంద్రం కార్పొరేట్ అనుకూల విధానాలను విధించడానికి దారితీస్తుందని ఆయన అన్నారు. ఇది సమాఖ్య సూత్రాలను స్పష్టంగా ఉల్లంఘించడమేనన్నారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనం, శాశ్వత ఉపాధి వంటి కార్మికుల ప్రాథమిక అవసరాలపై ఈ విధానం పూర్తిగా మౌనంగా ఉందని శివన్‌కుట్టి అన్నారు. ఇది అమలు యంత్రాంగాలను బలహీనపరుస్తుందని, కార్మిక రంగంలో దోపిడీని పెంచడానికి మాత్రమే ఉపయోగపడుతుందని ఆయన ఆరోపించారు. కార్మికుల సంక్షేమం, హక్కులను పరిరక్షించడంలో కేరళ దేశానికి ఒక నమూనా అని మంత్రి అన్నారు.

## మహిళాశక్తి రాజకీయశక్తిగా మారితే దేశాన్ని తీర్చిదిద్దగలం : ప్రియాంక



**వయనాడ్ :** దేశంలో మహిళలు 50 శాతం ఉన్నారని, ఈ మహిళాశక్తిని రాజకీయ శక్తిగా ఉపయోగిస్తే దేశాన్ని తీర్చిదిద్దగలరని కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా పేర్కొన్నారు. మహిళల ప్రయత్నాలనూ తరచూ గుర్తుచడం లేదన్నారు. అయితే వారి కుటుంబానికిగానీ, సమాజానికి కాని సమస్యలు ఎదురైనప్పుడు వారికి అండగా నిలబడేది మహిళలేనని ఆమె ఉద్ఘాటించారు. పదింజరతర పంచాయతీ వయనాడ్‌లో నిర్వహించిన కుటుంబంశ్రీ సిడిఎస్ వార్షిక వేడుకల్లో ప్రియాంకా గాంధీ పాల్గొని మాట్లాడారు. మహిళలు ఒక సమష్టి శక్తిగా తమ బలాన్ని అర్థం చేసుకున్నప్పుడు, ఈదేశాన్ని తీర్చిదిద్దగలరన్నారు. మన మన దేశంలో 50 శాతం మంది మహిళలు ఉన్నారని, ఈ మహిళా శక్తి సమష్టిగా రాజకీయ శక్తిగా ఉపయోగించాలని సూచించారు. అందువల్ల మహిళలు ఎక్కువ శాతం రాజకీయాల్లోకి వస్తారని తాను ఆశిస్తున్నానన్నారు. పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత కార్యక్రమంలో భాగమైన కుడుంబశ్రీలో భాగమైన మహిళలు తమ సొంత కుటుంబాలను పోషించుకోడమే కాకుండా, ఒకరికొకరు సహాయం కూడా చేసుకున్నారని ఆమె అన్నారు.



**SHRIRAM Finance** వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP28TE 6777 | Swathi Boora | TATA LPT 3118 CUMMINS V DIESEL | 2013 |
| 2 | AP02AF 7291 | Venu Gopalrao Marnwni | INNOVA EURO 425 V DIESEL | 2010 |
| 3 | AP36TA 2127 | Nepal Reddy Chandupatla | TOYOTA INNOVA P | 2011 |
| 4 | AP16TY 8555 | Rajesh Thothurla | TATA LPT 3118 CUMMINS FBT | 2011 |
| 5 | TS36T 8197 | Renuka Gollena | AL 2518 FBT-T | 2018 |
| 6 | TS07UA 2153 | Aedla Suresh | CHEVROLET TAVERA NEO-P | 2014 |
| 7 | TS15UB 0533 | Ravindhar Reddy Manchinilla | AL 4923 | 2014 |
| 8 | AP39TH 5579 | Bikshapathi Gorriparthu | TATA LPK 2518 FBT | 2019 |

**AUCTION DATE:01-11-2025**

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**

D.No:5-11-503 & 504, Kandakatla Gateway 3rd floor, KUC X Road, Hanamkonda - 506009. Cell : 9849955900, 9573787776


**FORMAT – C1**
**(CHAPTER-3 PARA-3.5)**

**Declaration about Criminal Cases**

**(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation &Ors. Vs. Union of India & Anr.)**

Name and address of candidate: **ANAND RAO JOLLU,**
**H.No.8-4-369, B23, FF4, Aditya Nagar, Hyderabad-500018.**

Name of political party : **INDEPENDENT**

*Name of Election : **Assembly BYE-Election 2025**

*Name of Constituency : **61-Jubilee Hills**

I **ANAND RAO JOLLU** (name of candidate), a candidate for the abovementioned election, declare for public information the following details about my criminal antecedents:

(A) Pending criminal cases

| Sl. No. | Name of Court | Case No. and dated | Status of Case(s) | Section(s) of Acts concerned and brief description of offence(s) |
|---|---|---|---|---|
| 1 | **JMFC (Mobile), Sangareddy** | **CC No. 1873/20204 Dt: 07-12-2024** | **386, 447, 427, 504, 34 of IPC** | **Criminal Intimidation (extortion), unlawful trespass, property damage and provocation to breach peace.** |

(B) Details about cases of conviction for criminal offences

| Sl. No. | Name of Court & date(s) of order(s) | Description of offence(s) & punishment imposed | Maximum Punishment Imposed |
|---|---|---|---|
| **N/A** | **Not Applicable** | **Not Applicable** | **Not Applicable** |

ప్రజాపక్షం
శుక్రవారం, 31 అక్టోబరు

# ట్రంప్, జిన్‌పింగ్ సర్దుబాటు

ప్రపంచ వాణిజ్యానికి రాజకీయాలకు ఇబ్బందికరంగా తయారైన అమెరికా – చైనా ప్రజారిపబ్లిక్ వాణిజ్య ఉద్రిక్తతలను ఆ రెండు అగ్రరాజ్యాల అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్, జి జిన్‌పింగ్ మధ్య గురువారం బుసాన్(దక్షిణ కొరియా)లో జరిగిన చర్చలు పూర్తిగా సడలించకపోయి ఉండవచ్చు. కాని ఉద్రిక్తతల సడలింపున కు, పరస్పర సహకారాభివృద్ధికి బాట వేశాయనవచ్చు. రెండు దేశాల వాణిజ్య బృందాలు పలుదఫాలు చర్చల ద్వారా తక్షణ అంగీకారాలపై ఏకాభిప్రాయం సాధించిన మేరకు వాటికి అధ్యక్షులిరువురూ ఆమోదముద్ర వేశారు. వచ్చే ఏప్రిల్‌లో ట్రంప్ చైనా పర్యటనకు, ఆ తదుపరి జిన్‌పింగ్ అమెరికా సందర్శనకు మార్గం సుగమమైంది. ఈ అగ్రనేతలిరువురూ కలుసుకోవటం ఆరేళ్ల తదుపరి ఇదే మొదటిసారి. ఉక్రేన్–రష్యా యుద్ధం, తైవాన్ తదితర వివాదాంశాలు చర్చకు వస్తాయని పరిశీలకులు భావించినప్పటికీ తక్షణ వాణిజ్య వివాదాలపైనే వారిరువురు దృష్టి పెట్టారు. సింథటిక్ మత్తు పదార్థం ఫెంటానిల్ తయారీకి అవసరమైన రసాయనాల సరఫరాను నియంత్రించాలన్న అమెరికా విజ్ఞప్తిని చైనా అంగీకరించింది. అలాగే అరుదైన భూగర్భ ఖనిజాల ఎగుమతులపై విధించిన ఆంక్షలు సడలించటానికి కూడా చైనా అంగీకరించింది. ఈ రెండూ స్వదేశంలో రాజకీయాల్లో ట్రంప్‌కు తక్షణ కీలకాంశాలు. ఈ అంశాలపై వివాదం కారణంగానే చైనా నుంచి దిగుమతులపై సుంకాలను ట్రంప్ 47నుంచి 57శాతానికి పెంచారు. ఇప్పుడు ఆ పెంచిన 10శాతాన్ని ట్రంప్ వెనక్కి తీసుకున్నారు. జిన్‌పింగ్‌తో చర్చల ఫలితాల పట్ల ట్రంప్ చాలా ఉత్సాహంగా కనిపించారు. బుసాన్ సమావేశం అమెరికా – చైనా మధ్య కొనసాగుతున్న వాణిజ్య ప్రతిష్టంభనను సడలించింది. సంబంధాల పెరుగుదలకు నాంది పలికింది. మిత్రులు, ప్రత్యర్థులపై సమానంగా సుంకాలు విధిస్తూ వివిధ దేశాలను లొంగదీసుకునే ఎత్తుగడలు పాటిస్తున్న ట్రంప్ ఇప్పటికే చైనాతో సుంకాల యుద్ధంలో ఉన్నారు. చైనా దీటుగా నిలబడటంతో అనేక సడలింపులు ప్రకటించారు. అయితే వాణిజ్యంలో ఉద్రిక్తతల సడలింపు చర్యలు ఇరు దేశాలకూ అవసరం. దేశంలో తన ఆత్మహత్యాసదృశ ఆర్థిక విధానాల పట్ల తీవ్రమైన వ్యతిరేకత ఎదుర్కొంటున్న ట్రంప్‌కు చైనాతో ఘర్షణ నివారణ అవసరం. సుంకాల పెంపుదలతో అమెరికాకు ఎగుమతులు తగ్గిపోయి, ఆర్థిక మాంద్యంలో పడుతున్న చైనాకు ఆ సుంకాల తగ్గింపు అవసరం. అమెరికా, చైనాలు ప్రపంచంలో వరుసగా ఒకటి, రెండు స్థానాల్లో ఉన్న ఆర్థిక వ్యవస్థలు. వాటి మధ్య ఘర్షణ రెండు దేశాలకు నష్టదాయకం. రష్యా నుండి చైనా, భారత్‌లు క్రూడ్ అయిలు కొనుగోలు చేస్తూ పుతిన్ యుద్ధయంత్రానికి తోడ్పాటు ఇస్తున్నాయన్న ఆరోపణతో ట్రంప్ ఆ రెండు దేశాలపై 40శాతం అదనపు సుంకం విధిస్తున్నారు. అయితే ఆ అంశం జిన్‌పింగ్‌తో చర్చల ఎజెండాలోకి రాలేదు. భారత్‌తో కూడా వాణిజ్య ఒప్పందానికి చేరువలో ఉన్నామని ట్రంప్ ప్రకటించటం గమనార్హం. తమ వ్యవసాయోత్పత్తులకు చైనా, భారత్ మార్కెట్‌ను సంపాదించి, మార్కెట్ మాంద్యాన్ని అరికట్టటం ట్రంప్ ప్రాధాన్యాంశాల్లో ఒకటి. భారత్‌తో వాటిపైనే ఒత్తిడి చేస్తున్నారు. చైనా ఇప్పటికే సోయాబీన్‌ను ఇతర వ్యవసాయోత్పత్తులను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకోవటం మొదలు పెట్టింది. చైనా నుంచి అరుదైన భూగర్భ ఖనిజాల ఎగుమతిపై ఆంక్షలకు 'ఆటంకం' తొలగిందని ట్రంప్ ప్రకటించారు. కాబట్టి బుసాన్ సమావేశం ఇరుదేశాలకూ లాభసాటి తప్ప ఏ ఒక్కరికో విజయంకాజాలదు. అయితే 'చైనా అభివృద్ధి దార్శనికత అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేయాలన్న (ఎంఎజిఎ – మెగా ) ట్రంప్ దార్శనికతతో కలిసి సాగుతుందని ట్రంప్‌తో చర్చల్లో జి వ్యాఖ్యానించినట్లు చైనా మీడియా తెలియజేయటం పరిశీలకులకు ముఖ్యంగా అమెరికాలోని ట్రంప్ వ్యతిరేక వామపక్షవాదులను దిగ్భ్రాంతిపరిచింది. ట్రంప్ మెగాకు వ్యతిరేకంగా వారు ఆందోళన చేస్తున్నారు. జి వ్యాఖ్య నవంబర్ 4న జరిగే న్యూయార్క్ మేయర్ ఎన్నికలపైన, ఇతర రాష్ట్రాల్లో గవర్నర్‌ల ఎన్నికల పైన ప్రభావం చూపుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రపంచ వ్యవహారాల్లో అమెరికాకు పోటాపోటీగా నిలబడి సమఉజ్జీ అనిపించుకోవటమే చైనా లక్ష్యం.

# సముద్రంలో చైనా డేటా సెంటర్


ఎం.కోటేశ్వరరావు

## నరేంద్ర మోదీ, చంద్రబాబు నిజంగా భవిష్యత్ దార్శనికులా!

సముద్రంలో చైనా నిర్మించిన పదమూడు వందల టన్నుల బరువుగల డేటా సెంటర్ ఆదివారం నాడు (2025 అక్టోబరు26న) ప్రారంభమైంది. ఇది గాలి మరలతో ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను వినియోగించనుంది. హై క్లౌడ్ అనే కంపెనీ మొదటి దశలో భాగంగా 24మెగావాట్ల కేంద్రాన్ని షాంఘై తీరంలో నెలకొల్పింది. న్యూస్ అట్లాస్ వెల్లడించిన సమాచారం ప్రకారం సముద్రపు ఒడ్డున నిర్మించిన గాలి మరల విద్యుత్ కేంద్రం నుంచి 95శాతం విద్యుత్‌ను ఈ కేంద్రానికి సరఫరా చేస్తారు, సముద్రపు నీటిని చల్లబరిచేందుకు వినియోగిస్తారు. మొత్తం 22.6 కోట్ల డాలర్ల ఖర్చుతో నిర్మించిన ఈ కేంద్రంలో సాంప్రదాయపు డేటా సెంటర్ల కంటే 23శాతం విద్యుత్ వినియోగం తగ్గుతుంది. సముద్రంలో 114 అడుగుల అడుగున ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలోని ఒక్కో గదిలో 4 నుంచి ఐదు వందల సర్వర్లు ఉంటాయి. సముద్రంలో ఏర్పాటు చేసిన టెలికాం కేబుళ్ల ద్వారా ఈస్టర్న్ డేటా, వెస్టర్న్ కంప్యూటింగ్ వ్యూహం ప్రకారం ప్రధాన భూభాగంలోని కేంద్రానికి అనుసంధానం చేశారు. రానున్న రోజుల్లో ఇలాంటివే మరో వందగదులను నిర్మించి విస్తరిస్తారు. మైక్రోసాఫ్ట్ కంపెనీ చైనాలో 2015లో పైలట్ ప్రాజక్టుగా సముద్రంలో ఒక డాటా కేంద్రాన్ని నిర్మించింది. ప్రాజెక్ట్ నాటిక్ పేరుతో చేసిన ఈ ప్రయోగానికి స్వస్తి పలికి 2024 జూన్‌లో దాన్ని సముద్రంలో ముంచివేసింది. ఆదివారం నాడు సముద్రంలో తొలి వాణిజ్య డాటా కేంద్రాన్ని నిర్మించి ప్రారంభించిన తొలి దేశంగా చైనా చరిత్రకెక్కింది. ఇలాంటివే మరో రెండు నిర్మాణంలో ఉన్నాయి. ఈ కేంద్రం చైనాలో అతి పెద్ద తొలి స్వేచ్ఛా వాణిజ్య కేంద్రం ఉన్న హైనాన్ సమీపంలో ఉంది. పూర్తిగా విదేశీ పెట్టుబడులతో నిర్మించారు.

విశాఖలో అదానీ, ఎయిర్‌టెల్ కంపెనీలతో కలసి గూగుల్ నిర్మించనున్న డేటా కేంద్రం ఎంత మందికి ఉపాధి కల్పిస్తుందన్నది చర్చ. లింక్‌డ్‌ఇన్‌లో వచ్చిన ఒక విశ్లేషణ జర్మనీలోని బిఎఎస్‌ఎఫ్ రసాయన కంపెనీతో డేటా సెంటర్ల ఉపాధిని పోల్చింది. సదరు జర్మనీ సంస్థ 684మెగావాట్ల విద్యుత్‌ను వినియోగిస్తుంది, 50వేల మందికి పూర్తి స్థాయి ఉపాధిని కల్పిస్తున్నది. అదే జర్మనీలో డాటా కేంద్రం 2,283మెగా వాట్ల విద్యుత్‌ను వినియోగించే చోట పూర్తి కాలపు ఉపాధి 6,849 నుంచి 13,699 మందికి చూపుతుంది. రసాయన ఫ్యాక్టరీ ఒక మెగావాట్‌కు 73 మందికి ఉద్యోగ కల్పన చేస్తుంటే డేటా సెంటర్ ఒక మెగావాట్‌కు 3 నుంచి ఆరు ఉద్యోగాలను ఇస్తున్నది. గూగుల్ ఆధునిక సాంకేతిక ప్రక్రియలను వినియోగిస్తుంది గనుక ఇంకా తగ్గవచ్చు. ఆ లెక్కన చూసినా విశాఖలో నిర్మించే ఒక గిగావాట్(వెయ్యి మెగావాట్లు) కేంద్రం మూడు నుంచి ఆరువేల మందికి పర్మనెంటు ఉద్యోగాలను కల్పిస్తుంది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పిన అంకెలు దీనికి దగ్గరగా ఉన్నాయి. దానికి భిన్నంగా రాష్ట్ర మంత్రి లోకేష్ చెప్పారు. ఇద్దరికి సమాచార వనరు ఏమిటి ? ఈ విషయాన్ని చెప్పటానికి బిడియపడాల్సిందేముంది. అదే గూగుల్‌ను అడిగితే అందించిన ఇతర విశ్లేషణలు కూడా దీనికి దగ్గరగానే ఉన్నాయి. ప్రైవేటు కంపెనీలన్నీ సాధ్యమైనమేరకు తక్కువ మందితో పని చేయించుకొనేందుకు చూస్తాయి. కన్సిడర్ మైక్రోసాఫ్ట్ ఏర్పాటు చేసిన సిడ్నీలోని డాటా కేంద్రం 2023లో అకస్మాత్తుగా ఆగిపోయింది. తగినంత మంది సిబ్బంది లేని కారణంగా జరిగిన ఆ అంతరాయం 46 గంటల పాటు సేవల నిలిపివేతకు దారితీసింది. అప్‌టైమ్ ఇనిస్టిట్యూట్ అనే సంస్థ సిబ్బంది కొరత గురించి పేర్కొన్నది. ప్రపంచ డాటా సెంట్లర్లలో 2019లో ఇరవైలక్షల మంది పూర్తి కాలపు ఉద్యోగులు ఉంటే 2025 నాటికి కేంద్రాలు పెరిగినా 23లక్షల మంది మాత్రమే ఉన్నారు. ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగులా అన్నది వివరణ లేదు. ప్రపంచంలో ఇప్పుడున్న 122 గిగావాట్ల సామర్థ్యంలో సగటు తీసుకుంటే ఒక్కో గిగావాట్‌కు 18,700 ఉన్నట్లు కనిపిస్తున్నది. విశాఖ గూగుల్ సెంటర్‌కు అందరూ కలసి 20 నుంచి 30వేల



మంది ఉంటారని కూడా పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. డాటా కంపెనీలు సిబ్బందిని చేర్చుకోవటం, నిలుపుకోవటంలో తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నాయి. చిన్న కేంద్రాలు(ఒకటి నుంచి ఐదు మెగావాట్లు) 8 నుంచి 15 మంది, ఐదు నుంచి ఇరవై మెగావాట్ల కేంద్రాలు 15 నుంచి 35 మంది, ఇరవై అంతకు మించిన సామర్థ్యం కలిగినవి 35 మందికి పైగా, 40 మెగావాట్ల సంస్థలు 45 మందిని, వంద మెగావాట్లు అంతకు మించి సామర్థ్యం కలిగినవి కొద్దిమందితోనే నిర్వహిస్తున్నాయి, ఎందుకంటే యాంత్రీకరణ మరియు నిర్ణీత ప్రమాణాలతో ఉండే వ్యవస్థలు అందుకు దోహదం చేస్తున్నాయి. నియమించుకుంటున్నాయి. డేటా సెంటర్లలో మొత్తం 230 రకాల సిబ్బంది అవసరం అని చెబుతున్నారు. అయితే చిన్న సంస్థలు అంతమందిని నియమించవు, అవి అవసరమైనపుడు పొరుగు సేవలను ఉపయోగించుకుంటాయి. సగం డేటా సెంటర్లు అవసరమైన నిపుణులు దొరక్క ఇబ్బందులు పడుతున్నాయి.

రెండును రెండుతో కలిపినా, హెచ్చవేసినా ఫలితం నాలుగే. ఇది చెప్పటానికి గణితమేథావులతో పనిలేదు. డేటా సెంటర్లతో కలిగే పర్యావరణహాని, విషపూరితమైన వ్యర్థాల వంటి ఇతర దుష్ఫలితాల గురించి వైఎస్ జగన్మోహనరెడ్డి చెప్పినా(అఫ్ కోర్స్ అధికారంలో ఉన్నపుడు ఈ పెద్దమనిషి వీటి గురించి చెప్పలేదు, ఇప్పుడు చంద్రబాబు నాయుడు కూడానోరు విప్పరు) ఆ రంగం గురించి అధ్యయనం చేసినవారు చెప్పినా విషయం ఒకటే. ఎవరైనా రాజకీయాలతో నిమిత్తం లేని వారు చెబితే చూశారా రాష్ట్ర అభివృద్ధిని వ్యతిరేకించేవారు జగన్‌తో చేతులు కలిపి అవే వాదనలు చేస్తున్నారంటూ ప్రచార దాడికి దిగుతున్నారు. అంటే నోరు మూయించేందుకు ఇదొక రకం నియంతృత్వపోకడతప్ప మరొకటి కాదు. తేమ కారణంగా యంత్రాలు పనికి రాకుండా పోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున అమెరికాలోని డేటా కేంద్రాలన్నీ పొడివాతావరణం ఉండే ప్రాంతాల్లోనే ఏర్పాటు చేశారని చెబుతున్నారు.పెట్టుబడిలో నాలుగో వంతు సబ్సిడీలు, సంవత్సరాల తరబడి రాయితీ ధరలకు నీరు, విద్యుత్ అందచేస్తున్న తరువాత ఏ పెట్టుబడిదారుడు మాత్రం చంద్రబాబు నాయుడి దరిచేరడు ! డాటా సెంటర్ మాప్ డాట్ కామ్ సమాచారం ప్రకారం గూగుల్‌కు ప్రపంచంలో 113 డాటా సెంటర్లు ఉండగా వాటిలో 68 పని చేస్తున్నాయి, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో ఎందరు ఉద్యోగులు పని చేస్తున్నారని అడిగితే సమాచారం లేదని బదులు వచ్చింది. ప్రపంచంలో గూగుల్ సంస్థలో లక్షా 83వేల మంది పనిచేస్తున్నారనే సమాచారం ఉంది తప్ప ఏ విభాగంలో ఎందరు అన్నది లభ్యం కావటం లేదు. ఎవరికైనా దొరికితే ఈ విశ్లేషణకు జత చేస్తాను. మానవహక్కుల ఫోరం (హెచ్‌ఆర్‌ఎఫ్) సమాచారం ప్రకారం అమెరికాలోని అష్‌బర్న్ మరియు లీస్‌బర్గ్ డాటా సెంటర్లు రెండిలోనూ కలిపి ప్రత్యక్షంగా 400 మందికి పరోక్షంగా 3,100 మంది ఉపాధి దొరుకుతున్నట్లు పేర్కొన్నది. లోకేష్ చెప్పినట్లు లక్షా 88వేల ఉద్యోగాల్లో 88వేలు పర్మనెంటు అనుకుంటే మొత్తం గూగుల్ ఉద్యోగులు విశాఖలోనే ఉంటారన్నట్లుగా భావించాలి, అది జరిగేదేనా !

డేటా అనేక విధాలుగా కీలక పాత్ర పోషిస్తున్న పూర్వరంగంలో మనదేశం కూడా వెనుకపడకూడదు. కానీ నరేంద్రమోడీ లేదా రెండింజన్ల పాలనలో ఉన్న ప్రభుత్వాలు గానీ ఎంతో నిర్లక్ష్యం చేశాయన్నది అంకెలే చెబుతున్నాయి.2019లో 350 మెగావాట్ల సామర్థ్యం ఉండగా 2025 నాటికి 1,350 మెగావాట్లకు చేరుతుందని చెబుతున్నారు. ఈ రంగంలో మిగిలిన దేశాలు ఎంతో ముందున్నాయి.దీనికి కూడా నెహ్రూయే కారణం అని చెబుతారేమో తెలియదు. ముందు చూపు లేకపోవటం తప్ప మరొకటి కాదు.చైనాలో గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లు లేవు, మైక్రోసాఫ్ట్ కొన్ని ప్రయివేటు రంగ సంస్థల్లో తప్ప ప్రభుత్వం వినియోగించటం లేదు.కృత్రిమ మేథ, క్వాంటమ్ కంప్యూటింగ్‌లో చైనా వెనుకబడిందని శత్రువులు కూడా చెప్పలేరు.తాజా సమాచారం ప్రకారం 2024నాటికి చైనాలో డేటా వాణిజ్య విలువ 47.23 బిలియన్ డాలర్లు కాగా 2030 నాటికి అది 97.30బి.డాలర్లకు పెరుగుతుందని రిసర్చ్ అండ్ మార్కెట్స్ సంస్థ పేర్కొన్నది. స్టాటిస్టా సంస్థ విశ్లేషణ మరోవిధంగా ఉంది.అమెరికాలో 2025 నాటికి డాటా సెంటర్ల ఆదాయం 171.9 బిలియన్ డాలర్లు, కాగా చైనాలో 103.19 బిలియన్ డాలర్లని 2030 నాటికి 142.64 బి.డాలర్లకు పెరుగుతుందని అంచనా. మరో సమాచారం ప్రకారం ప్రపంచ డేటా సెంటర్ల సామర్థ్యం 2024నాటికి 122.2 గిగావాట్లు. దీనిలో అమెరికా 53.7(44శాతం) కలిగి ఉండగా చైనా 31.9 గిగావాట్లు కలిగి ఉంది. మూడో స్థానంలో ఒక కూటమిగా ఐరోపా యూనియన్ 11.9 గిగావాట్లు, మనదేశం 3.6గా ఉంది. చైనాలో ఇటీవల జత చేసిన సామర్థ్యాన్ని పని చేయించటం లేదని వార్తలు వచ్చాయి. దీన్ని బట్టి అర్థం అవుతున్నదేమిటి ? దేశం వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాలన్నింటా వృద్ధి చెందితేనే డే టా కేంద్రాలకు చేతినిండా పని ఉంటుంది. గడచిన పదకొండు సంవత్సరాలుగా కబుర్లు తప్ప అ భివృద్ధి లేని కారణంగా డేటా సెంటర్ల సామర్థ్యం కూడా పెరగలేదన్నది స్పష్టం.విశ్లేషణలను కొనుగోలు చేసేవారు లేకపోతే రేపు విశాఖ గూగుల్ సెంటర్ అయినా ఈగలు తోలుకుంటూ కూర్చోవాల్సిందే. దేశాన్ని, రాష్ట్రాన్ని వికసిత్ భారత్‌లో ఎక్కడికో తీసుకుపోతామని ప్రధాని నరేంద్రమోడీ, ఆయన అడుగుజాడల్లో లేదా అడుగులకు మడుగులద్దుతున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబా బు నాయుడు అనేక మంది దృష్టిలో దేశంలో అతి పెద్ద దార్శనికులు, ఇతరులకు తట్టనివి అనేకం వారికి కనిపిస్తాయని చెబుతారు. ఆ ప్రచారం వలన దేశానికి ఎంత లాభమో తెలియదు గానీ నష్టం కలిగిస్తున్నారంటే ఎవరూ నొచ్చుకోవాల్సిన అవసరం లేదు. పరిశోధన మరియు అభివృద్ధి(ఆర్ అండ్ డి) నేడు ప్రపంచాన్ని ఎలా నడిపిస్తున్నాయో చెప్పనవసరం లేదు.తన పాలనలో జిడిపిని పదకొండవ స్థానం నుంచి నాలుగవ స్థానానికి తెచ్చిన ఘనత నాదే అంటారు మోడీ. కాసేపు అంగీకరిద్దాం, ఆ పురోగతి ఇతర రంగాల్లో ఉందా ? వాటిలో కీలకమైన పరిశోధనకు కేటాయింపుల సంగతేమిటి ? 1995–96 నుంచి 2014–15వరకు రెండు దశాబ్దాల వార్షిక సగటు జిడిపిలో 0.73 శాతం ఉంది. యుపిఎ పాలనలో 2008–09లో జిడిపిలో 0.8శాతం నిధులు కేటాయిస్తే మోడీ ఏలుబడిలో 2017–18లో 0.7, ఇప్పుడు 0.64శాతానికి తగ్గించారు. దీనికైతే జవహర్‌లాల్ నెహ్రూ కారణం కచ్చితంగా కాదు. అన్నీ వేదాల్లో ఉన్నాయష అనే భావజాలంతో నడుస్తున్న కేంద్ర ప్రభుత్వ పెద్దల ఈ నిర్వాకాన్ని చంద్రబాబు నాయుడు సమర్థిస్తారా ? 2013 నాటి సైన్స్ మరియు టెక్నాలజీ విధానంలో, 2017–18 ఆర్థిక సర్వేలో కూడా కనీసం రెండు శాతం కేటాయించాలని చెప్పిన అంశం ఎవరికీ తెలియదా ? ఇద్దరు నేతలు దేశదేశాలు తిరుగుతున్నారు కదా ఎక్కడ ఎంత మొత్తం ఖర్చు చేస్తున్నారో తెలుసుకోరా ? ఎందుకీ నిర్లక్ష్యం ? మన అభివృద్ధి మీద గణనీయమైన ప్రభావం చూపాలంటే 2047నాటి వరకు కనీసం ఒక శాతం, ఆదర్శవంతంగా(ఐడియల్) ఉండాలంటే మూడుశాతం చొప్పున ఖర్చు చేయాలని నిపుణులు చెబుతున్నారు. పిండికొద్దీ రొట్టె, పరిశోధనా రంగంలో మనం ప్రపంచ బస్‌ను అందుకోకుండా చేసింది ఎవరంటే ఎవరిని చూపాలి ? పరిశోధనలకు మనం తక్కువ కేటాయిస్తున్నా, పరిశోధనా పత్రాలు గణనీయంగానే మనవారు సమర్పిస్తున్నారుగా అని సమర్థించుకొనే వారిని చూసి నవ్వాలో ఏడవాలో అర్థం కావటం లేదు ! ఎలాంటి పాలకులను మోస్తున్నాంరా బాబూ అని తల పట్టుకోవాలి !!

# బిజెపి – బిఆర్ఎస్ 'విలీనం' ఒక అంతులేని కథ!


ఎస్.కె. జకీర్

'మోదీ, నిన్ను దేశం నుంచి తరిమేస్తాం. మాకు నిధులు ఇచ్చేటోన్నే తెచ్చుకుంటాం. నీ ఢిల్లీ కోటను బద్దలు కొట్టడానికి కూడా నేను సిద్ధంగా ఉన్నా' అని 2023లో వరంగల్‌లో జరిగిన సభలో కెసిఆర్ గర్జించారు. తర్వాత కొన్నినెలల్లోనే రాష్ట్ర రాజకీయాలు తలకిందులయ్యాయి. రేవంత్ రెడ్డి రూపంలో వచ్చిన సునామీతో తన సిఎం కుర్చీ నుంచి కెసిఆర్ కింద పడిపోయారు.ఆ దెబ్బకు 'జాతిపిత' గంగవెర్రులెత్తారు. ఏమి జరుగుతుందో పూర్తిగా తెలుసుకునే లోపే అధికారం చేజారిపోయింది. 'నన్ను ఓడిస్తే ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటా. నాకు జరిగే నష్టమేదీ లేదు' అని అసెంబ్లీ ఎన్నికల వేళ చెప్పినట్టుగానే ఆయన మాట మీద నిలబడ్డారు. ఎర్రవల్లి ఫార్మ్ హౌజ్‌లోనే మకాం పెటారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిభాషలో చెప్పాలంటే 'కెసిఆర్ తనను తానే బందీ చేసుకున్నారు'. ఫార్ములా ఈ కారు రేసు, కాళేశ్వరం స్కామ్, ఫోన్ ట్యాపింగ్ వంటి అనేక కేసులు కెసిఆర్,బిఆర్ఎస్ ప్రముఖుల చుట్టూ ఉచ్చు బిగుసుకున్నాయి. లిక్కర్ స్కాం లో కవిత అరెస్ట్‌తో కెసిఆర్ అప్పట్లో ఆత్మరక్షణలో పడ్డారు. 'బిఆర్ఎస్ పార్టీని బిజెపిలో విలీనం చేయడానికి రెడీ అయిపోయారు. ప్రస్తుతం చుట్టుముడుతున్న అనేక సమస్యల నుంచి బయటపడాలంటే ఇదే సరైన మార్గమని కెసిఆర్ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన చర్చలు రెండు పార్టీల మధ్య సానుకూల వాతావరణంలో సాగుతున్నట్లు సమాచారం ఉంది. తెలంగాణ ఉద్యమాన్ని పద్నాలుగేండ్ల పాటు నడపడంతో పాటు, పదేళ్ల పాటు రాష్ట్రాన్ని ఏలిన బిఆర్ఎస్ ఇక చరిత్రగా మిగిలిపోవచ్చును. ఆ పార్టీని బిజెపిలో విలీనం చేయడానికి అధినేత కెసిఆర్ సిద్ధమయ్యారు. ఢిల్లీ ఎన్నికలు ముగిసిన తర్వాతనే ఈ విలీన ప్రక్రియ పూర్తి కానున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ అరెస్ట్‌తో తమకు అక్కడ కలిసి వస్తుందని బిజెపి ధీమాగా ఉంది. ఒకవేళ ఈ లోపు బిఆర్ఎస్‌ను విలీనం చేసుకుంటే ఆ పరిణామం తమకు ఇబ్బంది కలిగిస్తుందని బిజెపి నేతలు భావిస్తున్నారు. ఆ ఎన్నికలలోపే విలీనం పూర్తయితే బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటేనని లిక్కర్ స్కామ్ కక్ష సాధింపేనని ఆప్ ఎదురు దాడి చేసే అవకాశం ఉందని కాషాయ నేతలు అంచనా వేస్తున్నారు. విలీనం జరిగితే బిఆర్ఎస్‌లో కీలక నేతలుగా ఉన్న కెసిఆర్, కెటిఆర్, హరీశ్ రావు పరిస్థితి ఏంటన్న అంశంపై కూడా చర్చ జరుగుతున్నది. గతంలో కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్‌లో చేరిన సబిత ఇంద్రారెడ్డి, సుధీర్ రెడ్డి, పైలట్ రోహిత్ రెడ్డి లాంటి నేతలంతా తిరిగి సొంత గూటికి చేరతారన్న ప్రచారం చాలా రోజుల నుంచి సాగుతోంది. అయితే బిజెపిలో బిఆర్ఎస్ విలీనం అయితే వలసలకు బ్రేక్ పడే అవకాశం ఉంటుంది. ఇటీవల కాంగ్రెస్‌లో చేరి అసంతృప్తితో ఉన్న వారు కూడా తిరిగి బిఆర్ఎస్‌లోకి వచ్చే ఛాన్స్ ఉంది. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కెసిఆర్ లాంటి బలమైన నాయకత్వం తమకు ఉందని బిఆర్ఎస్ కేడర్‌కు మెసేజ్ వెళ్లే అవకాశం ఉంది. తెలంగాణలో ప్రతిపక్షమే లేదని భావిస్తున్న కాంగ్రెస్‌కు ఈ పరిణామం ఇబ్బందిగా మారే అవకాశం ఉంటుంది. బిజెపి, బిఆర్ఎస్ కలిస్తే ప్రతిపక్షం బలం భారీగా పెరిగే ఛాన్స్ ఉంది. బిఆర్ఎస్ విలీనం అయితే తెలంగాణ బిజెపిలో కొత్త జోష్ రానుంది. దక్షిణాదిలో కర్నాటక తర్వాత బిజెపి అధికారం వచ్చే ఛాన్స్ ఉన్న రాష్ట్రంగా తెలంగాణ మారే అవకాశం ఉంటుంది.2028లో అధికారమే లక్ష్యంగా ఆ పార్టీ అన్ని అస్త్రాలను ప్రయోగించనుంది''.అంటూ ఒక న్యూస్ ఛానల్ 2024 ఆగస్టులో ఒక కథనాన్ని ప్రసారం చేసింది.ఈ కథనాన్ని తీవ్రంగా ఖండించడంతో పాటుగా ఆ ఛానల్ కు బిఆర్ఎస్ పార్టీ లీగల్ నోటీసులు కూడా పంపించింది.

కాగా గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయినా 39 మంది ఎమ్మెల్యేల విజయంతో బిఆర్ఎస్ బలమైన ప్రతిపక్షంగా నిలిచింది.2014 ఎన్నికల్లో బిఆర్ఎస్,బిజెపికి వచ్చిన సీట్లు కలిపితే మొత్తం సీట్లు 68. అనంతరం జరిగిన 2018 ఎన్నికల్లో ఈ సంఖ్య 89. ఇటీవలి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీలకు వచ్చిన సీట్లు మొత్తం 47. సీట్ల సంఖ్యను పక్కన పెడితే,ఈ రెండు పార్టీల ఓట్ల శాతాన్ని పరిశీలిస్తే రాజకీయాలు తలకిందులు అవుతాయని అర్థం చేసుకోవచ్చు. 2014లో బిఆర్ఎస్, బిజెపికి వచ్చిన ఓట్ల శాతం కలిపితే 41.07. కాంగ్రెస్కు వచ్చిన ఓట్ల శాతం 25.02 మాత్రమే.2018లో బిఆర్ఎస్+బిజెపి ఓట్ల శాతం 53.88. అదే కాంగ్రెస్‌కు ఓట్ల శాతం 28.04 మాత్రమే. 2023లో బిఆర్ఎస్+బిజెపికి ఓట్లను




కలిపితే మొత్తం పోలైన ఓట్లలో 51.25 శాతం.అదే కాంగ్రెస్ ఓట్ల శాతం 39.4. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్+బిజెపి ఓట్ల శాతం 51.76. ఈ లెక్కలను పరిశీలిస్తే 2023 ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి కలిసి పోటీచేసి ఉంటే కచ్చితంగా విజయం సాధించే అవకాశం ఉండేదన్న అంచనాకు రావొచ్చు. తాను తీహార్ జైలులో ఉన్నపుడు బిఆర్ఎస్ ను బిజెపిలో విలీనం చేయడానికి తమ పార్టీ నాయకులే కుట్ర చేశారంటూ ఎమ్మెల్సీ కవిత ఆరోపించడం, తమపై కేసులను రూపు మాపడానికి గాను పార్టీనిబిజెపిలో విలీనం చేయడానికి కూడా సిద్ధమని బిజెపి అగ్రనాయకత్వంతో రాయబారం నడపాలంటూ తనను కెటిఆర్ సంప్రదించినట్లు బిజెపి ఎంపి సిఎం.రమేశ్ బహిర్గతం చేయడం అయిదు నెలల కిందట సంచలనం రేపిన ఘటనలు. బిఆర్ఎస్ అటువంటి రాయబారమేదీ చేయలేదని, బిజెపిలో ఎన్నడూ పొత్తు పెట్టుకోబోమని కెసిఆర్ మీడియా సమావేశం పెట్టి స్పష్టత ఇవ్వనంతవరకు 'విలీనం డైలమా' కొనసాగుతూ ఉంటుందని విశ్లేషకులంటున్నారు. ఇక కెసిఆర్‌తో ఢీ అంటే ఢీ అన్న రీతిలో పోరాడుతున్న బండి సంజయ్, ఈటల రాజేందర్‌తో పాటు కిషన్ రెడ్డి ఈ 'విలీనాన్ని' వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లు ఎడమొహం పెడమొహంగా ఉన్న ఈ ముగ్గురు నేతలు బిఆర్ఎస్ విలీనాన్ని వ్యతిరేకించడంలో మాత్రం ఒక్కటైనట్లు సమాచారం ఉన్నది. అయితే కెసిఆర్ ఏ క్షణంలో నిర్ణయం మార్చుకుంటారో ఎవరూ అంచనా వేయలేరు. ఈ విషయం బిజెపికి అగ్రనాయకత్వానికి బాగా తెలుసు. ఇదిలా ఉండగా తెలంగాణ రాజకీయ వాతావరణం జూబ్లీహిల్స్ ఉపఎన్నికతో మళ్లీ వేడెక్కింది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ఈ ఉపఎన్నిక బిఆర్ఎస్ పార్టీకే ముగింపు ఘట్టంగా నిలవబోతోందని స్పష్టం చేశారు. వెంగళరావునగర్ డివిజన్‌లో నవీన్ యాదవ్ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న తుమ్మల, ప్రజలకు భావోద్వేగపూర్వక పిలుపునిచ్చారు. గత పాలనలో బిఆర్ఎస్ చేసిన విధ్వంసాన్ని గుర్తుంచుకుని, వారి మోసపూరిత రాజకీయాలకు తావివ్వకూడదన్నారు. జూబ్లీహిల్స్‌ను ఎన్నో సంస్కృతులను, జాతులను కలిపిన మినీ ఇండియాగా కీర్తించారు. సిఎం రేవంత్‌రెడ్డి దూరదృష్టితో రాష్ట్ర అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తుమ్మల అభినందించారు.నియోజకవర్గ అభివృద్ధికి స్థానికుడు అయిన నవీన్ యాదవ్‌కు ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా ఉప ఎన్నికల ఫలితాలపై పూర్తి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు.జూబ్లీహిల్స్ ప్రాంతంలోని దాదాపు 46 వేల మంది పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పట్ల ప్రజాభిమానాన్ని పెంచాయని వివరించారు. పార్టీలో విభేదాలు లేవన్నారు. రాష్ట్ర రాజకీయ పరిణామాలను పార్టీ అధిష్ఠానం నిశితంగా గమనిస్తోందని, పెద్ద ఎత్తున నాయకత్వ మార్పులు, బాధ్యతల పునర్విభజనకు అవకాశాలు ఉన్నాయని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో పురాతన కుటుంబాలకు సరైన ప్రాధాన్యం ఇవ్వబడుతుందని కూడా ఆయన హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓటు మళ్లింపు జరుగుతోందని ఆరోపించారు. ఇది బిఆర్ఎస్ చరిత్రలో పదేళ్లుగా కొనసాగుతున్న పద్ధతేనని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించిన సందర్భంలో ఇప్పుడు ఓటు చోరీ ఆరోపణలు ఎవరి మీదో ప్రజలకు తెలుసుకోవాలని కోరారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత భారీ మెజారిటీతో గెలుపు లక్ష్యంగా, పార్టీ అధినేత కెసిఆర్ అధ్యక్షతన, ఎర్రవెల్లి నివాస ప్రాంగణంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాగంటి సునీత సహా, ఉప ఎన్నిక కోఆర్డినేటర్లుగా ఉన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, పార్టీ సీనియర్ నేతలు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్,మాజీ ఎమ్మెల్సీ మహమూద్ అలీ, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, జి. జగదీశ్ రెడ్డి, లక్ష్మారెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, పాల్గొన్నారు.జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల, క్లస్టర్ల ఇంచార్జులు పాల్గొన్నారు.క్షేత్రస్థాయిలో ఇప్పటిదాకా కొనసాగుతున్న ప్రచారం సంబంధిత అంశాల మీద అధినేతకు ఇంచార్జీలు రిపోర్ట్ చేశారు.పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ భారీ మెజారిటీతో గెలుపుకోసం అనుసరించాల్సిన వ్యూహాలు ఎత్తుగడలు, కార్యాచరణకు సంబంధించి, అధినేత కేసీఆర్ సమావేశంలో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. అయితే బిఆర్ఎస్, బిజెపి విలీనానికి సంబంధించిన అనుమానాలు,అపోహలు,సోషల్ మీడియా ప్రచారం జూబిలీహిల్స్ ఉపఎన్నికను ప్రభావితం చేసే అవకాశాలను కొట్టి పారేయలేం.గెలుపోటములను ఖరారు చేసే స్థాయిలో ముస్లిం మైనారిటీల ఓటర్లు ఈ నియోజకవర్గంలో ఉన్నందున ఆ రెండు పార్టీల 'రహస్య మైత్రి' గురించిన ప్రచారం నిస్సందేహంగా బిఆర్ఎస్ కు నష్టం కలిగించవచ్చు.

# తుఫాన్ బాధితులకు సాయం చేయాలి

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్రమైన మొంథా వాయుగుండం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలపై తన ముద్ర వేసింది. ఈ తుఫాను బుధవారం రాత్రి తీవ్రంగా దూసుకురావడంతో వరంగల్, నల్గొండ, జనగామ, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఆకాశం తెరచి కురిసిన వర్షం ప్రజల జీవనాన్ని దెబ్బతీసింది. వాతావరణ శాఖ జారీ చేసిన రెడ్ అలర్ట్ ప్రకారం కురిసిన కుండపోత వర్షం రైతుల జీవితాల్లో పిడుగుపాటు లాంటిది అయింది. చేతికి అందుకునే వరి, కూరగాయలు, పండ్ల తోటలు ఒక్క రాత్రిలోనే నీటమునిగాయి. ఏళ్ల కష్టం క్షణాల్లో చెదిరిపోయింది. వ్యవసాయ భూములు జలమయమయ్యాయి, పశువుల మేత కొరత తలెత్తింది, గ్రామీణ రహదారులు బీభత్స దృశ్యాలుగా మారాయి. తుఫాను తాకిడితో వరంగల్ జిల్లా హనుమకొండ పరిసర ప్రాంతాల్లోని రైతులు తమ పొలాలను రక్షించడానికి ప్రయత్నించినా ప్రకృతి ముందు మానవ శక్తి బలహీనమైపోయింది. వరి పంట సన్నగా ఉన్నప్పుడు కురిసిన వర్షం గింజల నాణ్యతను దెబ్బ తీసింది. కొందరు రైతులు పంట కోతకు సిద్ధమవుతుండగా అకాల వర్షం కా రణంగా నిల్వలో ఉన్న ధాన్యం కూడా తడిసిపో యి ఉపయోగించలేని స్థితికి చేరింది. కూరగాయ ల సాగు చేస్తున్న చిన్న రైతులు మరింత కష్టాల్లో పడిపోయారు. చింత చెట్లు, మామిడి తోటలు, బత్తా యి తోట లు కూలి పోవడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యా రు. ఒక పక్క వడ్డీ భారం, మరొక పక్క పంట నష్టం, ఈ రెండింటి మధ్య చిక్కుకుపోయిన రైతు లు తమ భవిష్యత్తు గురించి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పరిస్థితి పెద్దగా భిన్నంగా లేదు. గోదావరి పరివాహక ప్రాంతం, తూర్పు గోదావరి, విశాఖ, విజయనగరం జిల్లా ల్లో పంట నష్టం తీవ్రంగా ఉంది. మత్స్యకారు లు సముద్రంలోకి వెళ్లలేక ఆర్థికంగా నష్టపోయా రు. తీర ప్రాంత గ్రామాల్లో చెరువులు పొంగిపొర్లి ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలించబడ్డారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వా లు తక్షణమే నష్టపరిహారం చెల్లించే చర్యలు తీసుకోవాలి. కేవలం పర్యటనలు, సమావేశాలు, ప్రకటనలతో పరిమితం కాకుండా గ్రామ స్థాయి పం చాయతీ స్థాయిలో పంటల అంచనా నివేదికలు సిద్ధం చేసి రైతుల చేతికి నిజమైన సాయం అందించాలి. ఇది కేవలం ప్రకృతి వైపరీత్యం మాత్రమే కా దు, పరిపాలనా స్పందనకు పరీక్ష కూడా. తుఫానులు, భారీ వర్షాలు ప్రతి సంవత్సరం ఎదురవుతున్నా ముందస్తు చర్యలు ఎందుకు ఫలించట్లేదు అనేది ప్రభుత్వాలు ఆలోచించాల్సిన అంశం. వాతావరణ మార్పుల ప్రభావంతో ఈ తరహా ఘ టనలు మరింత పెరుగుతున్నాయి. రైతుల భవిష్య త్తు కాపాడాలంటే విపత్తు నిర్వహణ వ్యవస్థను శాస్త్రీయంగా బలపరచాలి. పంట బీమా పథకాలు నిజంగా రైతుకు మేలు చేసే విధంగా ఉండాలి. బీమా కంపెనీలు లాభాల కోసం కాకుండా నష్టపోయిన రైతుల పక్షాన నిలబడాలి. ప్రభుత్వాలు ఈ విషయమై కఠినంగా వ్యవహరించి సమయానుసారంగా పరిహారం చెల్లించేలా చూడాలి. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ విపత్తును జాతీయ ప్రాధాన్యతతో పరిగణించాలి. నిధుల విడుదలలో ఆలస్యం కాకూడదు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలసి నష్టాల నివేదికను కేంద్రానికి సమర్పించి ప్రత్యేక ఆర్థిక సహాయం పొందే దిశగా కృషి చేయాలి. రైతులు ఈ కష్టసమయంలో తమ పక్కన ప్రభుత్వం ఉందన్న నమ్మకం కలిగించాలి. ఒకప్పుడు పంట పండించిన రైతు నేడు రుణబాధలో ఉక్కిరిబిక్కిరవుతున్నాడు. పంట నష్టంతో పాటు పశుసంవర్ధక రంగం కూడా నష్టపోయింది. పశువులకు ఆ

లేఖ



హారం కొరత, ఆశ్రయం సమస్య తలెత్తింది. ఈ అంశాలను కూడా నష్టపరిహార ప్యాకేజీలో పరిగణలోకి తీసుకోవాలి. ప్రకృతి విపత్తులు తప్పించలేనివి అయినా వాటి ప్రభావాన్ని తగ్గించడం మన చేతిలో ఉంది. రైతుల ఆర్థిక భద్రత కోసం తక్షణమే ప్రత్యేక ప్యాకే జీ ప్రకటించి నష్టపరిహారం చెల్లించాలి. మట్టి పరీక్షలు చేసి తదుపరి పంటలకు తగిన సూచనలు ఇవ్వాలి. రైతు బంధు, రైతు బీమా పథకాల కింద ఉన్న నిబంధనలను సడలించి వారికి సహాయం చేయాలి. ఈ విపత్తు మనకు పాఠంగా మారాలి. రైతు మన దేశానికి అండగా ఉన్నాడు, అతని చెమట చుక్కే మన ఆహార భద్రతకు మూలం. అలాంటి రైతు విపత్తుల్లో ఒంటరిగా మిగలకూడదు. తుఫాన్ వెళ్లిపోయినా దాని మచ్చలు ఇంకా పొలాల్లో, రైతు గుండెల్లో మిగిలిపోయాయి. మానవతా దృ క్పథంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వ చ్చి రైతుల పక్కన నిలబడితేనే ఈ కష్టకాలం నుంచి వారు బయటపడగలరు. ప్రకృతి మన నియంత్రణలో లేకపోయినా, మన సహాయం మాత్రం మన చేతుల్లో ఉంది. దానిని సమయానికి అందించడం ప్రభుత్వాల నిజమైన బాధ్యత.

– ఆదిరెడ్డి

## పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్



**ప్రజాపక్షం/నిజాంసాగర్:**నిజాంసాగర్ మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం విద్యార్థులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో భాగంగా నిజాంసాగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఆ పోలీస్‌స్టేషన్‌లో గదులు, సెల్, ఉపయోగిస్తున్న తుపాకులు, పిస్టోల్ తదితర ఆయుధాలను గురించి పోలీసులు వివరించడమే కాకుండా బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ‘రన్ ఫర్ యూనిటీ’




**ప్రజాపక్షం/మందమర్రి:**భారతదేశ ఐక్యతకు ప్రతీక, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ‘జాతీయ ఏక్తా దివస్’ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు మందమర్రి పోలీస్ శాఖ సిద్ధమైంది. జాతీయ సమైక్యతా భావాన్ని చాటిచెప్పేందుకు ‘రన్ ఫర్ యూనిటీ’ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనుంది. శుక్రవారం ఉదయం 11 గంటలకు సింగరేణి గ్రౌండ్ నుంచి 2 కిలోమీటర్ల రన్ ప్రారంభమై, ఓల్డ్ బస్టాండ్ వద్ద ముగియనుంది. పట్టణ ప్రజలందరూ, యువతీ యువకులు, పెద్దలు అనే తేడా లేకుండా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మందమర్రి పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## పంట నష్టంతో రైతుల ఆందోళన

### నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్:**అడవి పందుల వల్ల పత్తి పంటలు నష్టపోవడంతో నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాగజ్‌నగర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసు వద్ద రైతులు ధర్నాకు దిగారు. ఈ ధర్నాకు బిఆర్‌ఎస్ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లేండుగురే శ్యాం రావు మద్దతు ప్రకటించి రైతుల పక్షాన మాట్లాడారు. కాగజ్‌నగర్ పరిసర గ్రామాలైన కోసిని, రేగులగూడ, కూసుగూడ, దరిగాం, వేంపల్లి తదితర గ్రామాల రైతులు ఎక్కువగా చిన్న సన్నకారు రైతులేనని, వారికి పంటే జీవనాధారమని తెలిపారు. గత వారం రోజులుగా వందల ఎకరాల్లో అడవి పందులు చొరబడి పత్తి పంటలను నాశనం చేస్తున్నాయని, ఇప్పటికే వర్షాల వల్ల దెబ్బతిన్న రైతులు ఇప్పుడు పందుల బారిన పడి పూర్తిగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, అటవీ అధికారులు నష్టపోయిన పంటలను సర్వే చేసి తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల ఆవేదన విన్న ఎఫ్‌డిఒ స్పందించి, రెండు రోజులలోనే అటవీ బృందాలను పంపి పంట నష్టాన్ని సర్వే చేయించి తగిన పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అడవి పందులు చొరబడకుండా ఉండేందుకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. ఈ హామీలతో దాదాపు 10 గ్రామాల రైతులు ధర్నాను విరమించారు.

## అమరవీరుల త్యాగాలు మరువలేనివి



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ ;**విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్‌పి కాంతి లాల్ పాటిల్ అన్నారు. గురువారం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా కాగజ్ నగర్ పట్టణంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల రక్షణ కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని, ప్రజల సహకారంతోనే శాంతి భద్రతల పరిరక్షణ సాధ్యం అవుతుందని తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ పట్టణ పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమై హనుమాన్ మందిర్, రాజీవ్ చౌక్, మార్కెట్ ఏరియా, అంబేద్కర్ చౌరస్తా వరకు సాగింది. తిరిగి అంబేద్కర్ చౌరస్తా నుండి రాజీవ్ చౌరస్తా మీదుగా లారీ చౌరస్థా వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డిఎస్ పి వహీదుద్దీన్, టౌన్ ఇన్స్పెక్టర్ కె. ప్రేమ్ కుమార్, సబ్ డివిజన్ సిఐలు, ఎస్‌ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం



**ప్రజాపక్షం/మందమర్రి:**సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, అవగాహన పెంపొందించుకోవాలని మందమర్రి ఏరియా సేఫ్టీ ఆఫీసర్ భూ శంకరయ్య, డివైజిఎం (ఐటి) కార్పొరేట్ ఎం. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మినిస్ట్రీ ఆఫ్ కోల్ ఆదేశాల మేరకు అక్టోబర్ నెలను నేషనల్ సైబర్ సెక్యూరిటీ అవగాహన నెలగా ప్రకటించారని, దాని భాగంగా సింగరేణి ఉద్యోగులలో సైబర్ భద్రతపై చైతన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. గురువారం మందమర్రి జివిటిసి సమావేశ మందిరంలో నిర్వహించిన సైబర్ నేరాల అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నందున ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వ్యక్తిగత సమాచారం ఎవరికీ పంచకూడదని వారు హెచ్చరించారు. ఇ మెయిల్ సేఫ్టీ, మొబైల్ సేఫ్టీ, డిజిటల్ అరెస్ట్ వంటి అంశాలపై విస్తృతంగా వివరణ ఇచ్చారు. డిఎస్ నానా పర్నవేస్ (డివై సిఐఎస్ఓ–సింగరేణి), జివిటిసి మేనేజర్ శంకర్, డివై మేనేజర్ (ఐటి) రవి, ట్రైనింగ్ అధికారి అశోక్ తదితర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుదారులకు నాన్ ఓవెన్ సంచి పంపిణీ

**ప్రజాపక్షం/నస్పూర్:**నిరుపేద, అర్హులైన రేషన్ కార్డుదారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తుందని, నవంబర్ 1వ తేదీ నుండి చౌక ధరల దుకాణాలలో రేషన్ కార్డుదారులకు నాన్ ఓవెన్ సంచి అందించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా రేషన్ సన్న బియ్యం కొరకు ఒక వేలిముద్ర, నాన్ ఓవెన్ సంచి కొరకు ఒక వేలిముద్ర ఇవ్వవలసి ఉంటుందని తెలిపారు. ఏ చౌక ధరల దుకాణంలో రేషన్ కార్డు కలిగి ఉన్నారో అక్కడ మాత్రమే వేలిముద్రతో నాన్ ఓవెన్ సంచి ఇవ్వబడుతుందని, పోర్టబిలిటీ విదానం ద్వారా ఇతర షాపులలో రేషన్ బియ్యం పొందే వారికి నాన్ ఓవెన్ సంచి ఇవ్వబడదని, రేషన్ కార్డుదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

## సింగూరు ప్రాజెక్టుల్లోకి ప్రవాహం

**ప్రజాపక్షం/సంగారెడ్డి:**సింగూరు ప్రాజెక్టులోకి గత రెండు రోజులుగ ప్రవాహం వచ్చి చేరుతుంది. మొంథా తుఫాను ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురిసాయి. దీంతో సింగూరు ప్రాజెక్టులకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. అధికారులు అప్రమత్తమై గురువారం 12,15 నెంబర్ల గేట్లను 1.50 మీటర్ల పైకి ఎత్తి 14,269 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టులోకి 21,935 క్యూసెక్కులను జెన్ కో ద్వార 2395 క్యూసెక్కులు హైదరాబాదు వాటరు బోర్డుకు 80 క్యూసెక్కులను మిషన్ భగీరథ్‌కు 70 క్యూసెక్కుల ,ఆవిరి రూపంలో 390 క్యూసెక్కులను మొత్తం 26,313 క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నట్లు ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 17,133 టిఎంసిల నీరు నిల్వ ఉంది. వర్షాల కారణంగా నీటి ప్రవాహం పెరుగుతున్నందున మంజీర నది పరివాహక ప్రాంతం రైతులు, పశువుల కాపరులు , అప్రమత్తంగా ఉండాలని చేపల వేటకువెళ్లేమత్స్యకారులునదిలోకివెళ్లవద్దనిప్రాజెక్టుఅధికారులుసూచించారు.

# నాణ్యమైన పత్తికి మద్దతు ధర



### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ :**నాణ్యమైన పత్తి పంటకు రైతులందరికీ మద్దతు ధర లభిస్తుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.గురువారం నిర్మల్ శాసనసభ్యుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో కలిసి,పట్టణంలోని కేదార్నాథ్ జిన్నిం గ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని రిబ్బను కత్తిరించి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ,పత్తి పంట కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు.రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని వివరించారు.పత్తి రైతులందరికీ ప్రభుత్వం నిర్ణయించిన ప్రకా రం మద్దతు ధర అందివ్వాలని అన్నారు.రైతులు పండించిన పంటను మొత్తం సిసిఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారానే సేకరించాలని అన్నారు.ఆ విధం గా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు.రైతులు పంట ను అమ్మిన వెంటనే వారి ఖాతాల్లోకి డబ్బులు జమ అ య్యే విధంగా చర్యలు తీసుకోవాలని వివరించారు.రైతులకు ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లను చేయాలని సూచించారు.పత్తి పంటను అమ్మేందుకు వచ్చిన రై తుతో మాట్లాడుతూ,సాగు చేసిన విస్తీర్ణం,పంట పెట్టుబ డి,దిగుబడి,తదితరాంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పత్తి పంటకు క్వింటాకు 8వేల 110 రూపాయల మద్దతు ధర అందిస్తుందని అన్నారు.పత్తి రైతులు తాము పండించిన పంటను ప్రభుత్వం నిర్ణయించిన తే మశాతం ప్రకారం అమ్మి,మద్దతు ధరను పొందాలని పే ర్కొన్నారు.రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా పంట అ మ్మకానికిసంబంధించిస్లాట్‌బుక్‌చేసుకోవాలని చెప్పారు.

**పత్తి పంట అమ్మకంలో రైతులకు ఇబ్బందులు కలగకూడదు:ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

పత్తి పంట అమ్మకంలో రైతులకు ఇబ్బందులు కలగకూడదని నిర్మల్ శాసనసభ్యుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.రైతులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరను అందించాలని పేర్కొన్నారు.తేమ నిర్ధారణ పారదర్శకంగా జరగాలని చెప్పారు.రైతులకు తమ పంటను అమ్మేందుకుగాను కపాస్ కిసాన్ యాప్ స్లాట్ బుకింగ్ గురించి అవగాహన కల్పిస్తు ఉండాలని చెప్పారు.పత్తి పంట కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.ఎప్పటికప్పుడు సమయానికి పత్తి పంట కొనుగోలును పూర్తి చేస్తూ ఉండాలని సూచించారు.తేమ శాతం లేని పంటను తీసుకువస్తే రైతులు మద్దతు ధర పొ ందవచ్చునని తెలిపారు.పత్తి పంట కొనుగోలు విధానా న్ని కలెక్టర్,ఎమ్మెల్యే పరిశీలించారు.అంతకుముందు ప త్తి పంట కొనుగోలు ప్రారంభోత్సవానికి వచ్చిన కలెక్టర్,ఎమ్మెల్యేలకు జిన్నింగ్ మిల్లు నిర్వాహకులు పూలమొ క్కలు అందజేసి స్వాగతం పలికారు.శాలువాతో సన్మాని ంచారు. అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్ కుమార్,వ్యవసాయ మార్కెట్ కమిటీ చై ర్మన్ సోమ భీమ్ రెడ్డి,వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్,జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్,వ్యవసాయ శాఖ అధికారిఅంజిప్రసాద్,ఇతరఅధికారులు,సిబ్బంది,రైతులు,పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/ఎడపల్లి:**ఎడపల్లి మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో ఉన్న మూడవ నంబర్ అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ తీరుపై జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి రసూల్ బి. రాష్ట్ర మహి ళా కమీషన్ సభ్యురాలు సూదం లక్ష్మి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం ఈ కేంద్రాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేసి, దయనీయమైన ప రిస్థితులను గమనించి మండిపడ్డారు. తనిఖీ సమయంలో, అంగన్‌వాడీ కేంద్రంలో మొత్తం 9మంది పిల్లలకు హాజరు వేసి ఉన్నప్పటికీ, కేవలం ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండటాన్ని అధికారులు గుర్తించారు. దీనిపై టీచర్ రాజేశ్వరిని వారు నిలదీశారు. అంతేగాకుండా అంగన్‌వాడీ గదిలో పూర్తిగా దుర్గంధం వ్యాపించి ఉండటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. దినసరి వ్రాసే రిజిష్టర్ సక్రమంగా లేకపోవడం, రికార్డులన్నీ తప్పులు తడకగా ఉండటంతో అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పది రోజుల్లో పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే విధుల నుంచి తొలగిస్తాం అని రసూల్ బీ, సూదం లక్ష్మి టీచర్‌ను హెచ్చరించారు. ఈ కేంద్రంలో గతంలో సరుకులు తరలిస్తుండగా పట్టుబడటంతో ఆయమ్మను విధుల నుంచి తొలగించారు. అయినప్పటికీ కేంద్రం పరిస్థితిలో ఎలాంటి మార్పు రాకపోవడం పట్ల వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలను పరిశుభ్ర వాతావరణంలో ఉంచాల్సి ఉండగా, అంగన్‌వాడీ కేంద్రం దానికి విరుద్ధంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటికే పలుమార్లు పద్ధతి మార్చుకోవాలని చెప్పిన మార్పు రాకపోవడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోయి చర్యలు చేపడతామని వారు తెలిపారు.

## కొనుగోలు కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం

### రెంజల్ మండల వ్యవసాయాధికారికి షోకాజ్ నోటీసు జారీ



**ప్రజాపక్షం/ఎడపల్లి:**ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యంపై కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల అలసత్వం వహించడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ రెంజల్ మండల వ్యవసాయాధికారికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నవీపేట్ మండలం అభంగపట్నం, తడ్‌గాం, రెంజల్ మండలం వీరన్నగుట్ట గ్రామాలలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వీరన్నగుట్ట కొనుగోలు కేంద్రం నిర్వహణలో లోటుపాట్లు నెలకొని ఉండటాన్ని కలెక్టర్ గమనించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిర్దేశిత రైస్‌మిల్లులకు కాకుండా వేరే మిల్లుకు తరలించడాన్ని కలెక్టర్ తప్పు పట్టారు. ట్రక్ షీట్లు సకాలంలో తెప్పించుకుని వెంటవెంటనే ట్యాబ్ ఎంట్రీలు చేయించడంలోనూ జాప్యం చేస్తున్నారని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించని రెంజల్ మండలవ్యవసాయాధికారికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని కలెక్టర్ సంబంధిత జిల్లా వ్యవసాయాధికారిని ఆదేశించారు. రైతుల ప్రయోజనాలతో ముడిపడిన అంశాలలో విధుల పట్ల నిర్లక్ష్యాన్ని ఎంత మాత్రం ఉపేక్షించబోమని స్పష్టంచేశారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో వారి ఖాతాలలో బిల్లుల చెల్లింపులు జరిగేలా కృషి చేయాలని కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు.మాయిశ్చర్ మీటర్ ద్వారా కలెక్టర్ స్వయంగా తేమ శాతం పరిశీలించారు. 17 శాతానికి లోబడి తేమ శాతం ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకంజరిపించి మిల్లులకు తరలించాలని సూచించారు. వర్షాలతో ధాన్యం తడవకుండా టార్పాలిన్లను అందుబాటులోఉంచాలని, ధాన్యాన్ని ఎత్తైన ఖాళీ ప్రదేశాలలో ఆరబెట్టుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ, నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులున్నారు.

## వర్ష బీభత్సం.. పంట నష్టంపై సర్వే



**ప్రజాపక్షం/మందమర్రి:**గత నాలుగు ఐదు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో వరి, పత్తి పంటలు నేలకొరిగాయి. ఈ పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ గురువారం సారంగపల్లి గ్రామ శివారులో పంటచేలను సందర్శించారు. రైతులు ముందుగా పొలాల్లో నిల్వ నీటిని తొలగించాల్సిందిగా ఆమె సూచించారు. వరి మొక్కలను నిటారుగా లేపి కుచ్చులుగా కట్టుకోవడం ద్వారా గాలి ప్రసరణ బాగా జరిగి, బ్యాక్టీరియా శిలీంధ్ర జాతి తెగుళ్లను నివారించవచ్చని ఆమె తెలిపారు. పంట నష్టం స్థితిపై ప్రభుత్వం దృష్టికి నివేదిక అందజేస్తామని, రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయి సర్వే నిర్వహిస్తామని సురేఖ చెప్పారు. అదేవిధంగా పత్తి అమ్మకాలకు సంబంధించి రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బు కింగ్ చేసుకోవాలని ఆమె సూచించారు. కేవలం స్లాట్ బుకింగ్ పొందిన రైతుల వాహనాలకే సిసిఐ కేంద్రాల్లో ప్రవేశం ఉంటుందని తెలిపారు. ఒటిపి సమస్యలు ఎదురైన రైతులు వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా మొబైల్ నంబర్ మార్పు చేసుకొని సులభంగా బుకింగ్ చేసుకోవచ్చని ఆమె తెలిపారు. వరి కోతల విషయమై ఆమె రైతులకు సూచిస్తూ పంట పూర్తిగా ఆరిన తర్వాతే కోతలు చేపట్టాలని, ధాన్యంలో తేమశాతం 14 నుండి 17శాతం మధ్య ఉండేలా చూసుకోవాలని, హార్వెస్టర్ పంక్ ఆర్‌పిఎం 18 నుండి 20 మధ్య ఉంచాలని, బ్లోయర్ ఎల్లప్పుడూ ఆన్‌లో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.కిరణ్మయి, వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి, రైతులు పెద్దపెల్లి వెంకటేశం, నసీరుద్దీన్, శ్రీనివాస్, మహిపాల్ రెడ్డిపాల్గొన్నారు.

## అధికారులతో ఎమ్మెల్యే చర్చలు



**ప్రజాపక్షం/నిజాంసాగర్:**జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు గురువారం కామారెడ్డి జిల్లా అధికార యంత్రాంగంతో సుదీర్ఘ చర్చలో పాల్గొన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, అన్ని శాఖల అధికారులు ఈ చర్చలో పాల్గొనగా జుక్కల్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ పనులు, సమస్యలు, పేదలకు అందుతున్న ప్రభుత్వ పథకాలను గురించి చర్చించారు. పనులు వేగవంతం చేయాలని, అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో విద్యా, వైద్య వ్యవస్థను మెరుగుపర్చాలని, దానికి అనుగుణంగా భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

## ఇందిరమ్మ ఇండ్లను సందర్శించిన ఎంపిడిఒ



**ప్రజాపక్షం/నిజాంపేట్ :**నిజాంపేట మండలం పరిధిలోని నార్లపూర్ గ్రామంలో గురువారం రోజున ఎంపిడిఒ రాజిరెడ్డి ఇందిరమ్మ ఇండ్లతోపాటు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏ రకం ధాన్యానికి 2869 రూపాయలు,బీ రకం ధాన్యానికి 2369 రూపాయలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. అలాగే నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రైతులు, పాల్గొన్నారు.

## రైతాంగాన్ని తీవ్రంగా నష్టపరిచిన ప్రకృతి విపత్తు



**ప్రజాపక్షం/బైంసా :**ఈ సారి భారీ వర్షాలు కురవడం తో ముథోల్ నియోజకవర్గ రైతంగాం తీవ్ర స్థాయి లో నష్టపోయిందని రైతులను ఆదు కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ డిమాండ్ చేశారు.ప్రస్తుతం తుఫాన్ ప్రభావం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు..నది వాగు పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏదైనా సమస్య వస్తే అధికారులకు తెలియజేయాలన్నారు.ప్రస్తుతం పంటలను కాపాడుకోవడానికి రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని,తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు.

## సోయా, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :**నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎఎంసి మార్కెట్ యార్డ్‌లో ఎఫ్‌ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేం ద్రాన్ని,అలాగే సారంగాపూర్ మండలంలోని ఆలూర్,బోరెగావ్ గ్రామాలలో డిఆర్‌డిఎఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్లకొనుగోలు కేంద్రాలను లా ంఛనంగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రరంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సోయాకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.5328 లు,వడ్లకు రూ.2389 లు ఉందని,కాబట్టి రైతులు బయట మార్కెట్‌లో దళారులను నమ్మి తక్కువ ధరకు అమ్మి మోసపోకుండా,ప్రభుత్వ కొనుగోలు కే ంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అకాల భారీ వర్షాల కారణంగా కల్లాల్లో ధాన్యం తడిసిపోయి రైతులు తీవ్ర ఆందోళన చెందుతు న్న ప్రస్తుత క్లిష్ట సమయంలో,ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.అంతేకాక,నిజామాబాద్,జిల్లా డిచ్‌పల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన అనంతరం,రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి తేమ, తరుగు లేకుండా ప్రతి గింజను కొనుగోలు చేయాలని తడిసిన ధాన్యాన్ని కొని,ప్రభుత్వం ఇస్తానన్న బోనస్‌ను కూడా తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.ముఖ్యంగా ధాన్యం ఆరబెట్టుకోవడానికి,నిల్వ చేసుకోవడానికి తగిన మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని,అందుకే అకాల వర్షాలకు పంటలు తడిసి నష్టపోతున్నారని ఆయన విమర్శించారు. కొనుగోలు కేంద్రాలలో వేగవంతమైన ప్రక్రియను అమలు చేయాలని ,తద్వారా ధాన్యం కొనుగోలులో జాప్యం జరగకుండా చూడాలని ఆయన అధికారులను కోరారు.ఈ కార్యక్రమాలలో పాల్గొన్న జిల్లా జాయింట్ కలెక్టర్ కిషోర్ కుమార్,రైతులు కొనుగోలు కేంద్రాల ద్వారానే తమ ఉత్పత్తులను విక్రయించి,మద్దతు ధర పొందాలని విజ్ఞప్తి చేశారు.మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి,నాయకులు ముత్యం రెడ్డి,మేసిసెమ్మ రాజు,జిల్లా ఉపాధ్యక్షుడు సత్యం చంద్రకాంత్,పట్టణ/మండల అధ్యక్షులు,ఇతర సీనియర్ నాయకులు,మార్కెట్ కమిటీ చైర్మన్,ఎఫ్‌ఎస్‌సీఎఫ్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి రైతుల పక్షాన నిలబడి పోరాడతామని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

## ఉక్కు సంకల్పంతో నిర్మల్ మహిళా పోలీస్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**నిర్మల్ ఎస్‌పిడా.జి.జానకి షర్మిల ఆదేశాల మేరకు అమలు జరుగుతున్న ‘‘నారిశక్తి’’ కార్యక్రమం ఈ వారం మరింత విజయవంతంగా కొనసాగింది.ఈ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా మహిళా పోలీస్ సిబ్బంది,తమ పెట్రోలింగ్ విధులతో పాటు,డయల్ 100 అత్యవసర కాల్స్‌కు మెరుపు వేగంతో స్పందించి పౌరులకు తక్షణన సహాయం అందించారు.పోలీస్ సిబ్బంది ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత కార్యక్రమాలను నిర్వహించారు.గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు ప్రస్తుతమున్న అత్యంత ముఖ్యమైన అంశమైన సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. విలేజ్ పోలీసింగ్లో భాగంగా,మహిళా సిబ్బంది ప్రతీ గ్రామంలో తిరుగుతూ కల్తీకల్లు,గంజాయి వాడ కం,అక్రమ రవాణా వంటి సామాజిక సమస్యలపై ప్రజలకు స్పష్టంగా వివరించారు.చివరగా,నారిశక్తి సిబ్బంది విస్తృతంగావాహన తనిఖీలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్త ంగా ఉన్న మహిళా సిబ్బంది,ఉత్సాహంగా పాల్గొని,పోలీసింగ్‌లో తమ సామర్థ్యాన్ని మరోసారి చాటారు.

## రైతును నిండా ముంచిన అకాల వర్షం



**ప్రజాపక్షం/ఖానాపూర్ :**ఆరుగాలలు కష్టపడి పండించిన పంట చేతి కొచ్చే సమయానికి రైతుకు కష్టాలు తప్పడం లేదు.పట్టణంలో బుధవారం కురిసిన వర్షానికి తడిసిన ధాన్యంతో చూసి బాధ పడిన రైతులు,మొంతా తూఫాన్ ప్రభావంతో రాత్రి కురిసిన భారీ వర్షానికి మార్కెట్ యాడ్ కి తీసుకువచ్చిన వడ్లు పూర్తిగా నీటిపాలు అయ్యాయి.ఆరు గాలలు పండించిన పంటకు కోతులుతో,అడవి పందులతో,సకాలంలో అందని యూరియాతో కష్టలు పడి వరి కోతలు కోసి ముందుగా మార్కెట్కు తీసుకొచ్చి అమ్ముకుందామంటే తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షానికి మార్కెట్ యార్డు ప్లాట్ ఫామ్ సరిగా లేక పోసిన వడ్లు కొట్టుకపోతున్నాయని.సరైన సౌకర్యాలు లేక పాలిథిన్ కవర్లు అడ్డ కుప్పలపై కప్పు దామన్న ఏ అధికారి తమ గోడును వినేలా కనబడడం లేదని ఒకపక్క ప్లాట్ఫామ్ ఉంటే మరో పక్క మట్టితో ఉందని ఆ మట్టిలోనే ధాన్యం కుప్పలు పోయడంతో మట్టి పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇకనైనా మార్కెట్ యార్డ్ లో సరైన సౌకర్యాల కల్పించి రైతులకు మేలు చేయాలని లేద ంటే రైతులకు పూర్తిగా నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు.

## నేల వాలిన వరి పంట

ప్రజాపక్షం /మల్లాపూర్ : కష్టపడి పండించిన పంట చేతికందే సమయానికి అకాల వర్షాలు కురిసి అన్నదాతలను ఆగమాగం చేస్తున్నాయి. ఒక పక్క చేతికొచ్చిన మొక్కజొన్న పంట మార్కెట్ యార్డుల్లోనే కుప్పలు తెప్పలుగా ఉండడంతో అకాల వర్షాలు కురుస్తున్నందున తడిసి ముద్ద అవుతుండడంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఇవన్నీ ఒకే అయితే మరోపక్క వరి పంట కోతకు రావడంతో భారీగా వర్షాలు పడుతుండడంతో చేతికొచ్చిన వరి పంట నేల వాలడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉండిపోయారు. ప్రకృతి కన్నెర్ర చేయడంతో పంటలు నష్టపోయి ఆర్థికంగా దెబ్బతింటున్నామని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

### వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి సృజన్‌కుమార్

ప్రజాపక్షం/కరీంనగర్: మొంథా తుఫాన్‌తో కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టం చేసి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో మొంథా తుఫాన్‌తో వరి ధాన్యం, పత్తి పంట నేల మట్టం అయ్యిందని, కల్లాల్లో పట్టి తడిసాయని, పత్తి నీటితో తడిసి ముద్దయ్యి రైతులకు కన్నీరే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో పంట నష్టంపై అంచనా వేసి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, తడిసిన ధాన్యాన్ని, పత్తిని ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే పండించిన పంటలకు చేసిన అప్పులు కట్టలేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఉన్నాయన్నారు.

## భోజనాల్లో మెనూ తప్పనిసరి

ప్రజాపక్షం/మల్లాపూర్ : విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు సకలంలో మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని జిల్లా విద్యాధికారి రాము ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయుల విద్యాబోధనపై అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. రాఘవపేటలోని భవిత కేంద్రాన్ని సైతం సందర్శించారు. విద్యాధికారి దామోదర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.



## మళ్లీ హైవే పనులు అడ్డుకున్న రైతులు

ప్రజాపక్షం/ముత్తారం :మరో మారు నేషనల్ హైవే రోడ్డు పనులను రైతులు అడ్డుకున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి పనులను గురువారం కొంతమంది రైతులు అడ్డుకొన్నారు. పరిహారం చెల్లించకుండా పనులు ప్రారంభించవద్దని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎస్సై రవికుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.




## మానేరు వైపు వెళ్లొద్దు

ప్రజాపక్షం/ముత్తారం : మానేరు పరివాహా గ్రామాల ప్రజలు మానేరు వైపు వెళ్ళరు వెళ్ళవద్దని ఎంపిడిఓ సురేష్ తెలిపారు. కరీంనగర్ మానేరు డ్యామ్ 14 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడం జరుగుతుందని మానేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున మానేరు వైపు ఎవరు కూడా వెళ్ళవద్దన్నారు.గురువారం ముత్తారం మండలంలోని ఓడేడు మానేరు వాగును స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేందర్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మానేరు వాగు కి సుమారు 100 మీటర్ల దూరంలో అటువైపు ప్రజలు ఎవరు వెళ్ళకుండా దారికి అడ్డంగా తాళ్ళను కట్టారు.గ్రామస్తులు పశువులను గాని,చేపల వేటకు గాని పంట పొలాల వద్దకు గాని మానేరు వైపు వెళ్ళవద్దని సూచించారు.



## క్వారీ లీజు రెన్యువల్‌కు అనుమతి ఉండాలి

ప్రజాపక్షం/జగిత్యాలటౌన్: జగిత్యాల జిల్లాలో మైనింగ్, క్వారీ లీజు రెనువ్యల్, నూతన క్వారీల మంజూర్ కోసం రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ అధ్యాయన సంస్థ జారీచేసిన పర్యావరణ అనుమతి తప్పనిసరని కలెక్టర్ బి.సత్యప్రసాద్ గురువారం తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ అనుమతికి అత్యంత అవశ్యకమైన జిల్లా సర్వేనివేదికను పర్యావరణం, అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జిల్లా సర్వే నివేదికను రూపొందించినట్లు తెలిపారు. ఈ డ్రాఫ్ట్ జిల్లా సర్వే నివేదికను ప్రజా అభిప్రాయం కోసం జిల్లా వెబ్‌సైట్ లో పొందుపరచినట్లు పేర్కొన్నారు. డ్రాఫ్ట్ జిల్లా సర్వే నివేదకపై అభిప్రాయాలను జిల్లా మైనింగ్ కార్యాలయంనకు 21రోజుల లోపు పంపగలరని కలెక్టర్ తెలిపారు.

## ధర్మపురి పట్టణంలో తనిఖీలు

ప్రజాపక్షం/ధర్మపురి : జగిత్యాల జిల్లాలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడం కోసం, మత్తు పదార్థాల నిర్మూలన లక్ష్యంగాజిల్లాఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. దీనిలో భాగంగా ధర్మపురి పట్టణంలో గురువారం సీఐ ఎలపాటి రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీమ్ తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ధర్మపురి సిఐ రామ్ నరసింహారెడ్డి మాట్లాడుతూ పాన్ షాప్ లలో గంజాయి పదార్థాలను గుర్తించే జగిలాలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని చెప్పారు.ఎస్ఐలు ఉదయ్ కుమార్, రవీందర్, డాగ్‌స్క్వాడ్,బాంబ్‌డిస్పోజల్‌టీమ్,సిబ్బందిపాల్గొన్నారు.



## అర్బన్ బ్యాంకును ప్రక్షాళన చేస్తాం

### కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు

ప్రజాపక్షం/కరీంనగర్: గత పాలకవర్గాలహయాంలో అర్బన్ బ్యాంకు అధ్వానస్థితికి చేరుకుందని, అస్తవ్యస్తంగా మార్చారని, బ్యాంకును సమూలంగా ప్రక్షాళన చేస్తామని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్‌నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు స్పష్టం చేశారు. నీతి నిజాయితీతో ముందుకు వచ్చిన తమ ప్యానెల్ అభ్యర్థులకు అర్బన్ బ్యాంకు మెంబర్లు మార్పు కోసం ఆశీర్వదించాలని, మంచి మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో వెలిచాల రాజేందర్‌రావు అర్బన్ బ్యాంకు ప్యానెల్ అభ్యర్థులతో కలిసి ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ఈ మేరకు మేనిఫెస్టోను ప్రకటించారు. గత పది సంవత్సరాల కాలం నుంచి అర్బన్ బ్యాంకు అద్వానస్థితికి చేరుకుంది. దీనికి గత పాలకవర్గాలే ప్రధాన కారణమని పేర్కొన్నారు. బ్యాంకు పాలకవర్గాలు బ్యంకు అభివృద్ధి కోసం దోహదపడాలని కానీ సొంతలాభం కోసం చూసుకుని బ్యాంకును ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. 8 సంవత్సరాలుగా ఎన్నికలు జరగకుండా కోర్టులో కేసులు వేసి అడ్డుకున్నారని, తిరిగి వారే తమకు అధికారం కావాలని ఓట్లు అడుగుతున్నారన్నారు. బ్యాంకును ఆధునీకరించేందుకు తమ ప్యానెల్‌ను గెలిపించాలని కోరారు. నిర్మల భరోసా ప్యానెల్‌ను గెలిపించాల్సిన అవసరముందన్నారు. కరీంనగర్‌లోని 20సంఘాలు తమ ప్యానెల్‌కు మద్దతు తెలపడం అభినందనీయమన్నారు.అర్బన్ బ్యాంకు ప్యానెల్ అభ్యర్థులు మూల వెంకట రవీందర్‌రెడ్డి,ఇ.లక్ష్మణ్‌రాజు, అనురాసుకుమార్, వజీర్ అహ్మద్, ఉయ్యాల ఆనందం, చిందం శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, మన్నె అనంతరాజు, మునిపల్లి ఫణిత, దామెర శ్రీలతరెడ్డి, నాయకులు మల్లిఖార్జున రాజేందర్, ఆకుల నరసన్న, కోటగిరి భూమాగౌడ్, కొత్తపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంజాల స్వామి గౌడ్, అనంతుల రమేష్, బట్టు వరప్రసాద్ తదితరులున్నారు.



# నష్టపోయిన రైతుల వివరాలు నమోదు

### మంత్రి పొన్నం ప్రభాకర్

### శుక్రవారం ముఖ్యమంత్రి హుస్నాబాద్ ఏరియల్ సర్వే



ప్రజాపక్షం/హుస్నాబాద్: మోంథా తుఫాను నష్టం ను జాతీయ విపత్తుగా భావించి కేంద్రప్రభుత్వంఆదుకోవాలనిరవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు కేంద్రాన్ని కోరారు. బుధవారం కురిసిన భారీ వర్షానికి హుస్నాబాద్ పట్టణంలో వ్యవసాయ మార్కెట్‌లో రైతులు అరబోసిన వరిధాన్యం కుప్పలు తడిసి ముద్దయ్యాయి. మంత్రి హుస్నాబాద్ మార్కెట్ యార్డును పరిశీలించి రైతులను పలకరించారు. పొతారం గ్రామానికి చెందిన కెడిక తారవ్వ చెందిన 10 ట్రాక్టర్ల వరి ధాన్యం,లావూద్యా నీలు6ట్రాక్టర్లధాన్యం కొట్టుకుపోయింది. మంత్రి కాళ్లపై పడి భోరున విలపించింది. తారవ్వకు రూ.10వేలుఅర్థికసహయంఅందించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌మాట్లాడుతూ తుఫాన్ కారణంగా నియోజకవర్గంలో ఉహించనంతగా నష్టం జరిగిందని, వందలాది మెట్రిక్ టన్నుల ధాన్యం కొట్టుకుపోయిందని వేలాది టన్నుల ధాన్యం తడిసి పోయిందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో జరిగిన పంట నష్టంను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతామన్నారు. అక్కన్నపేట మండలంలో ముగ్గురు గల్లంతయినట్లు తెలిపారు. వారి కోసం అధికారులు గాలిం పు చేపట్టిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ హైమవతి, అర్‌డివో రామూర్తి, మార్కెట్ కమీటి చైర్మెన్ తిరుపతి రెడ్డి, సింగిల్ విండో చైర్మెన్ శివయ్య, , వైస్ చైర్మెన్ చందు, డైరెక్టర్లు బిక్కి, బాల్‌రాజు, నాయకులు పాల్గోన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు

### కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీ, డి.సి.పి కరుణాకర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ బి.వనజ లతో కలిసి రోడ్డు ప్రమాదాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం సుల్తానాబాద్, పెద్దపల్లి, బసంత్ నగర్, ఎన్.టి.పిసి, గోదావరిఖని 1 టౌన్ లో అధికంగా ప్రమాదాలు జరిగే 28 హాట్ స్పాట్ లను గుర్తించి 27 లక్షలతో ఎల్.ఈ.డి. హై మాస్ లైట్ లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.బసంత్ నగర్ లో మరో 2 చోట్ల 5 లక్షల రూపాయలతో హై మాస్ లైటింగ్‌ఏర్పాటుచేయాలని తెలిపారు. పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని పట్టణంలో 15 లక్షల ఖర్చుతో నూతన ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశామని అన్నారు.నియంత్రణ కోసం యూ టర్న్ ల పై సమీక్షించి నిర్ణయం తీసుకోవాలన్నారు.పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య, ఈఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్ ,పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ఏసీపీలు రమేష్ ,కృష్ణ, కలెక్టరేట్ పర్యవేక్షకులుబండి ప్రకాష్,ట్రాఫిక్ ఏసిపి, సిఐ, ఎస్ఐలున్నారు.

## హమాలీలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:ఐకెపి, కో ఆపరేటివ్ సొసైటీ సెంటర్స్ హమాలీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షునిగా మొగిలిపాలెం మలేశం, ప్రధా న కార్యదర్శిగా కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ ఎన్నికయ్యారు. గురువారం కరీంనగర్ నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జిల్లా ఐకెపి, కో ఆపరేటివ్ సొసైటీ సెంటర్స్ హమాలీ కార్మికుల సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశం నెల్లి రాజేశం అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు హాజరయ్యారు. నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.జిల్లాఅధ్యక్షులుగామొగిలిపాలెం మల్లేశం, ఉపాధ్యక్షులుగా గుర్తురి శ్రీనివాస్, పిట్టల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, కార్యదర్శులుగా గంగుల ఐలయ్య, నెల్లి రాజేశం, ప్రచార కార్యదర్శిగా జంగం లింగయ్య, కోశాధికారిగా కొప్పుల భాస్కర్‌లతో పాటు మరో ఆరుగురిని జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు బాలరాజు ప్రకటించారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ హమాలీల కూలీ రేట్లు పెరగడం లేదని, ఐకెపి కో ఆపరేటివ్ సొసైటీ సెంటర్స్‌లలో కార్మికులందరికీమౌలిక సదుపాయాలు కల్పించడం లేదని, తాగునీరు,మెడికల్ కిట్లు, టెంట్లు ఇతర సదుపాయాలు లేవని, ప్రతిహమాలీ కార్మికునికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్‌కల్పనకై పోరాడుతామని మల్లేశం,బుచ్చన్నయాదవ్ తెలిపారు.

## ఏడాది కష్టం ఏటి పాలైంది..

### కలెక్టర్ కె.హైమావతి కాళ్లు మొక్కి న్యాయం చేయాలని వేడుకున్న మహిళా రైతు



ప్రజాపక్షం / హుస్నాబాద్: హుస్నాబాద్‌లో బుధవారం కురిసిన భారీ వర్షం మూలంగా రైతులకు తీరని నష్టం జరిగిందని నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని, ఇక్కడ జరిగిన నష్టంను ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా కలెక్టర్ కె.హైమావతి తెలిపారు. మొంథా తుపాన్ ప్రభావంతో బుధవారం రోజంత కురిసిన వానకు హుస్నాబాద్ ప్రాం తంలో దాదాపు 30 సెంటిమీటర్లు వర్షం కురిసిందని, వర్షంతో హుస్నాబాద్ మార్కెట్ యార్డు లో వరిధాన్యం కొట్టుకు పోవడం, పూర్తిగా తడిసి ధాన్యంను సిద్దిపేట జిల్లా కలెక్టర్ గురువారం క్షేత్రస్థాయితో పరిశీలించారు. మార్కెట్ యార్డుకు 3 కిలో మీటర్లు పొతారం గ్రామం నుండి వరద మార్కట్ యార్డులోకి రావడడం బైటకు వెళ్లె మార్గం లేకపోవడంతో ప్రహరి గొడను కొంత తొలగించారు. నీరు బైటకు పోవడంతో దానితో మార్గం సుగమం అయిందని కలెక్టర్ తెలిపారు. గోదాంలో 15వందల దాన్యం కొట్టుకుపోయినట్టు ప్రాథమిక సమాచారం అందిందన్నారు.మార్కెటింగ్ అధికారుల తడిసిన, మొలకెత్తిన కొట్టుకు పోయిన ధాన్యం వివరాలను నమోదు చేయాలని అధికారులను అదేశించారు. పూర్తి వివరాలను ప్రభుత్వానికి వివరించి వారు ఇచ్చె సూచనల ప్రకారం ప్రక్రీయ చేపడతామని తెలిపారు. ప్రతి రైతు తమ ధాన్యంను ఆరబెట్టుకుని మార్కెట్‌కు తీసుకురావాలని రైతులను కోరారు. కలెక్టర్ వెంట అర్‌డివో రాంమూర్తి, మార్కెటింగ్ డి ఎం నాగరాజు. సింగిల్ విండో చైర్మెన్ శివయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గోన్నారు.

### భోరున విలపించిన మహిళా రైతులు

పొతారం గ్రామానికి చెందిన కెడిక తారకు చెందిన దాదాపు 10 ట్రిప్పుల వరి ధాన్యం వరదలో కొట్టుకుపోయింది.. మురికి కాలువలో ఉన్న ధాన్యం చూపించి ఆమె ఏడవడంతో కలెక్టర్ చలించిపోయారు. మహిళ రైతు కెడిక తార కన్నీటి పర్యాంతమయ్యారు.మరో మహిళరైతు లావూద్యనిలు తమ 6 ట్రాక్టర్ల వరి ధాన్యం నీటి పాలయిందని బోరున విలపించింది. ఆదుకుంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు.

## క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పరిహారం అందజేయాలి

### కలెక్టర్ పమేలా సత్పతి




ప్రజాపక్షం/కరీంనగర్: వర్షాల వల్ల కలిగిన పంట, ఆస్తినష్టం, తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా ఉన్నతాధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వర్షాల కారణంగా 8 పశువులు మరణించాయని, వీటి యజమానులకు వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. వర్షం కారణంగా పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్న ఇండ్లు ఏమైనా ఉంటే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వెంటనే పరిహారం అందజేయాలన్నారు. జిల్లాలో భారీ వర్షాల కారణంగా సుమారు 2036 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్లుగా సమాచారం ఉందని, రైతు వారీగా తడిసిన ధాన్యం వివరాలను సేకరించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు పంపించాలని సూచించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో పూర్తిస్థాయిలో టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం ఎట్టి పరిస్థితుల్లోనూ తడవకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. వర్షం తగ్గుముఖం పట్టిన వెంటనే పత్తి కొనుగోలు తిరిగి ప్రారంభించాలని ఆదేశించారు. వర్షాల పట్ల రెవెన్యూ, పోలీసు, పంచాయతీ కార్యదర్శులు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో నీరు పారుతున్న కల్వర్టులపై నుంచి వాహనాలు, మనుషులు వెళ్లకుండా చూడాలని తెలిపారు. చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తం కావాలని తెలిపారు. నగరంలో నీరు నిలిచిన చోట దోమలు వృద్ధి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలి

### ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : జిల్లాలో తుది దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసి, గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లోగురువారం హౌసింగ్, గ్రామీణ అభివృద్ధి శాఖ, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులతోసమీక్ష సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో మొత్తం 7918 ఇండ్లు మం జూరు చేయగా, 5361ఇండ్లకు ముగ్గు పోశారని, 2042 బేస్ మెంట్ లెవెల్, 1011 గోడల లెవెల్, 962స్లాబ్ లెవెల్ ఉండగా, 8ఇళ్లు పూర్తయ్యాయన్నారు. డిఆర్‌డిఒ శేషాద్రి, జడ్పీ డిప్యూటీ సీఈఓ గీత, హౌసింగ్ పీడీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయడానికి ముందుకు రావాలి

### జిల్లా ఎస్‌పి అశోక్‌కుమార్



ప్రజాపక్షం/జగిత్యాలటౌన్: యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణలో భాగంగా పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తు ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో మెగా రక్తదాన శిభిరాన్ని ఏర్పాటు చేశారు. బ్లడ్ డోనేషన్ క్యాంపుకు ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ హాజరుకాగా, డీఎస్పీ లు వెంకటరమణ, రఘు చందర్, వివిధ సర్కిల్ల సీఐలు, ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బందియువత స్వచ్ఛంద రక్తదానం చేశారు. సుమారు200 యూనిట్ల బ్లడ్‌ను సేకరించడం జరిగిందని రెడ్‌క్రాస్ సోసైటీ తెలిపింది. పోలీస్ అమరవీరుల సంస్మరణలో బాగంగా ప్రతి సంవత్సరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిభిరం నిర్వహిస్తున్నామన్నారు. పోలీసు అమరవీరులను ఎప్పటికి మర్చిపోకుండా నిత్యం గుర్తుచేసుకోవడానికి జిల్లా పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నమని ఎస్పీ తెలిపారు. ప్రతి మూడు నెలలకొకసారి ప్రతి ఒక్కరు రక్తదానం చేయడం ద్వారా తాజాగా శరీరంలోకి కొత్త రక్తం ఉత్పత్తి అయ్యి ఆరోగ్యంగా ఉంటామని ఎస్పీ సూచించారు. డీఎస్పీలు వెంకటరమణ, రఘుచందర్, డాక్టర్ దీపిక, ఇండియన్ రెడ్‌క్రాస్ సోసైటీ సిరిసిల్ల శ్రీనివాస్, ఎస్ బి ఇన్స్‌ఫెక్టార్ ఆరీఫ్ అలీఖాన్, రిజర్వ్ ఇన్స్‌ఫెక్టార్లు సైదులు , వేణు, సిఐలు రామ్ నరసింహారెడ్డి, రవి, కరుణాకర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది యువత పాల్గొన్నారు.

## రన్ ఫర్ యూనిటీ పోస్టర్ ఆవిష్కరణ

### జిల్లా ఎస్‌పి మహేష్ బి గితే




ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : జాతీయ ఐక్యత దినోత్సవంను పురస్కరించుకొని రన్ ఫర్ యూని టీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే పిలుపునిచ్చారు. గురువారం పోలీస్ కార్యాలయంలో రన్ ఫర్ యూనిటీపోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతినీ పురస్కరించుకొని నేడు ఉదయం 07:00 గంటలకు సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా నుండి బతుకమ్మ ఘాట్ వరకు రన్ ఫర్ యూనిటీ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, ఇన్స్పెక్టర్ లు ఆర్ఐలు తదితరులు ఉన్నారు.

# అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో త్రిముఖ పోరు




### ఆసక్తికరంగా మారిన మూడు ప్యానెళ్ల పోటీ

### రేపే పోలింగ్...

### పోటాపోటీగా అభ్యర్థుల ప్రచారం

ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఈ సారి ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొంది. మూడు ప్యానెళ్లుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే కావడం విశేషం. మూడు ప్యానెళ్లలో ఎవరు గెలిచినా కరీంనగర్ అర్బన్ బ్యాంకు పాలకవర్గం కాంగ్రెస్ ఖాతాలోకే చేరే అవకాశముంది. కాగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ తమ పార్టీ నుంచి ప్యానెల్ ప్రకటించలేదని ఇదివరకే స్పష్టం చేశారు. గత 40సంవత్సరాల క్రితం ప్రారంభించిన కరీంనగర్ అర్బన్ బ్యాంకు అంచెలంచెలుగా ఎదిగింది. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని సభ్యత్వ నమోదుతో పాటు డిపాజిట్లను పెంచుకుని ప్రత్యేక ముద్ర వేసుకుంది. కరీంనగర్ అర్బన్ బ్యాంకులో కోర్టు కేసుల తగాదాలతో గత కొన్ని సంవత్సరాలుగా పాలకవర్గం ఎన్నికలకు నోచుకోలేదు.. వరుసగా పర్సన్ ఇంచార్జిల పాలనను ప్రభుత్వం కొనసాగిస్తూ వస్తోంది. ఎట్టకేలకు కరీంనగర్ అర్బన్ బ్యాంకు పాలకవర్గం ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయగా శనివారం పోలింగ్ జరగనుంది. కరీంనగర్ అర్బన్ బ్యాంకు పాలకవర్గంలో 12 మంది డైరెక్టర్ల స్థానాలకు గాను 9 జనరల్ పోను 2 మహిళ, ఒకటి ఎస్సీ ఎస్టీలకు కేటాయించారు. వీటిలో జనరల్ స్థానాలకు 43 మంది పోటీ పడుతుండగా ఇద్దరు మహిళాస్థానాలకు 5 గురు పోటీ పడుతున్నారు. ఒక ఎస్సీ ఎస్టీ స్థానానికి 8 మంది బరిలో ఉన్నారు. గత 10 రోజులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం సాగిస్తున్నారు.

### మూడు ప్యానెళ్ల పోటాపోటీ

ఎట్టకేలకు జరుగుతున్న కరీంనగర్ అర్బన్ బ్యాంకు ఎన్నికలలో మూడు ప్యానెళ్లుగా ఏర్పడ్డ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం సాగిస్తున్నారు. గతంలో కరీంనగర్ అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా పనిచేసిన కర్ర రాజశేఖర్ ఒక ప్యానెల్ ఏర్పాటు చేసి బరిలో నిలిచారు. ఇటీవల పర్సన్ ఇంచార్జిగా కొనసాగిన గడ్డం విలాస్‌రెడ్డి మరో ప్యానెల్‌ను ఏర్పాటు చేసి పోటీలో ఉన్నారు. తాజాగా కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు మద్దతుతో మూడో ప్యానెల్ ఏర్పాటయ్యింది. కాగా ఈ మూడు ప్యానెళ్లకు నాయకత్వం వహిస్తున్న నేతలు కాంగ్రెస్‌కు చెందిన వారే కావడంతో పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. కరీంనగర్ అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో మొత్తం ఓటర్ల సంఖ్య 9287 మంది ఉండగా అందులో జగిత్యాల పరిదిలో రెండు వేల పైచిలుకు ఉంటారని అధికారులు చెబుతున్నారు.

### మా ప్యానెల్‌దే విజయం!!

మూడు ప్యానెళ్ల ఎవరికి వారే ప్రచారం సాగిస్తున్నారు. పోటాపోటీ విలేకరుల సమావేశాల్లో తమ ప్యానెల్‌దే విజయమంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతంలో బ్యాంకు పురోభివృద్ధికి,డిపాజిట్ల పెంపుదలకు విశేష కృషి చేసినట్లు కర్ర రాజశేఖర్ చెబుతున్నారు. తన ప్యానెల్‌కు బ్యాంకు మాజీ చైర్మన్లు బొమ్మరాతి రాజేషం, డి.శంకర్ ల మద్దతు ఉన్నట్లు తెలిపారు. కరీంనగర్ అర్బన్ బ్యాంకులో తమ ప్యానెల్‌ను గెలిపిస్తే బ్యాంకు పురోభివృద్ధికి కృషి చేస్తామని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంటు నియోజవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు చెబుతున్నారు. గతంలో బ్యాంకులో రుణాలు, బంగారు ఆభరణాల తాకట్టు విషయాలలో అనేక అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయని, భవిష్యత్తులో తమ ప్యానెల్‌ను గెలిపిస్తే పారదర్శకమైన సేవలను ఖాతాదారులకు అందిస్తామంటున్నారు. తమ ప్యానెల్‌కు మంత్రులు, జగిత్యాల ఎమ్మెల్యేల మద్దతు సంపూర్ణంగా ఉన్నట్లు ప్రకటించారు. మరో ప్యానెల్‌లో బరిలో నిలిచిన గడ్డం విలాస్‌రెడ్డి సైతం తనదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. పర్సన్ ఇంచార్జి పాలనలో బ్యాంకు అభివృద్ధికి కృషి చేశామని చెబుతున్నారు. పోటా పోటీగా సాగుతున్న ప్రచారంలో శనివారం జరిగే పోలింగ్‌లో ఎవరిని అదృష్టం వరించేనో అనేది సర్వత్రా చర్చ సాగుతోంది.

# క్రీడ

## నమ్మకస్తుడికే పట్టం.. కోల్‌కతా హెడ్‌కోచ్‌గా అభిషేక్ నాయర్



**అభిషేక్ నాయర్ :** ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్కు ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త హెడ్‌కోచ్ వేటలో ఉన్న ఆ ఫ్రాంచైజీ అభిషేక్ నాయర్‌కు ఆ పదవిని కట్టబెట్టింది.
ఈ విషయాన్ని గురువారం ఎక్స్ వేదికగా కోల్‌కతా వెల్లడించింది. ఈ మధ్యే రాజీనామా చేసిన చంద్రకాంత్ పండిట్ స్థానాన్ని నాయర్ భర్తీ చేయనున్నాడు. ఫ్రాంచైజీతో సుదీర్ఘ అనుబంధమున్న అభిషేక్ నాయర్ హెడ్‌కోచ్‌గా నియమితులవ్వడంతో కోల్‌కతా ప్లేయర్లు మస్త్ ఖుషీ అవుతున్నారు.
లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అయిన అభిషేక్ 2009లో టీమిండియా తరపున తొలి వన్డే ఆడాడు. ఆల్‌రౌండ్‌గా జట్టులో పాతుకుపోతాడు అనుకుంటే అదే ఏడాది సెప్టెంబర్‌తో అతడు బ్లూ జెర్సీకి దూరమయ్యాడు. అనంతరం ఐపిఎల్‌పై దృష్టి పెట్టిన అభిషేక్ 2018లో కోల్‌కతా క్యాంప్‌లో చేరాడు. అప్పటి నుంచి ఫ్రాంచైజీ కొన్న కుర్రాళ్లలో మెలకువలు పెంపొందించడమే పనిగా శ్రమించాడు. అభిషేక్ శిక్షణలోనే చక్రవర్తి, వెంకటేశ్ అయ్యర్, రింకూ సింగ్‌లు మరింత రాటుదేలారు. ఆరేండ్ల అతడి కష్టానికి 2024లో కోల్‌కతా ట్రోఫీ గెలవడంతో ఫలితం దక్కినట్టైంది.

## బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా.. బంతి తగిలి క్రికెటర్ మృతి



**మెల్బోర్న్:** ఆస్ట్రేలియాలో ఓ యువ క్రికెటర్ బంతి తగలడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన మెల్బోర్న్‌లో మంగళవారం జరిగింది. బెన్ ఆస్టిన్ అనే 17 ఏళ్ల కుర్రాడు స్థానిక టీ20 క్రికెట్ మ్యాచ్‌కు ప్రిపేరవుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. నెట్స్‌లో హెల్మెట్ పెట్టుకుని ఆటోమెటిక్ బౌలింగ్ మెషీన్ ముందు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో.. బంతి బలంగా వచ్చి అతన్ని తగిలింది. తల, మెడ భాగంలో బంతి గట్టిగా తగిలినట్లు గుర్తించారు. క్రిటికల్ కండీషన్‌లో ఉన్న అతన్ని ఆస్పత్రికి తరలించినా.. అతని ప్రాణాలు దక్కలేదు. బెన్ మృతితో తీవ్ర విషాదం నెలకొన్నట్లు ఫెర్న్‌ట్రీ గల్లీ క్రికెట్ క్లబ్ ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఆ క్లబ్ తరపున బౌలర్, బ్యాటర్‌గా బెన్ ఎదుగుతున్నాడు.
గతంలో ఆస్ట్రేలియా క్రికెటర్ ఫిలిప్ హ్యూగ్స్ కూడా ఇలా బంతి తగలడం వల్లే మృతిచెందిన విషయం తెలిసిందే. 2014లో డొమెస్టిక్ క్రికెట్ షీఫీల్ షీల్ టోర్నీఆడుతున్న సమయంలో ఆ ఘటన జరిగింది. బంతి బలంగా మెడకు తగలగా అతను ప్రాణాలు విడిచాడు.

## కెకెఆర్‌లోకి రోహిత్ శర్మ.. ముంబై ఇండియన్స్ రియాక్షన్ ఇదే!



**ఐ**పిఎల్ 2026 సీజన్ నేపథ్యంలో ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఆ జట్టును వీడనున్నాడని సోషల్ మీడియా వేదికగా జోరుగా ప్రచారం జరుగుతోంది. ముంబైని వీడి కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) జట్టులో చేరేందుకు రోహిత్ సిద్ధమయ్యాడని వార్తలు వస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా కేకేఆర్ చేసిన పోస్ట్ ఈ వార్తలకు బలం చేకూర్చింది.

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం అందుకున్న రోహిత్ శర్మను అభినందిస్తూ కేకేఆర్ ఓ పోస్ట్ చేసింది. 'వరల్ నెంబర్ వన్ బ్యాటర్. కంగ్రాట్స్ రోహిత్. ఇందుకు మీరు పూర్తి అర్హులు'అని ఆ పోస్ట్‌లో పేర్కొంది. ఈ పోస్ట్‌కు ఓ అభిమాని 'అయితే కన్ఫామ్ అనుకోవచ్చా..?' అని కామెంట్ చేయగా కేకేఆర్ స్పందించింది. 'నంబర్ 1 వన్డే బ్యాటర్ కన్ఫామ్' అంటూ బదులిచ్చింది. ఆ వ్యక్తి వెంటనే 'అంటే హిట్‌మ్యాన్ కేకేఆర్‌ల్లో చేరినట్టే..' అని బదులివ్వడంతో ఈ సంభాషణ క్షణాల్లోనే వైరల్ అయింది.

**అభిషేక్ నాయర్ హెడ్ కోచ్ కావడంతో..**

రోహిత్ శర్మ క్లోజ్ ఫ్రెండ్ అయిన అభిషేక్ నాయర్.. కేకేఆర్ హెడ్ కోచ్‌గా ఎంపికవ్వడం కూడా ఈ ప్రచారానికి ఊతమిచ్చింది. ఆస్ట్రేలియా పర్యటనకు ముందు అభిషేక్ నాయర్ మార్గదర్శకంలోనే రోహిత్ శర్మ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. అతని పర్యవేక్షణలోనే కఠినమైన డైట్, వ్యాయామాలతో 10 కిలోల బరువు తగ్గాడు. దాంతో అభిషేక్ నాయర్ సూచనలతో రోహిత్ కేకేఆర్‌లోకి వెళ్తాడనే సందేహాలు కూడా వ్యక్తమయ్యాయి.
ఈ వార్తల నేపథ్యంలో ముంబై ఇండియన్స్ స్పందించింది. రోహిత్ శర్మ ఎక్కడికి వెళ్లడని, ముంబై జట్టులోనే ఉంటాడని స్పష్టం చేస్తూ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. అయితే ఈ పోస్ట్లో ఈ విషయాన్ని నేరుగా ప్రస్తావించకుండా కోడ్ లాంగ్వేజ్‌తో తమ సందేశాన్ని అభిమానులకు తెలియజేసింది.

**సూర్యుడు రాత్రి ఉదయించడు..**

'సూర్యుడు మళ్లీ రేపు ఉదయిస్తాడు. కానీ రాత్రిపూట ఉదయించడం అసాధ్యం!' అనే క్యాప్షన్‌తో రోహిత్ శర్మతో ఉన్న ఫొటోను పంచుకుంది. అయితే ఇక్కడ నైట్ అనే పదం దగ్గర కే అనే అక్షరాన్ని బ్రాకెట్‌లో ఉంచింది. రోహిత్ సూర్యుడని, నైట్‌రైడర్స్‌కు వెళ్లడని పరోక్షంగా చెప్పింది.
ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ దుమ్మురేపిన సంగతి తెలిసిందే. ఓ సెంచరీ, హాఫ్ సెంచరీతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన సంగతి విదితమే. ఈ ప్రదర్శనతోనే రోహిత్ తొలిసారిగా ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని అందుకున్నాడు.

## ఫోకస్

## ఎప్పుడైనా నేర్చుకోవచ్చు..



ఎంతటి కొత్త విషయమైనాసరే, నేర్చుకోవడానికి ఆసక్తి ఉండాలే తప్ప వయసు పరిమితి లేదు. వృద్ధాప్యంలోనూ కొత్త జీవన శైలి లేదా హాబీలను అనుసరించడం కష్టం కాదని పరిశోధనలు చెప్తున్నాయి. అంతేకాదు, కొత్త విషయాల పట్ల ఆసక్తి ప్రదర్శించడం మంచి ఆలోచనకు నిదర్శనమని, అది జీవన శైలికి ఉత్సాహాన్ని, సంతృప్తిని ఇస్తుందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. అంతేగాక, సాధారణంగా వృథాగా గడిపే సమయాన్ని అత్యంత అర్థవంతంగా మార్చుకోవడానికి కొత్త విధానాలు ఉపయోగపడతాయి. ఇందుకు అనుసరించాల్సిన ప్రారంభదశల్లో ఆసక్తులు గుర్తించడం అనేది కీలక పాత్ర పోషిస్తుంది. ఎవరికివారు తమతమ ఆసక్తులను విశ్లేషించుకోవాలి. సంగీతం లేదా చిత్రకళ.. గార్డెనింగ్ లేదా వంటకాలు.. యోగా లేదా సాహిత్యం వంటి రంగాల్లో దేని పట్ల ఎక్కువ ఆసక్తి ఉందనేది తెలుసుకోవాలి. గత అనుభవాలను కొత్త అభ్యాసాలకు జత కలపాలి. విశ్లేషించుకోవాలి. కొత్త హాబీ గురించి కుటుంబ సభ్యులు, స్నేహితుతో మాట్లాడడం మంచిది. వారు మీకు ప్రోత్సాహం ఇవ్వడంతోపాటు, మిమ్మల్ని ఆదర్శంవంతంగా చూస్తారు. గౌరవిస్తారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది కాబట్టి, ఎన్నో కొత్తకొత్త విషయాలపై ఆన్‌లైన్ కోర్సుల్లో చేరవచ్చు. స్థానిక తరగతులు, శిక్షణా కేంద్రాలు కూడా ఎంతో సహాయపడతాయి. ఏదైనా చిన్నగా ప్రారంభించి, క్రమంగా విస్తరించాలి. ఇందుకు దృఢ సంకల్పం కీలకం. మొదలుపెట్టిన అంశాలను ఎప్పటిలోగా పూర్తి చేయాలో ముందుగానే నిర్ధారించుకోవాలి. ఎవరితో కలిసి పని చే యాలి? ఏ స్థాయిలో ప్రస్థానాన్ని కొనసాగించాలి? అనే విషయాలను ముందుగానే ఖరారు చేసుకోవాలి. కాలసూచికను ఖరారు చేసుకున్న తర్వాత, వారాలు లేదా నెలల వారీగా సూక్ష్మ లక్ష్యాలను నిర్ధారించుకోవాలి. శారీరక, మానసిక ఆరోగ్యం జీవితంలో దాదాపు ప్రతి అంశంపైనా ప్రభావం చూపుతుంది. కాబట్టి, సీనియర్ సిటిజన్లు ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించాలి.సులభమైన వ్యాయామాలు చేయాలి. పుస్తకాలు చదువుతూ, నడక, యోగ, ధ్యానం ద్వారా మానసికంగా ప్రశాంతంగా ఉండవచ్చు. సూక్ష్మం గా చెప్పాలంటే, కొత్త శైలిని ప్రారంభించేముందు మనసులో ఆనం దం, 'నేను చేయగలుగుతాను' అన్న నమ్మకం ఉండాలి. వయస్సును ఏమా త్రం పట్టించుకోకుండా, ప్రయత్నాన్ని కొనసాగిస్తూ, నూతన అనుభవాలను ఆహ్వానించండి. దీని ద్వారా మీ జీవితం మరింత సంతృప్తిని పొందుతుందనడంలో సందేహం లేదు.

## స్ఫూర్తిదాయకం.. హిరాటా జీవితం..



జపాన్‌కు చెందిన షిగెమీ హిరాటా డిగ్రీ సర్టిఫికెట్ తీసుకొని పదేళ్లు అయింది. 2016లో అతను బ్యాచిలర్ డిగ్రీ పొందాడు. ఒక వ్యక్తి డిగ్రీ పూర్తి చేయడం అద్భుతం కాకపోవచ్చు. కానీ, డిగ్రీ సర్టిఫికెట్ పొందే సమయానికి హిరాటా వయసు అక్షరాలా 96 సంవత్సరాల, 200 రోజులు. అందుకే ఇది అసాధారణ ఘటనగా నిలిచిపోయింది. మానవ జీవన ప్రయాణంలో స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని అందిస్తున్నది. 1919లో జన్మించిన హిరాటా, వృద్ధాప్యంలో కూడా విద్యను కొనసాగించడం ద్వారా ప్రపంచంలోని ఎంతో మందికి ఆదర్శంగా నిలిచాడు. 85 ఏళ్ల వయసులో అతను కైరో యూనివర్సిటీ ఆఫ్ ఆర్ట్ అండ్ డిజైన్‌లో సెరామిక్ ఆర్ట్స్ డిగ్రీ కోర్సులో చేరాడు. 11 సంవత్సరాలు అహర్నిశంగా కృషి చేసి, 2016లో బ్యాచిలర్ డిగ్రీని పొందాడు. ప్రపంచంలోనే డిగ్రీ పొందిన అత్యంత ఎక్కువ యవసుగల వ్యక్తిగా గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించాడు. విద్యకు వయస్సు బంధనం లేనేలేదని, మన ఆశయాలను సాధించడానికి శక్తివంతమైన సంకల్పం కావాలని హిరాటా కథనం స్పష్టం చేస్తుంది. తన విద్యావ్యాసంగంలో, తనకు తెలియని ఎంతో మంది విద్యార్థులు రోజూ అభివాదం చేయడం కొత్త ఉత్సాహాన్ని ఇచ్చేదని అంటాడు హిరాటా. 'ఈ వయసులో చేసిన సరికొత్త ప్రయాణంలో ఎన్నో నూతన విషయాలు నేర్చుకోవడాన్ని మించిన ఆనందం ఏముంటుంది. జీవితాంతం చదువును కొనసాగించాలన్నదే నా ఆశయం' అనే మాటలు అతని ఆత్మవిశ్వాసానికి, నిరంతర అభ్యాసంపై ఉన్న అంకితభావానికి నిదర్శనం. కొత్త విషయాలను నేర్చుకునేందుకు వెళ్లిపోయే ఉత్సాహం, విజయాన్ని సాధించాలనే ధైర్యం ఉంటే, అసాధ్యమనేది లేదని హిరాటా రుజువు చేశాడు.

## సీనియర్ సిటిజన్స్

## దివ్యాంగులు

## ప్రతి పౌరుడికీ సమాన హక్కులు ఉన్నాయా?



భారత రాజ్యాంగాన్ని అనుసరించి, దేశంలోని ప్రతి పౌరుడికీ సమాన హక్కులు ఉండాలి.గౌరవం దక్కాలి. అవకాశాలు లభించాయి. కానీ, ఇవి చెప్పడానికి ఎంత గంభీరంగా ఉన్నా, నిజ జీవితంలో మాత్రం అత్యధిక శాతం మందికి అందని ద్రాక్షగానే మారుతున్నాయి. ప్రత్యేకించి దివ్యాంగుల పరిస్థితి మరింత దారుణం. 2021 గణాంకాలను అనుసరించి మన దేశంలో దివ్యాంగులుగా నమోదైన వారి సంఖ్య 2.68 కోట్లు. అంటే మొత్తం జనాభాలో 2.21 శాతం. కానీ ఈ సంఖ్య వాస్తవానికి ఇంకా ఎక్కువే అని ప్రపంచ బ్యాంకు అంచనా. వివిధ కారణాలతో చాలా మంది తమ పేర్లను నమోదు చేసుకోవడం లేదని, ఈ సంఖ్య దాదాపు 7.5 కోట్ల వరకూ ఉంటుందని వరల్డ్ బ్యాంక్ స్పష్టం చేస్తున్నది. దివ్యాంగులది శారీరక పరిమితుల సమస్య కాదు. ఇది సామాజిక దృష్టికోణం, మానసిక నిర్మాణం, ప్రభుత్వ వ్యవస్థల అసమానతల సమస్య. వైకల్యం అనేది అసమర్థత కాదు.. అది సమాజం సృష్టించిన అడ్డంకుల ఫలితం. అందుకే, ప్రతి పౌరుడికీ సమాన హక్కులు లభిస్తున్నాయా? అనే ప్రశ్న తెరపైకి వస్తున్నది. లేదనే చేదు నిజం కూడా అందరికీ తెలుసు. ఆతి తక్కువ మందిని మినహాయిస్తే, దివ్యాంగులు అంతా ఏదో రకంగా మానసిక, శారీరక వివక్షను ఎదుర్కొంటున్నవారే. దృష్టి లోపం, శ్రవణ లోపం, మాట లేదా భాషా లోపం, శారీరక వైకల్యం, మానసిక వైకల్యం, ఆటిజం స్పెక్ట్రమ్, నేర్చుకోవడంలో ఆలస్యం, బహుముఖ వైకల్యాలు వంటి సమస్యలు దివ్యాంగుల జీవితాలను ఛిద్రం చేస్తున్నాయి. దివ్యాంగుల్లో శారీరక లోపం ఉన్న వారు 20 శాతంకాగా, దృష్టిలోపంతో బాధపడుతున్న వారు 18 శాతం. 19 మందికి శ్రవణ లోపం ఉంది. మానసిక వైక్యం 8 శాతం మందికి ఉంటే, 7 శాతం మంది మల్టిపుల్ డిసెబిలిటీస్ సమస్యను ఎదుర్కొంటున్నారు. వివిధ రకాలుగా సమస్యలు ఎదుర్కొంటున్న దివ్యాంగుల పట్ల సానుకూల ధోరణి లేకపోగా, సూటిపోటి మాటలతో వేధించడం.. హేళన చేసి బాధించడం నేటి సమాజంలో సాధారణమైంది. మానవత్వానికి మచ్చ తెచ్చే ఈ తీరు, దేశంలో ప్రతి పౌరుడికీ సమ న్యాయం, లభిస్తున్నదా? సమాన హక్కులు దక్కుతున్నాయా? అనే ప్రశ్నలను లేవనెత్తుతున్నది.

## అండర్ గ్రౌండ్ అన్‌ఫిట్ కార్మికులకు ఉద్యోగాలు

### అంగీకరించిన సింగరేణి యాజమాన్యం

### ఫలించిన గుర్తింపు సంఘం కృషి



**ప్రజాపక్షం/పెద్దపల్లి/భద్రాద్రికొత్తగూడెం :** సింగరేణిలో అనారోగ్యంతో మెడికల్ అన్‌ఫిట్ ఐన మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మెన్‌లకు ఎఐటియుసి కృషితో సర్ఫేస్‌లో తగిన ఉద్యోగం ఇచ్చేందుకు సింగరేణి యాజమాన్యం గురువారం ఆదేశాలు జారీ చేసిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణిలో గతంలో గుర్తింపు సంఘంగా ఉన్న ఎఐటియుసి హయాంలో అనారోగ్యంతో మెడికల్ అన్ ఫిట్ ఐన మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మెన్స్‌కు సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇచ్చే వారని, కాని 2018 మార్చి నుంచి దానిని నిలిపి వేసి సర్ఫేస్‌లో జనరల్ మజ్దూర్, క్యాటగిరి వన్ లో పోస్టింగ్ ఇవ్వడం జరిగిందని, దీంతో సింగరేణిలో చాలామంది మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్‌మెన్స్ మానసికంగా, ఆర్థికంగా నష్టపోయారని, దీనికి కారణం అప్పటి గుర్తింపు సంఘం టిబిజికెఎస్ యాజమాన్యం అవలంబించిన కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకోవడంలో వైఫల్యం చెందడమేనన్నారు. సింగరేణిలో 2023 లో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో మైనింగ్ స్టాఫ్‌కు, ట్రేడ్స్ మెన్‌లకు అండర్ గ్రౌండ్‌లో అన్‌ఫిట్ ఐన వారికి సూటబుల్ జాబ్ ఇప్పిస్తామని ఎఐటియుసి ఇచ్చిన హామీ మేరకు యాజమాన్యం పై ఒత్తిడి చేసి డైరెక్టర్ ఫా స్థాయి స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో పట్టుబట్టి గత ఒప్పందం ను అమలు చేయాలని డిమాండ్ చేయడం జరిగిందన్నారు. ఎఐటియుసి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒకటొకటిగాగా అమలు చేసేందుకు కృషి చేస్తుందన్నారు.

## బకాయిల భారం నుంచి విద్యార్థులను ఆదుకోవాలి

### ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం డిమాండ్

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** బకాయిల భారం నుంచి విద్యార్థులను ఆదుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఎఐఎస్‌ఎఫ్‌ఆధ్వర్యంలో పెండింగ్ స్కాలర్‌షిప్‌లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ చదువులు పూర్తయినా సర్టిఫికెట్లు పొందాలంటే పెండింగ్ బకాయిలు చెల్లించి తమ సర్టిఫికెట్లను తీసుకువెళ్ళాలని విద్యార్థులకు ప్రయివేటు, ప్రభుత్వ విద్యాసంస్థల యాజమాన్యాలు చెప్పడంతో పేద విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు అందించడంలో గతంలో బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాలు కాలయాపన చేస్తూ పేద విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు కుషాల్, సుభోద్, సంజయ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



## రైతాంగాన్ని ఆదుకోండి

### సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి భిక్షపతి

### నీటమునిగిన పంటలను పరిశీలించిన సిపిఐ బృందం



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** మొంథా తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని సిపిఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుఫాన్ ప్రభావంతో నీట మునిగిన పంటలను సిపిఐ బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా కర్రె ఇక్షపతి మాట్లాడుతూ ఎల్కతుర్తి మండలం చుట్టుపక్కల గ్రామాల్లో వేలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పత్తి, మిర్చి, కంది, చిరుధాన్యాల పంట నష్టం జరిగిందన్నారు. జిల్లాలో దాదాపు అన్ని మండల కేంద్రాలతో పాటు అన్ని గ్రామాలలో పలురకాల పంటలు తుఫాన్ ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎల్కతుర్తి మండలంలోని గోపాల్పూర్‌లో ఊట్కూరి ప్రభాకర్‌కు చెందిన కోళ్ల ఫామ్‌కు నీళ్లు వచ్చి దాదాపుగా మూడు లక్షల విలువ చేసే కోడి పిల్లలు చనిపోయాయన్నారు. పెండ్యాల సాంబయ్య రెండెకరాలు పొలం నేలకొరిందని, పోలేని శ్రీనివాసరావు వరి నీటా మునిగిందని, పెండ్యాల నాగరాజుకు చెందిన మూడు లేగ దూడలు తాళ్లవాగులో కొట్టుకపోవడం బాధాకరమన్నారు. బావుపేటకు చెందిన పోలాటి సంపత్‌రావు 150 వడ్ల బస్తాలు కొట్టుకపోయాయన్నారు. తుఫాను ప్రభావంతో జిల్లాలో తీవ్రంగా రైతులకు నష్టం జరిగిందని, ఈ తుఫానును జాతీయ విపత్తుగా ప్రకటించి రైతులకు ఆర్థిక సహాయం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వుట్కూరి రాములు, దళిత హక్కుల పోరాట జిల్లా అధ్యక్షులు నిమ్మల మనోహర్, సిపిఐ గ్రామ కార్యదర్శి సూర మొగిలి, సహాయ కార్యదర్శులు జూపాక రవీందర్, కర్రె రాజు, రైతులు కోదాటి రాజేశ్వరరావు, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులు ఎత్తివేయాలి

### వామపక్షనేతల డిమాండ్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** ఆర్‌టిసి కార్మికులు, రైతుల పక్షాన నిలిచి ఉద్యమం చేసిన వామపక్ష నేతలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసే వరకూ పోరాటం ఆగదని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి, మండల వెంకన్న గౌని ఐలయ్య అన్నారు. గురువారం వామపక్ష నేతలు మహబూబాబాద్ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలిచి ఉద్యమాలు చేసేవారిపై ఎన్ని కేసులు పెట్టినా, అంతిమ విజయం వామపక్షాలదే అన్నారు. ప్రజలంతా ఏకమై కార్మికులతో కలిసి గత ఎన్నికల్లో కెసిఆర్‌కు బుద్ధిచెప్పారని, దేశస్థాయిలో మోదీకి రానున్న రోజుల్లో అదే గతి పడుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవచూపి వామపక్ష పార్టీల నేతలపై పెట్టిన అక్రమ కేసులు తక్షణమే ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. కోర్టుకు హాజరైన వారిలో వామపక్ష పార్టీల నేతలు బి అజయ్ సారథి రెడ్డి, తమ్మెర విశ్వేశ్వరరావు, నల్లు సుధాకర్‌రెడ్డి, ఆకుల రాజు, గుణగంటి రాజన్న, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, వరిపల్లి వెంకన్న, మేక వీరన్న, చొప్పరి శేఖర్, కుంట ఉపేందర్, హాలావత్ లింగ్య, జగ్గన్న, సమ్మెట రాజమౌళి, సామ పాపయ్య, తండ మాధవి, కనకం పద్మ, అల్వాల వీరయ్య, ఆలకుంట్ల సాయిలు, సమ్మెట రాజమౌళి, నాగయ్య, మధు, ఉపేందర్ పాల్గొన్నారు.



## వందేళ్ల ఉత్సవాల్లో కార్మికవర్గం భాగస్వాములు కావాలి

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిపిఐ వందేళ్ల ఆవిర్భావ ఉత్సవాల్లో సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన కార్మికులు భాగస్వాములు కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.కె.సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. పట్టణంలోని పెద్దబజార్ ఏరియాలో గురువారం జరిగిన అనుబంధ యూనియన్ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 26వ తేదీతో సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతుందని, ఈ సందర్భంగా ఖమ్మం నగరంలో జాతీయ స్థాయి శతవసంత బహిరంగ సభ నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఈఉత్సవాలకు 40 దేశాలకు చెందిన ప్రతినిధులు, దేశ నలుమూలల నుంచి కమ్యూనిస్టు పార్టీ ప్రముఖులు రానున్నట్లు చెప్పారు. జిల్లా నుండి లక్ష మందిని తరలించే విధంగా ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో కార్మిక వర్గం ఎఐటియుసి జెండా నీడలో తమ హక్కులను పరిరక్షించుకుంటూ నూతన హక్కుల సాధన కోసం పోరాడుతున్నారన్నారు. హక్కుల సాధన, పరిరక్షణ కేవలం ఎఐటియుసితోనే సాధ్యమని సాబీర్‌పాషా స్పష్టం చేశారు. అనంతరం సిపిఐ వందేళ్ల ప్రచార కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, తరాల రాజు, నీలం మొగలి, వెలిశాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## హక్కులు, సమస్యల సాధనకు ఎఐటియుసి నిరంతరం పోరాటం

### రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్

**ప్రజాపక్షం/నర్సంపేట :** హక్కులు, సమస్యల సాధనకు నిరంతరం ఎఐటియుసి పోరాటం చేస్తుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ పేర్కొన్నారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, హమాలీ కార్మికులకు ప్రమాదం జరిగినప్పుడు పదిలక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కార్మికుడు ఉద్యోగ విరమణ 58 సంవత్సరాల నుండి 65 సంవత్సరాలకు పెంచాలని, అర్హులైన కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలని, మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనములను వెంటనే చెల్లించాలని, ఆర్టిసి కార్మికులకు రావలసిన బెనిఫిట్స్ వెంటనే ఇప్పించాలని, ఆటో కార్మికులకు నెలకు రూ.12 వేలు చెల్లించాలని ఎఐటియుసి పోరాటం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేసేవరకు ప్రతి కార్మికుడు పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కిషోర్‌కుమార్, వీరస్వామి, అయిలయ్య, రమేష్, సతీష్, మల్లయ్య, కనకమల్లు, లక్ష్మయ్య, నాగులు, సారంగం, రవి, సాయిలు, కుమార్, సోమయ్య పాల్గొన్నారు




## ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

### యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** స్వాతంత్రానికి పూర్వమే దేశంలో కార్మిక బానిస సంకెళ్ళకు చరమగీతం పాడాలని, వారి హక్కుల కోసం పోరాడాలని ఆవిర్భవించిన ఎఐటియుసి 106వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు జిల్లాలో ఘనంగా జరుపాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం హుజూర్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం సాగిస్తూ నాటి నుండి నేటి వరకు అనేక హక్కుల సాధన కోసం ఉద్యమించిన, ఉద్యమిస్తున్న ఘన చరిత్ర కలిగిన కార్మికవర్గ నాయకత్వానికి వహిస్తున్న ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం నేడు 31వ తేదీన జిల్లాలో ఘనంగా జరుపాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ మాట్లాడుతూ సమసమాజ స్థాపన కోసం, కార్మిక వర్గ రక్షణ కోసం ఆవిర్భవించిన ఏఐటియుసి మరింత ముందుకు తీసుకుపోవడం కోసం కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం నిర్వహిస్తామన్నారు. ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె లతీఫ్, జిల్లా నాయకులు ఇందిరాల వెంకటేశ్వర్లు, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## రైతులు సమీకృత వ్యవసాయంపై దృష్టిసారించాలి

### తుపానుకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** రైతులు పంటల పరిరక్షణ, సమీకృత వ్యవసాయంపై దృష్టి సారించి నష్టాలను తగ్గించుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం ,చుంచుపల్లి మండల పరిధిలోని తంగ్గళ్ల తండాలో తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వరి, పత్తి, ఇతర పంటలను స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా రైతు గాంధీకి చెందిన వరి పొలాన్ని సందర్శించి సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పొలంలో నీరు అధికంగా నిల్వ ఉండటం వల్ల పంట మరింత నష్టానికి గురయ్యే అవకాశం ఉందని ,వెంటనే నీటిని తొలగించాలని, వరి కోతను త్వరితగతిన చేపట్టాలన్నారు. పంటనష్టాన్ని తగ్గించుకోవడమే కాకుండా రైతుల ఆర్థిక స్థితి దెబ్బతినకుండా చూడటం అత్యవసరమని కలెక్టర్ పేర్కొన్నారు.



## పత్తి క్వింటాల్‌కు రూ. పది వేలు ఇవ్వాలి




**ప్రజాపక్షం/చండ్రుగొండ:** తుఫాన్ వలన పత్తి చేలు, ఇతర పంటలు నష్టపోయారని, పత్తి క్వింటాకు ప్రభుత్వం మద్దతు ధర పది వేల రూపాయలు ఇవ్వాలని అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర నాయకులు ఎస్‌కే ఉమర్ అన్నారు. గురువారం తుఫాన్ వలన నష్టపోయిన రైతుకు ఎకరానికి పది వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చండ్రుగొండ మండలంలోని బాల్యతండా, సొమ్మతండా, వంకాయ నెంబర్ దుబ్బతండా, తదితర గ్రామాలలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రైతుల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ వల్లన రైతులు పండించిన పంటలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కరపత్రాల ప్రచారం, గ్రూప్ సమావేశం, ప్రదర్శనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ధరావత్ బాలు, మాలోత్ రాము, శాంతి, పుల్లయ్య, రాములు, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరపాలి




**ప్రజాపక్షం/ములకలపల్లి:** నేడు మండల కేంద్రంలో కార్మికుల అడ్డా వద్ద గ్రామ పంచాయితీ కార్యాదలయం ముందు, ఆటో వర్కుల అడ్డా వద్ద ఏఐటియుసి జెండాను ఎగరవేసి కార్మికులందరూ పాల్గొనాలని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ కోరారు. ములకలపల్లిలోని సొసైటీ కార్యాలయం వద్ద గల హమాలీ యూనియన్ కార్యాలయంలో నకిరేకంటి పుల్లారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో మొట్టమొదట పుట్టినటువంటి సంఘం ఆ రోజు ఆంగ్లేయులు ఎదిరించి కార్మికుల కోసం కష్టజీవిల కోసం పుట్టిందే ఏఐటియుసి నేనని కొనియాడారు. లాలా లజపతిరాయ్, ఏంఏం జోషఙ, జవహర్లాల్ నెహ్రూ వంటి నేతలు ఈ సంఘానికి అధ్యక్షులుగా పని చేస్తూ ఈ సంఘం అభివృద్ధికి ఎంతో తోడ్పడ్డారని తెలిపారు. నేడు జరగబోయే 106 ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవ అంగన్వాడీ కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు, గ్రామ పంచాయితీ కార్మికులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో నకరికంటి పుల్లారావు, రావుల రమేష్, పసుపులేటి వెంకటేశ్వరరావు, మిరియాల వెంకటేశ్వరరావు, సాయి, గద్దల రమేష్, పాల్గొన్నారు.

## సిపిఐ సీనియర్ కార్యకర్త విఠల్ మృతి పట్ల సంతాపం

### సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శేషగిరినగర్ గ్రామానికి చెందిన సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ మానపల్లి విఠల్ బుధవారం సాయంత్రం హైదరాబాద్ ఆసుపత్రిలో మృతి చెందారు. విషయం తెలియగానే సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు తోట రమేష్, కార్యవర్గ సభ్యులు ఆధర్ల రాములు, వారి స్నేహితులు వాంకుడోత్ భాస్కర్ తదితరులు హాజరై ఎర్రజెండా కప్పి, పూలమాలవేసి విటల్ అమరహే అంటూ నినాదాలు చేశారు. చిన్ననాటి నుండే కమ్యూనిస్టు పార్టీ ఆకర్షితుడై పార్టీలో ఉన్నారని, పార్టీ కార్యక్రమం ఏ పిలుపు ఇచ్చిన తాను హాజరయ్యే వారని, తమ కుటుంబం కూడా పార్టీ కుటుంబమని,వారు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. వారు చనిపోవడం దురదృష్టకరమని, వారు ఎక్కడున్నా వారి ఆత్మ శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు.

## సిపిఐ ఆధ్వర్యంలో గుంతలు పూడ్చివేత




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్ చౌరస్తాలో గల ఖమమం సూర్యాపేట రహదారిపై ఏర్పడిన పెద్దపెద్ద గుంతలను అక్కడి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గురువారం పూడ్చివేశారు. నెలలుగా ఈ సమస్య ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సిపిఐ నాయకులు దండి రంగారావు సిమెంట్, కంకర్‌ను మిక్స్ చేపించి ట్రాక్టర్ ద్వారా గుంతలపై పోపించారు. అలాగే స్వయంగా పార పట్టి ఆ గోతులను యువజనసంఘం సభ్యులు సహకారంతో పూడ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సోషల్‌మీడియా ఇంచార్జ్ రెబ్బగొండ్ల గోపి, యువజన సంఘం సభ్యులు చింతల ఉదయ్, బన్నీ పాల్గొన్నారు.

## ఓరుగంటినగర్‌లో విరాళాల సేకరణ

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల ఓరుగంటినగర్‌లో అక్కడి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ గురువారం చేపట్టారు. డిసెంబర్ 26న ఖమ్మంలో నిర్వహించనున్న సిపిఐ పార్టీ 100వసంతాల వేడుకలో భాగంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యులు ఓరుగంటి శేషగిరి, వెంపటి సురేందర్, సిపిఐ మండల సమితి సభ్యులు దండి రంగారావు, మామిడి శంకర్‌రెడ్డి, వెన్నం భాస్కర్, రాయల అప్పయ్య, విశ్వనాథం పాల్గొన్నారు.

# క(న)ష్టాల సంద్రంలో రైతన్నలు

### వరి రైతు ఆశలపై 'మొంథా' నీళ్లు
### రైతన్నపై పగబట్టిన ప్రకృతి
### ఈ ఏడాది పంటలన్నీ వర్షార్పణం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రైతన్నకు ఎంత కష్టం ఎంత నష్టం. ఒక పంట పోతే మరో పంట ఆదుకుంటుందిలే అన్న ఆశ ఉండేది. ఈ ఏడాది అన్ని పంటలు అతివృష్టికి దెబ్బతిన్నాయి. ఏది మిగలలేదు. అంత వర్షార్పణమే. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుండి ప్రకృతి పగబట్టినట్లు వ్యవహరించింది. తొలుత మెట్ట పంటలను దెబ్బతీసింది. అపరాలను అసలు కాత, పూత లేకుండానే చేసింది. ఎక్కడో ఒక చోట కాస్తే అది చేతికి రాకుండా వర్షానికి దెబ్బతిన్నాయి. పత్తి రైతు తొలి నాళ్ల నుంచి నిన్న మొన్నటి వరకు ఎదురీతే. ఇప్పుడు పండిన ఆ కొద్ది పంట అమ్ముకునే పరిస్థితి లేదు. ఇటువంటి సమయంలో ఏపుగా పెరిగి భూమికి వచ్చిన ధరను చేసినట్లు ఆకుపచ్చ వర్ణంతో కదలాడిన వరి పంటను చూసి ఇదైనా ఆదుకుంటుందిలే అని స్థిమితపడ్డారు. వరిపై ఆశలు పెంచుకున్నారు. మెట్ట పంటలను దెబ్బతీసిన ప్రకృతి పగచల్లారినట్లు లేదు. మొంథా తుఫాన్ రూపంలో ఒక్క సారిగా విరుచుకుపడింది. కోతకు వచ్చిన కొద్ది రోజుల్లో కోతకు వచ్చేవి మొత్తం చాప చుట్టేసినట్లు నేలవాలాయి. వాటిపై నుంచి నీరు పారుతుండడంతో పైరు పాడిపోతుందన్న ఆందోళన వ్యక్తమవుతుంది. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ వచ్చింది. వరి గతంలో మాదిరి కూలీలతో కోయించి గుళ్లు వేసి నూర్చిడి చేసే పరిస్థితి లేదు. యంత్రాలతో వరి కోతలు కోయిస్తున్నారు. ఇప్పుడు కింద పడిన వరిని కోయడం యంత్రాలతో సాధ్యం కాదు. ఒకవేళ కోసినా ధాన్యం నాణ్యత కోల్పోతుంది. ఒకవేళ మనుషులతో కోయించాలన్న ఆలోచన వచ్చినా కూలీలు దొరికే పరిస్థితి లేదు. యూరియా కోసం అష్టకష్టాలు పడి అధిక ధరకు కొనుగోలు చేసి సాకిన పంట ఇలా కావడంతో ధాన్యం పండించిన రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ. 25వేల నుంచి రూ. 30వేల పెట్టుబడి పెట్టారు. నాణ్యత దెబ్బతింటే ప్రైవేటు వ్యాపారులతో పాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కూడా కొనే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని తక్షణం ఎకరాకు రూ. 20వేల నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.





## నష్టపోయిన రైతుకు ప్రభుత్వం అండ

### రాష్ట్రంలో 4.50 లక్షల ఎకరాల్లో పంట నష్టం
### తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రజలకు, రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, తుఫాన్ ప్రవాహన్ని ముందే అంచనా వేసి సహాయక చర్యలు చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రాణ నష్టం లేకుండా అప్రమత్తంగా ఉన్న జిల్లా యంత్రాంగానికి మంత్రి తుమ్మల అభినందనలు తెలిపారు. గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్‌తో కలిసి ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు వద్ద మున్నేరు వరద ప్రవాహన్ని పరిశీలించారు. అనంతరం మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పర్యటించి ముంపు కాలనీలలో పరిస్థితులు పరిశీలించారు. నయాబజార్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడారు. తుఫాన్ ప్రవాహన్ని ముందే అంచనా వేసి సహాయక చర్యలు చేపట్టామన్నారు. వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో క్లౌడ్ బర్స్ట్‌తో భారీ వరదలు ఎగువ నుంచి మున్నేరుకు వచ్చాయన్నారు. ప్రాణ నష్టం లేకుండా అప్రమత్తంగా ఉన్న జిల్లా యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పని చేసిందన్నారు. వరద తగ్గుముఖం పట్టాయక సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయితే మున్నేరు వరద గండం నుంచి శాశ్వత పరిష్కారం లభిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముంపు ప్రాంత బాధితులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూస్తామన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ వరదను అంచనా వేస్తూ ప్రజలను జాగ్రత్త పరుస్తూ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా సమాచారం అందిందన్నారు. పూర్తి స్థాయిలో పంట నష్టం సర్వే చేసిన తర్వాత పంట నష్టం వివరాలు కొంత పెరగవచ్చునని తెలిపారు. ఖమ్మం జిల్లాలో 62వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10వేల నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి ప్రతి రైతును ఆదుకుంటామన్నారు.

## నష్టం అంచనా వేసి తక్షణమే పరిహారం : సిపిఐ డిమాండ్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మొంథా తుఫాన్ కారణంగా జిల్లా వ్యాప్తంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని సిపిఐ ఖమ్మం జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటన విడుదల చేశారు. మొంథా తుఫాన్ కారణంగా వరి పంటకు జిల్లా వ్యాప్తంగా భారీ నష్టం వాటిల్లిందని రైతులు పెట్టుబడులు పెట్టి పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ నిండా ముంచిందని సురేష్ తెలిపారు. నదులు, ఏర్ల పరివాహక ప్రాంతాల్లో భారీ నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. ఇదే సమయంలో మిర్చి ఇతర ఉద్యానవన పంటలకు కూడా నష్టం జరిగిందని నష్టం అంచనాను రూపొందించి తక్షణం పరిహారం ఇవ్వాలన్నారు. పెట్టుబడి జరిగిన పంట నష్టం ఆధారంగా పరిహారాన్ని నిర్ణయించాలన్నారు. మున్నేరు వరద కారణంగా ఖమ్మం నగరంలో పలు కాలనీలు జలమయమయ్యాయని మున్నేరు బాధిత ప్రజలకు కూడా అంచనాల తర్వాత పరిహారం అందించాలన్నారు.

## 3.5 కేజీల గంజాయి స్వాధీనం

### ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు

**ప్రజాపక్షం/మణుగూరు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఐపీఎస్ ప్రతిష్మాత్మకంగా చేపట్టిన చైతన్య (డ్రగ్స్ పై యుద్ధం) కార్యక్రమంలో భా గంగా ప్రజల్లో చైతన్యం రావడంతో ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు మణుగూరు గాంధీ బొమ్మ సెంటర్లో గల చల్ల శ్రీనివాస్ ఇంట్లో గంజాయి ఉందని సమాచారం ఇవ్వగా ఉన్నత అధికారులకు తెలియజేసి గవర్నమెంట్ పంచుల సమక్షంలో డీఎస్పీ ఉత్తర్వుల మేరకు చల్లా శ్రీనివాస్ ఇంటిని సోదా చేయగా ఇంట్లో 3.5 కేజీల గంజాయి దొరకగా, అతన్ని విచారించగా తన అన్న కొడుకు అయిన చల్ల సతీష్ తన స్నేహితుడు రేపాకుల సాగర్ కలిసి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలంటే గంజాయి అమ్మితే వస్తాయని చెప్పి వారిద్దరూ సీలేరు నుండి గంజాయి తీసుకువచ్చి అమ్ముతుంటారు అని చల్లా శ్రీనివాస్ కూడా అమ్ము కోవచ్చు అనే ఉద్దేశంతో ఇంట్లో నిల్వ ఉంచగా ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో చల్ల శ్రీను ఇంట్లో గల 3.5 కేజీ ల గంజాయి స్వాధీన పరుచుకొని శ్రీనివాస్ పై, సీలేరు నుండి గంజాయి తీసుకు వస్తున్నటువంటి చల్లా సతీష్, రేపాకుల సాగర్ పై కేసు నమోదు చేయటం జరిగింది. చల్లా చల్లా సతీష్, సాగర్‌లను పోలీసులు అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.




## భారత గడ్డపై సిపిఐకి వందేండ్లు

### విరివిరిగా చందాలు ఇవ్వండి
### గడప గడపకూ ముమ్మర ప్రచారం



**ప్రజాపక్షం/పాల్వంచ :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సంధర్భంగా డిసెంబర్ 26వ, తేదీన ఖమ్మం నగరంలో జరిగే భారీ జనసభకు విరివిరిగా చందాలిచ్చి అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సబ్యులు ముత్యాల విశ్వనాథం పిలుపునిచ్చారు. మండల పరిధి పాండురంగాపురం గ్రామంలో గురువారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సంధర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ భారతదేశ గడ్డపై సిపిఐకి వందేండ్లన్నారు. దీనికి గుర్తుగా శతాబ్ది మగింపు ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తొలుత గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. బ్రిటీష్ పాలకుల కభంధ హస్తాల నుండి దేశాన్ని విముక్తి చేసేందుకు రాజీ లేని పోరాటం చేయటం వలనే ఆరోజుల్లో పార్టీపై నిషేధం విధించారని, నాయకులను కాన్పూర్, మీరట్, పెషావర్ తదితర కుట్ర కేసులు బనాయించి జైల్లో నిర్భంధించారన్నారు. వెట్టి చాకిరి విముక్తి కోసం ఆనాటి నుండి నేటి వరకు కార్మిక, ప్రజా, విద్యార్థి, యువజన, మహళా తదితర సంఘాలను నిర్మించి పోరాటాలు చేసిన సిపిఐకి చరిత్రలో తిరిగులేని స్థానం ఉందన్నారు. అనేక ప్రజా ఉద్యమాలను వందేండ్ల మహా ప్రస్థానంలో నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐ సొంతమన్నారు. ఏ పార్టీకి లేని చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదన్నారు. ప్రజా బలంతోనే వందేండ్లు మనగలిగామని మరో వందేండ్లయినా ఇదే ఉత్సాహంతో ప్రజల కోసం పోరాడుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పార్టీ నాయకులు ఎందరో నేలకొరిగారని అన్నారు. భుస్వాముల చెర నుండి లక్షలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంచిపెట్టిన ఘన చరితను లిఖించుకొన్న సిపిఐ వందేండ్ల ముగింపు ఉత్సవాలకు ప్రజలకు చందాలివ్వాలని కోరారు. మండల వ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికులు, రైతులు, రైతు కూలీలు, అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా హాజరై శతాబ్ది ఉత్సవాల ముగింపు భారీ జన సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, కార్యవర్గ సబ్యులు మన్నెం వెంకన్న, పెద్ద వెంకటరామయ్య, కోటి తిరుపతయ్య, వెంకటరత్నం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తుపాన్ బాధిత రైతులకు భరోసా ఇవ్వాలి

### నష్టంపై స్పందించని కేంద్ర, రాష్ట్రాలు
### సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**ప్రజాపక్షం/కారేపల్లి:** మొంథా తుఫాన్‌తో చేతికి వచ్చిన పంట తుడిచిపెట్టకపోయిందని, తుఫాన్ బాధిత రైతులకు కేంద్ర, రాష్ట్రాలు భరోసా కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో పంటలను జాన్ వెస్లీ నాయకత్వంలె సిపిఎం బృందం పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 10 జిల్లాలో తుఫాన్‌తో పంటలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. తుఫాన్‌తో వీచిన గాలులు, వర్షానికి పంట పొలాలు నీటితో మునగటం, నేలవారటం జరిగిందన్నారు. రాష్ట్రంలో తీతకు వచ్చిన పత్తి పంట చేనులోనే వర్షానికి తడిసి ముద్దైందన్నారు. రాష్ట్రంలో 30వేల ఎకరాలలో వరి పంటకు నష్టం వాటిల్లిందనారు. తుఫాన్‌తో రైతులు అతాలాకుతలం అవుతున్న కేంద్ర, రాష్ట్ర పాకులు నేటికి స్పందించకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టంపై విచారించి కేంద్రానికి నివేదిక పంపాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల విషయంలో తాత్సర్యం చేయకుండా వెంటనే ఎకరాకు రూ 50వేల పరిహారం ఇచ్చేలా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వర్షానికి తడిసి పంటలను మార్కెట్ రేటు ప్రకారం కొనుగోలు చేసి రైతు మనోధైర్యం చెయకుండా చూడాలన్నారు. తుఫాన్ నష్టంపై సరిగా స్పందించకుంటే బాధితులతో పాటు, రైతులను సమీకరించి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు అబ్బాస్, రమావత్ శ్రీరాంనాయక్, స్కైలాబ్ బాబు, ఎర్ర శ్రీనివాసరావు, మెరుగు రమణ, నవీన్‌రెడ్డి, మండల కార్యదర్శి కే నరేంద్ర, నాయకులు కరకపల్లి రాయమల్లు, రావూరి వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.



## నూతన పిర్‌సి నివేదికను వెంటనే ప్రకటించాలి

**ప్రజాపక్షం/కారేపల్లి:** తెలంగాణ రాష్ట్రంలోని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పిఆర్సి కమిటీ రిపోర్టును వెంటనే ప్రకటించి అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టిఎస్‌యుటిఎఫ్)రాష్ట్ర అధ్యక్షులు చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులైన జిపిఎఫ్ లోన్స్, పార్ట్ ఫైనల్స్, టిఎస్జిఎల్ఐ, సరెండర్ బిల్లులు, మెడికల్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, పర్యవేక్షణాధికారి పోస్టులైన డీఈవో, డిప్యూటీ డిఈవో, ఎంఈవో పోస్టులను వెంటనే మంజూరు చేసి ఖాళీలను భర్తీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, సింగరేణి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెవి కృష్ణారావు, భానోత్ మంగీలాల్, మండల కార్యదర్శి ఏటుకూరి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్య, వైద్యం, సామాజిక సేవా రంగాల అభివృద్ధికి కమ్మ మహాజన సంఘం ప్రాధాన్యతనిస్తుందని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లు రఘుసత్యనారాయణ, చావా రాము లు తెలిపారు. సమాజంలో ఉన్న సమస్యలను వెలుగులోకి తీసుకు రావడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని వారి సేవలకు సంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. గురువారం స్వర్ణ భారతి కమ్మ వారి కళ్యాణ మండపంలో జర్నలిస్టులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం చేపట్టిన సేవా కార్యక్రమాలు, విద్యార్థుల కోసం స్కాలర్‌షిప్‌లు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణం, ఆరోగ్య, రక్తదాన శిబిరాలు, నిరుపేదలకు ఆర్థిక సాయం వంటి కార్యక్రమాల గురించి వివరించారు.పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ మీడియా, సంఘాలు పరస్పర అవగాహనతో ముందుకు సాగితే సమాజానికి మేలు చేకూరుతుందన్నారు. జర్నలిస్టులకు సంఘం మద్దతునివ్వడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు కర్నాటి రమాదేవి, జాయింట్ సెక్రటరీ వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మలకుమారి, కార్యవర్గ సభ్యులు తుమ్మలపల్లి నాగేశ్వరరావు, మేదరమెట్ల స్వరూపరాణి, డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు, మోత్కూరి సత్యనారాయణ, నల్లమల ఆనంద్, నంబూరి సత్యనారాయణ ప్రసాద్, కోలేటి నవీన్, తాళ్లూరి మురళీకృష్ణ, బండి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## పెండింగ్ పనులను మంత్రి దృష్టికి తీసుకెళ్ళిన రాజేష్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** పెండింగ్‌లో ఉన్న పనులు, నూతన పనుల గురించి ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మురళీధర్‌ల ఆధ్వర్యంలో జరిగిన వరంగల్ తూర్పు నియోజకవర్గం అభివృద్ధి పనుల సమీక్ష సమావేశంలో శ్రీరాం రాజేష్ పాల్గొని 35వ డివిజన్‌కు సంబంధించిన పెండింగ్ పనులు, నూతన పనులు గురించి మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా మంత్రి స్పందించి పెండింగ్ పనులను క్లియర్ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పగడాల సతీష్, తదితరులు ఉన్నారు.

## నేడు ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించి నాటినుండి నేటి వరకు కార్మికుల హక్కుల కోసం అనునిత్యం ఉద్యమిస్తున్న ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా కార్మికులు జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి అజయ్ సారధి రెడ్డి, రేషపల్లి నవీన్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామని, వందలాదిమంది కార్మికులు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా వారు విజ్ఞప్తి చేస్తారు. స్వాతంత్రానికి ముందు ఆవిర్భవించి దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై అనునిత్యం పోరాటం చేస్తున్న ఏకైక కార్మిక సంఘం ఏఐటియుసి అని, కార్మికులకు భద్రత, కార్మిక సంక్షేమ బోర్డు, సంఘటిత, అసంఘటిత కార్మికుల హక్కుల కోసం యాజమానుల దగ్గర నిరంతరం పోరాడుతూ ఉద్యమిస్తూ కార్మికుల పక్షాన నిలుస్తున్న ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం జయప్రదం చేయాల్సిన బాధ్యత కార్మికులపై ఉందని వారన్నారు. 4 లేబర్ కోడ్‌లను రద్దుచేసి 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, కనీస వేతనం 26వేల రూపాయలు కార్మికులకు ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటియుసి చేస్తున్న పోరాటంలో చేతులు కలిపి సంఘ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. శుక్రవారం జరిగే ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని వందలాది మంది కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని అజయ్‌సారధిరెడ్డి, రేషపల్లి నవీన్ పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి: కలెక్టర్




**ప్రజాపక్షం/భూపాలపల్లి:** విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యా విధానాల్లో నాణ్యత పెంపుకు విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం కలెక్టర్ చాంబర్ లో మధ్యాహ్న భోజనం, ఆధార్ నమోదు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ముఖ గుర్తింపు హాజరు, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, ఆహార నాణ్యత తనిఖీలు, పిఎం శ్రీ పనులు పురోగతి, భవిత తదిరత కార్యక్రమాలపై విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, హాజరు, మధ్యాహ్న భోజన పథక అమలు, డిజిటల్ విద్య, ఫలితాల విశ్లేషణ వంటి అంశాలపై అధికారులు సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు క్రమం తప్పక పాఠశాలలు తనిఖీ చేయాలని అట్టి అంశాలపై నివేదికలు పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. యూ డైస్ నివేదిక ప్రకారం 26 బాలురు, 13 బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవని, అలాగే 24 బాలురు,14 బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉపయోగకరంగా లేవని ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. ఇట్టి పాఠశాలలకు ప్రతిపాదనలు ఇవ్వాలని గత సమావేశంలో చెప్పానని ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ రెండు రోజుల్లో నివేదికలు ఇవ్వాలని ఈడబ్ల్యూఐడిసి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్ చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఈఓ రాజేందర్, ఈడబ్ల్యూఐడిసి ఏఈ జీవన్, అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం



**ప్రజాపక్షం/ములుగు:** పోలీస్ అమరవీరుల సంస్మరణ సందర్భంగా ములుగు జిల్లా ఎస్పి డాక్టర్ శబరీష్ పి ఐపిఎస్ ఆదేశాల మేరకు గురువారం ములుగు డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ములుగు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పి డాక్టర్ శబరీష్ ఐపిఎస్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ రక్తదానం అనేది ప్రాణదానంతో సమానమని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను రక్షించడంలో రక్తదానం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. పోలీస్ అమవీరుల సంస్మరణోత్సవాల సందర్భంగా యువత, ప్రజలు, ఆటో డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది ఇలా సుమారు 500 మంది స్వచ్ఛందంగా రక్తదానంలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. అలాగే విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికి మరవదని, వారి స్మృతికి గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోలీసులు కేవలం శాంతి భద్రతల పరిరక్షకులే కాకుండా సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటారని తెలిపారు. రక్తదానంపై ఉన్న అపోహలను నమ్మకుండా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ రక్తదాన శిబిరంలో దాదాపు 180 యూనిట్ల రక్తం సేకరించబడింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి శివం ఉపాధ్యాయ ఐపిఎస్, ములుగు డిఎస్పి రవీందర్, సిఐలు దయాకర్, సురేష్, ఆర్ఐలు స్వామి, సంతోష్, వెంకట నారాయణ, ఎస్ఐలు, ములుగు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ అనూష, ఆసుపత్రి సిబ్బంది, వరంగల్, ములుగు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రైన్ నుండి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** ట్రైన్ నుండి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇప్పగూడరఘునాథపల్లి రైల్వే స్టేషన్ల మధ్యన రైలు పట్టాల పక్కన మృతిచెందిన గుర్తు తెలియని యువకుని శవం ఉందన్నారు. సికింద్రాబాద్ వైపు నుండి కాజీపేట వైపునకు వెళ్లే గుర్తు తెలియని రైలు బండినుండి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని జనగామ ప్రభుత్వ వైద్యశాల మార్చరీ నందు భద్రపరుచడం జరిగిందన్నారు. ఆచూకి తెలిసిన వారు 92478 00433 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

# వరద బాధితులకు ప్రభుత్వం అండ

### డ్రోన్ ద్వారా ఆహార పంపిణీ
### వరద ముంపు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించిన మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/వరంగల్:** వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉందని అధైర్య పడవద్దని రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మోంథా తుఫాను ప్రభావం తో కురిసిన భారీ వర్షానికి జలమయమైన ఎన్ఎన్‌నగర్, బిఆర్‌నగర్ ప్రాంతాల్లో మంత్రి లోక్ సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ డా.సత్య శారద తో కలిసి క్షేత్ర వరద ప్రాంతాలను సందర్శించి, బాధితులకు దైర్యం కలిగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తుఫాన్ వల్ల ఉమ్మడి జిల్లా వ్యాప్తం గా భారీ వర్షాలు కురిసాయని, నగర పరిధి లో లోతట్టు ప్రాంతాలు ఉండడం, కొన్ని ప్రాంతాలు కబ్జాకు గురి అవ్వడం, సరైన వెడల్పుతో నాలాలు ఉండకపోవడం ఇందుకు కారణమని, ఇకముందు ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాల వల్ల ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడవద్దని ఇందుకోసం ముఖ్యమంత్రి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని, వారి ఆదేశం మేరకు ముందుకు వెళ్తామని మంత్రి తెలిపారు. వరద ప్రభావం దృష్ట్యా గత రాత్రి నుండి జిల్లా కలెక్టర్ తో పాటు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చడానికి మన వద్ద అందుబాటు లో ఉన్న డిఆర్‌ఎఫ్ బృందాలకు తోడు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను కూడా పిలిపించడం జరిగిందన్నారు. ఆయా డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు కూడా రాత్రి నుండి వారి డివిజన్ లలో అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని, కాలనీల లోని వరద ప్రాంతాల్లో చికుక్కున్న వారిని పడవల సహాయం తో సురక్షిత ప్రాంతాలకు తరలించి ఆవాసం అందిస్తున్నామన్నారు. వరద వల్ల జరిగిన నష్టాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని, వరద వల్ల నిరాశ్రయులైన వారికి తాత్కాలికం గా వరంగల్ ప్రాంతం లో 9 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు సుమారు 700 మందిని తరలించినట్లు, వరద నీటి నుండి బయటకు వచ్చే పరిస్థితి లేని వారికి డ్రోన్ ల ద్వారా ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిసారి వరద ప్రభావానికి గురయ్యే ప్రాంతాల వాసులకు ఇందిరమ్మ ఇళ్లను అందించి, ఆ ప్రాంతాలను ఖాళీ చేయించేలా చూస్తామని, ప్రస్తుత పరిస్థితి నేపథ్యం లో రెండు రోజులు సెలవులు ప్రకటించామని, ప్రజలు కూడా అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని ముఖ్యమంత్రి తో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం ఉందని వరంగల్ లో వరద పరిస్థితులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని పునరావస కేంద్రాలలో ఆశ్రయం పొందుతున్న బాధితులకు పౌష్టికాహారం మంచినీటితో పాటు దుప్పట్లను కూడా అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ జిల్లా పరిధికి లో సగటున 25 సెం.మీ వర్షపాతం నమోదు కావడం జరిగిందని పర్వతగిరి, కల్లెడ ప్రాంతాలలో 37 సెం.మీ వర్షపాతం నమోదైందని, నెక్కొండలో 33 సెం.మీ వర్షం కురిసిందని పర్వతగిరి, నెక్కొండ, వర్ధన్నపేట, రాయపర్తి మండలాల్లో అత్యధికంగా వర్షం కురిసిందని, పర్వతగిరి లో కొన్ని చెరువులకు గండ్లు పడ్డాయని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడ్డాయని, ఎన్‌పిడిసిఎల్ నుండి సిఎండి పర్యవేక్షించి తగు చర్యలు తీసుకుంటున్నారన్నారు. రాయపర్తి మండలంలో కట్ట తెగడం వల్ల సుమారు 50 ఇళ్లు ప్రభావితం అయ్యాయని, పంట పొలాల్లోకి నీరు చేరడం జరిగిందని వరద నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యరాణి,కార్పొరేటర్ పల్లం పద్మ రవి, డిఎఓ అనురాధ, డిఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, సంబంధిత శాఖల అధికారులు తహసీల్దార్లు పాల్గొన్నారు.

## నష్టంపై క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తాం: ఎమ్మెల్యే దొంతి



**ప్రజాపక్షం/నర్సంపేట:** మోంథా తుఫాన్‌కు భీభత్సవం నర్సంపేట డివిజన్‌లోని నెక్కొండ, చెన్నారావుపేట మండలాల్లో ఎక్కువగా ఉందని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను వివిధ దశల్లో ఉండగా ఈ తుఫాన్ ప్రభావానికి తీవ్రంగా నష్టపోయారని, తక్షణమే నష్టంపై రెవెన్యూ, అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారుల సమక్షంలో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ప్రతి రైతులకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ తుఫాన్ ప్రభావం ఇంకా గ్రామాలను వీడలేదన్నారు. వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయన్నారు. నర్సంపేట డివిజన్‌లో వరి మొత్తం 60వేల నుండి 70వేల ఎకరాలకు వరకు నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా వేశారని, పూర్తి స్థాయిలో అంచనా వేసి తుది నివేదిక ప్రభుత్వాన్ని నివేదించాలని అధికారులను సూచించామని, త్వరలోనే గ్రామస్థాయిలో పంటల క్షేత్రస్థాయి సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. వరితోపాటు పత్తి, మిర్చి, మొక్కజొన్న ఇతర పంటలు సైతం దెబ్బతిన్నాయన్నారు. అదేవిధంగా లోలెవల్ కాజ్‌వేల నుండి వరద ఉధృతి ప్రమాదభరితంగా వెళ్తోందని, దీంతో రాకపోకలు స్థంభియన్నారు. తుపాన్ తగ్గినప్పటి వరద ఉధృతి మాత్రం సుమారు 13 గంటల నుండి 15గంటల వరకు మండలాల్లో కొనసాగిందన్నారు. పలు చోట్ల కాజ్‌వేలపై నీరు ఉధృతంగా ప్రవహిస్తోందన్నారు. గతంలో ఈకాజ్‌వేలపై బ్రిడ్జిలు నిర్మించాలని గతంలో 40కోట్లతోప్రతిపాధనలు పంపించడం జరిగిందని, వివిధ రోడ్ల కోసం రూ.300 కోట్ల ప్రతిపాధనలు పంపించడం జరిగిందన్నారు. నర్సంపేట మున్సిపాలిటి పరిధిలో రోడ్ల కోసం 25 కోట్ల పనులు మంజూరయ్యాయని, మరో 20 కోట్ల పనులను ప్రతిపాధనలు పంపించడం జరిగిందన్నారు. డివిజన్‌లో మొత్తం 20 ఇళ్లు వర్షానికి కూలాయని, 25గొర్రెల వరకు మృతిచెందాయని, ఇళ్లు కూలిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేసేలా కృషి చేస్తానన్నారు. అదేవిధంగా గొర్రెల మృతిచెందిన బాధితుడికి ఆర్థిక సహయం అందిచేలా కృషి చేస్తామన్నారు.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎంపి కడియం కావ్య

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** మొంథా తుఫాను ప్రభావంతో వరద నీటిలో మునిగిపోయిన హనుమకొండ గోపాలపురం, టీఎన్జీవోస్ కాలనీ తదితర లోతట్టు ప్రాంతాలను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య స్వయంగా పర్యటించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వరద ప్రభావిత ప్రాంతాల్లో నిరంతర పర్యటన నిర్వహిస్తూ పరిస్థితిని ప్రత్యక్షంగా ఎంపీ పరిశీలించారు.గోపాలపురం ప్రాంతంలో వరద ఉధృతి తీవ్రతను గమనించిన ఎంపీ వెంటనే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం టీఎన్జీవోఎస్ కాలనీలో ఎన్డీఆర్‌ఎఫ్ బృందంతో కలసి బోటులో ప్రయాణిస్తూ మొత్తం ప్రాంతాన్ని పరిశీలించారు. జల దిబ్బంధంలో ఉన్న ఇళ్ల వద్దకు స్వయంగా చేరుకుని, ప్రజలకు ధైర్యం చెబుతూ పాల ప్యాకెట్లు, త్రాగునీరు, ఆహార ప్యాకెట్లు అందజేశారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విన్న ఎంపీ, తాత్కాలిక ఉపశమనంతో పాటు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.అలాగే వరంగల్ లో బి ఆర్ నగర్ కాలనీ వరద ప్రభావిత ప్రాంతాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్వయంగా పర్యవేక్షించారు. అక్కడ డ్రోన్‌ల ద్వారా ఆహారం, తాగునీరు పంపిణీ జరుగుతున్న విధానాన్ని మంత్రి కొండ సురేఖ, కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి పరిశీలించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రజలకు ధైర్యం చెప్పారు. ప్రతి కుటుంబానికి సహాయం వేగంగా చేరేలా అధికారులకు సూచనలు చేశారు. సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతాయని ఎంపీ భరోసా ఇచ్చారు.

## వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/హనుమకొండ :** భారీ వర్షం కారణంగా వరద ఉధృతి పెరగడంతో నగరంలోని పలు కాలనీలు జలమయం కాగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాలలో సహాయక చర్యలను గురించి విధుల్లో ఉన్న అధికారులతో ఆయా కాలనీల పరిస్థితులను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద తీవ్రత అధికంగా ఉన్న కాలనీల్లో తాజా స్థితిగతులను అడిగి తెలుసుకుని రెవెన్యూ, పోలీస్, ఎస్డిఆర్‌ఎఫ్, ఎన్డిఆర్‌ఎఫ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ డిఆర్‌ఎఫ్ బృందాలు అందిస్తున్న సహాయక చర్యలను పరిశీలించారు. గోపాలపూర్ ఊర చెరువు తో పాటు ప్రగతి నగర్, వివేక్ నగర్, అమరావతి నగర్, 100 ఫీట్ల రోడ్డు, సమ్మయ్య నగర్ ప్రాంతాలను కలెక్టర్ సందర్శించి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. అక్కడ నుండి హంటర్ రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్ ప్రాంతంలో నివసిస్తున్న ఒక కుటుంబం వరదలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమాచారం రావడంతో కలెక్టర్ క్షేత్రస్థాయిలో ఆ ప్రదేశానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని సహాయక చర్యల్లో పాల్గొంటున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయంతో బోటులో బయటకు తీసుకువచ్చి పునరావాస కేంద్రానికి ఆకుటుంబాన్ని తరలించారు. సీఎస్ఆర్ గార్డెన్ సమీపంలో వరద ముంపు తీవ్రంగా ఉండడంతో అక్కడ ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలకు చెందిన 470 మంది విద్యార్థినులను సురక్షితంగా బయటకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించగా డిఆర్‌ఎఫ్ సిబ్బంది లైఫ్ బోట్ల ద్వారా హాస్టల్ నుండి బయటకు తీసుకువచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల ద్వారా హసన్పర్తి లోని డిగ్రీ కళాశాలకు, సుబ్బయ్య పల్లిలోని కళాశాలకు, మడికొండ లోనిబాలికల కళాశాలకు తరలించారు. ఈ సందర్భంగా హనుమకొండ, కాజీపేట తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, భావు సింగ్, సూపరింటెండెంట్ జగత్ సింగ్, కిరణ్ కుమార్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సీఎంహెచ్వో డాక్టర్ రాజా రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ శ్యాం కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

### భరోసానిచ్చిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/తొర్రూరు:** మోంథా తుపానుతో భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను, ప్రజలను ఆదుకుంటామని పాలకుర్తి నియోజకవర్గ ఎ మ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మోంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురియడంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడటాన్ని గమనించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అధికారులతో కలిసి గురువారం మండలంలోని గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న కల్వర్టులు, పంటలు, చెరువులను, వాగులను పరిశీలించారు. మండలంలోని అమ్మాపురం, గుర్తూరు గ్రామాల్లో చెరువులు నిండటంతో తొర్రూరు నుంచి నర్సంపేటకు వెళ్లే రహదారిలో ఉన్న కల్వర్టులపై నుంచి వర్షపు నీరు వెళ్లడంతో బుధవారం రాత్రి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి గ్రామాలకు చేరుకొని పరిస్థితిని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు, రైతులు అత్యవసర సమయంలోనే బయటకు వెళ్లాలని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు, రైతులకు ఎమ్మెల్యే భరోసానిచ్చారు. ఎమ్మెల్యే వెంట పలు శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

## వర్షానికి కూలిపోయిన ఇల్లు



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** మండలంలోని కళ్లెం గ్రామానికి చెందిన, లక్ష్మీనారాయణ ఇల్లు, బుధవారం రోజున వర్షానికి, ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేరు. ఎటువంటి ప్రమాదం జరగలేదు. కౌడ లక్ష్మీనారాయణ, అనారోగ్య కారణంగా, హైదరాబాదులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వం నుండి, ఆర్థిక సాయం అందజేసి, మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరీ య్యేలా అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని వారు కోరారు.

# రైతులకు కన్నీళ్లు మిగిల్చిన మొంథా తుఫాన్




**ప్రజాపక్షం/ములుగు:** గత రెండు రోజులుగా కురస్తున్న మొంథా తుఫాన్ ప్రభావంతో రైతులకు కన్నీళ్లే మిగిలాయి. జిల్లా వ్యాప్తంగా వర్షాలు భారీగా కురవడంతో చేతికొచ్చిన పంటలు నెలపాలయ్యాయి. దేశానికే రైతు వెన్నుముక కానీ వర్షాల వలన రైతులకు పెట్టిన పెట్టుబడి రాదని నిండా ముంచిందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.20వేల నుండి రూ.30వేల వరకు వరి పంటకు పెట్టుబడి పెట్టిన రైతులకు కనీసం కోత ఖర్చులు కూడా రాని దుస్థితి నెలకొంది. వర్షాలతో వరి ధాన్యం నెలపాలయ్యిందని, పత్తి పంటలు పూర్తిగా ఎర్రబడి చనిపోయాయని, ప్రభుత్వం ఆదుకుంటేనే తాము బతకగలుగుతామని రైతులు అంటున్నారు.

### కేసముద్రంలో

**మొంథా తుఫాన్ వరద ప్రభావానికి తెగిన రోడ్లు, నీట మునిగిన పంట పొలాలు**

**కేసముద్రంలో:**బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కేసముద్రం మండలంలోని చెరువులు, కుంటలు అలుగులు మించి ప్రవహించాయి. మండలంలోని వెంకటగిరి గ్రామ చెరువు భారీ వర్షాలకు పైనుండి వస్తున్న వరద ప్రభావానికి అలుగు పోస్తుంది. అధిక వేగంతో వస్తున్న వరద ప్రవాహానికి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా తెగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. అంతే కాకుండా పంట పొలాలు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. కేసముద్రం నుండి నెక్కొండ వరకు వెళ్లే ప్రధాన రహదారి నూతనంగా నిర్మించి సంవత్సరం కాకముందే నాణ్యత లేని రోడ్డు నిర్మాణంతో కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అయినట్లేనని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఆరుగాలం కష్టించి ఎన్నో వ్యయ ప్రయాసలతో పండించిన పంట చేతికందే సమయానికి భారీ వరదలకు చేతికందకుండా పోయిందని రైతులు తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. ప్రభుత్వం, అధికారులు, ప్రజా ప్రతినిధులు త్వరగా స్పందించి వరదలకు నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఆదుకోవాలని కోరారు.



### తొర్రూరులో

**మొంథా తుపాన్‌తో దెబ్బతిన్న పంటలు**

**తొర్రూరు :** మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో పంటలు దెబ్బతినడంతో పాటు పంట పొలాలు నీట మునిగిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాలు, తండాల్లోని వరి పైరు నేలవాలడంతో పాటు నీట మునిగాయి. వర్షానికి కోతకొచ్చిన వరి పంటలు నేలమట్టమయ్యాయి. కల్లాల్లో ఉన్న వరి ధాన్యం మొత్తం నీటిపాలు కాగా అపారనష్టం వాటిల్లింది. కోతకు వచ్చిన వరిని మిషన్ల సాయంతో కోసే సమయంలో తుపాను ప్రభావంతో ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. చేతికొచ్చే సయంలో పంట నీళ్లపాలు కావడంతో రైతులు దిగులు చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు ప్రకృతి వైపరిత్యం కారణంగా నీటిపాలు కాగా రైతులకు కోలుకోలేని విధంగా నష్టాన్ని కలిగించింది. అమ్మాపురం, పెద్దమంగ్యా తండా గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో రైతులు నీట మునిగిన వరి పొలాలను చూపిస్తూ కన్నీటిపర్యంతమవుతున్నారు. పంట నష్టపోవడంతో ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



### ధర్మసాగర్‌లో

**మొంతా తుఫాన్‌తో నేల వాలిన వరి పంట**

**ధర్మసాగర్:** హనుమకోండ జిల్లా ధర్మసాగర్ మండలములో మొంతా తుఫాన్‌తో నేల వాలిన వరి, పత్తి తదితర పంటలు తీవ్రంగా నేలమట్టమవగా రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారుమండలములోని .దేవూనూర్,ధర్మసాగర్,ముప్పరం,పెద్దపెండ్యాల,ఎల్కుర్తి గ్రామలతో పాటు మండలములోని అన్ని గ్రాల్లో నష్టం జరిగింది ప్రభుత్వం వేటనే రైతులను ఆదుకోవాని మండల రైతులు డిమాండ్ చేస్తున్నారు.



# రీల్

## నవంబర్ 1, 2 తేదీల్లో సినిమాటికా ఎక్స్ పో

### సినిమాటోగ్రాఫర్ పి.జి. విందా



హైదరాబాద్ హైటెక్ సిటీలోని నోవొటెల్ లో నవంబర్ 1, 2 తేదీలలో జరిగే ఈ సినిమాటికా ఎక్స్పో 2025 ద్వారా ప్రపంచ సినిమా దిశగా మన అడుగులు వేస్తున్నాం. తెలుగు సినీ పరిశ్రమకు గర్వకారణమైన ఈ ఎక్స్పోను 'సినిక క్రియేటర్స్ కౌన్సిల్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, తెలంగాణ ప్రభుత్వ మద్దతుతో, IndiaJoy సహకారంతో నిర్వహిస్తున్నాము. ఈ 3వ ఎడిషన్లో ఫ్యుజిఫిల్మ్ వంటి ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్లు పాల్గొంటున్నాయి. సినిమాటోగ్రఫీ, వి ఎఫ్ ఎక్స్ , వర్చువల్ ప్రొడక్షన్, ఏ ఐ ఫిల్మ్ మేకింగ్ వంటి ఆధునిక సాంకేతికతలపై మాస్టర్ క్లాసులు, వర్క్‌షాపులు మరియు నెట్వర్కింగ్ సెషన్లు జరుగనున్నాయి. ఈ సంవత్సరం మా థీమ్ భారతీయ సినిమాను గ్లోబల్ వేదికపై నిలబెట్టే మా దృక్పథం. 2023లో ఇండియాలో తొలిసారి ఫిల్మిటిక్ ఎక్స్పోగా సినిమాటికా గుర్తింపు పొందిందని ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పీ జీ విందా చెప్పారు. 2024లో వర్చువల్ ప్రొడక్షన్, ఏఐ టెక్నాలజీ పరిచయం చేసి కొత్త దిశలో అడుగేసింది. 2025లో మన గౌరవనీయ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి పిలుపు మేరకు హాలీవుడ్ టు హైదరాబాద్ కాన్సెప్ట్ తో భారతీయ సినిమాను అంతర్జాతీయ స్థాయిలోకి తీసుకెళ్లే కొత్త మైలురాయిగా ఈ ఎడిషన్ నిలుస్తుంది. సినిమా, టెక్నాలజీ, ఆర్ట్, మరియు కల్చర్లను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, భారత సినిమా పరిశ్రమలో సాంకేతిక విప్లవానికి మార్గదర్శకంగా నిలవడం మా లక్ష్యం. మన దేశం ఇది మన సినిమా భవిష్యత్తు కోసం మన సమిష్టి కృషి అవసరం. హైదరాబాద్ నుంచి హాలీవుడ్ దాకా, మన సృజనాత్మకతకు గ్లోబల్ వేదికగా నిలిచే ఈ ప్రయాణంలో ప్రతి సినీ ప్రొఫెషనల్, ప్రతి టెక్నీషియన్ భాగస్వామి కావాలి అని ఆయన కోరారు.

## 'ప్రేమిస్తున్నా' ట్రైలర్ రిలీజ్ చేసిన వెంకీ



వరలక్ష్మి పప్పుల ప్రజెన్స్‌లో కనకదుర్గా రావు పప్పుల నిర్మాతగా భాను దర్శకత్వంలో సరికొత్త ప్రేమకథతో రాబోతున్న సినిమా ప్రేమిస్తున్నా. సాత్విక్ వర్మ, ప్రీతి నేహా హీరో హీరోయిన్లుగా నటించారు. పోస్ట్ ప్రొడక్షన్స్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ప్రేమిస్తున్నా సినిమా నవంబర్ 7న థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకీ అట్లూరి మాట్లాడుతూ... 'ప్రేమిస్తున్నా ట్రైలర్ బాగుంది, నవంబర్ 7న విడుదల కాబోతున్న ఈ సినిమా సక్సెస్ అవ్వాలని సాత్విక్ వర్మ, ప్రీతి నేహాకు మంచి పేరు రావాలని, దర్శకుడు భను కు నిర్మాత కనకదుర్గారావు గారికి బెస్ట్ విషెస్ తెలుపుతున్నాను అన్నారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా సాంగ్స్‌కు మంచి రెస్పాన్స్ లభించింది, అలాగే ట్రైలర్ యూట్యూబ్ లో మిలియన్ వ్యూస్ తో ప్రేక్షకాధారణ పొందింది. శ్యామల ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ అందించారు, అనిల్ కుమార్ అచ్చు గట్ల ఈ సినిమాకు సంభాషణలు రాయడం జరిగింది, ఈ సినిమాకు నిర్వహణ మర్రి రవికుమార్, ఎడిటర్ శిరీష్ ప్రసాద్.

## వైవిధ్యమైన కథతో '12ఏ రైల్వే కాలనీ'




అల్లరి నరేష్ నటించిన యూనిక్ థ్రిల్లర్ '12A రైల్వే కాలనీ' ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకుంది. పొలిమేర, పొలిమేర 2 చిత్రాలతో గుర్తింపు తెచుకున్న డాక్టర్ అనిల్ విశ్వనాథ్ ఈ చిత్రానికి షోరన్నర్గా వ్యవహరిస్తూనే కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందిస్తున్నారు. ప్రతిష్టాత్మక శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్పై పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రంలో నాని కాసరగడ్డ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆయనే ఎడిటర్. 12ఏ రైల్వే కాలనీ నవంబర్ 21న ప్రపంచవ్యాప్తంగా బిగ్ స్క్రీన్లలోకి రానుంది. రిలీజ్ డేట్ పోస్టర్లో అల్లరి నరేష్ ఎనర్జిటిక్ డ్యాన్స్ ఫోజ్ లో డ్యాన్సర్స్ గ్రూప్‌తో కలిసి కనిపిస్తున్నారు. మేకర్స్ విడుదల చేసిన స్పెషల్ వీడియో ఆకట్టుకుంది.అల్లరి నరేష్ ఈ చిత్రంలో డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రను పోషిస్తున్నారు. పొలిమేర సిరీస్లో ఆకట్టుకున్న డాక్టర్ కామాక్షి భాస్కర్ల ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. సాయి కుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం, జీవన్ కుమార్, గగన్ విహారి, అనిష్ కురువిల్లా, మధుమణి కీలక పాత్రలు పోషించారు.కుశేంద్ర రమేష్ రెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.అల్లరి నరేష్, డాక్టర్ కామాక్షి భాస్కర్ల, సాయి కుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం, జీవన్ కుమార్, గగన్ విహారి, అనిష్ కురువిల్లా, మధుమణి నటిస్తున్నారు.

## ఆ క్యారెక్టర్‌ను సందీప్ రెడ్డి రిజెక్ట్
## 'ది గర్ల్ ఫ్రెండ్' - దర్శకులు రాహుల్ రవీంద్రన్



రశ్మిక మందన్న, హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. ఈ సినిమా నవంబర్ 7న హిందీతో పాటు తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు రాహుల్ రవీంద్రన్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నేను కాలేజ్ లో ఉన్నప్పుడు చూసిన ఒక ఇన్సిడెంట్ ఆధారంగా 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా కథ రాశాను. అప్పట్లో వచ్చిన ఓ పాట కూడా నన్ను ఈ కథ రాసేందుకు ఇన్స్ పైర్ చేసింది. ఇలా టైమ్ ఉన్నప్పుడు కొన్ని స్క్రిప్ట్స్ చేసుకున్నాను. ఆహా వాళ్లు మాకొక ప్రాజెక్ట్ చేయండి అని అడిగారు. వారికి 'ది గర్ల్ ఫ్రెండ్' కథ పంపాను. నేను, రశ్మిక, గీతా ఆరట్స్ కాంబినేషన్ లో ఒక సినిమా చేయాల్సి ఉండేది. 'ది గర్ల్ ఫ్రెండ్' కథను అల్లు అరవింద్ చదివి దీంట్లో సినిమాకు కావాల్సిన కంటెంట్ ఉంది. ఓటీటీకి వద్దు సినిమానే చేద్దామని అన్నారు. రశ్మిక, మా కాంబోలో ముందు అనుకున్న కథ పక్కనపెట్టి ఈ కథనే సినిమాగా మొదలుపెట్టాం.రశ్మికకు స్క్రిప్ట్ పంపినప్పుడు చదివి చెప్తానంది. రెండు రోజుల్లోనే స్క్రిప్ట్ మొత్తం కంప్లీట్ గా చదివి కాల్ చేసింది. ఈ మూవీ మనం వెంటనే చేస్తున్నాం, ఇలాంటి కథ ఆడియెన్స్ కు చెప్పాలి, ఒక అమ్మాయిగా నేను ఈ కథకు చాలా కనెక్ట్ అయ్యాను, బయట ఉన్న అమ్మాయిలు అందరికీ నేను ఇచ్చే బిగ్ హగ్ ఈ సినిమా అని చెప్పింది. నేను ఏ కథ రాసినా నా స్నేహితులు సమంత, వెన్నెల కిషోర్, అడివి శేష్, డైరెక్టర్ సుజీత్..ఇలా కొంతమందికి పంపిస్తుంటా. అలా 'ది గర్ల్ ఫ్రెండ్' కథ కూడా పంపాను. సమంత ఈ స్క్రిప్ట్ చదివాక, నేను కాదు మరొక హీరోయిన్ అయితేనే ఈ మూవీకి బాగుంటారని సజెషన్ ఇచ్చింది.ఒక జంట లైఫ్ లో ఇలా జరిగింది అనేది నాకు తెలిసిన పద్ధతిలో చూపించాను. అంతే కానీ ఎలాంటి సందేశాలు, నీతులు చెప్పలేదు. సినిమా చూసి ఆడియెన్స్ ఆలోచించుకుంటారనే నమ్మకం ఉంది. నేను ఇవాళ మంచిది అనుకున్నది ఐదేళ్ల తర్వాత కరెక్ట్ కాదు అని నాకే అనిపించవచ్చు. అందుకే ఎవరికీ మెసేజ్ లు ఇచ్చే ధైర్యం చేయను. ఇంటెన్స్ ఎమోషన్ ఉన్న లవ్ స్టోరీని రియలిస్టిక్ అప్రోచ్ లో చేశాం. 'ది గర్ల్ ఫ్రెండ్' మూవీ లోని విక్రమ్ క్యారెక్టర్ కోసం సెర్చ్ చేశాను. ఈ అబ్బాయి కాలేజ్ లో అడుగుపెట్టగానే చాలామంది అమ్మాయిలు ఇష్టపడతారు అనేలా కనిపించాలి అనుకున్నా. దసరా సినిమా ప్రమోషనల్ ఇంటర్వ్యూలో దీక్షిత్ ను చూసి ఇతను విక్రమ్ క్యారెక్టర్ కు బాగుంటాడు అనిపించింది. మూవీలో హీరో హీరోయిన్స్ పీజీ స్టూడెంట్స్. ఒక లెక్చరర్ రోల్ ఉంది. ఆ క్యారెక్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా చేస్తే బాగుంటుంది అనిపించింది. ఆయనను అప్రోచ్ అయితే వద్దు, నన్ను స్క్రీన్ మీద చూడగానే ఆడియెన్స్ నవ్వుతారు అని రిజెక్ట్ చేశారు. చివరకు ఆ రోల్ నేనే చేయాల్సివచ్చింది. అనూ ఇమ్మాన్యుయేల్ కూడా తన క్యారెక్టర్ కు పర్ఫెక్ట్ గా సెట్ అయ్యింది. హేషమ్ అబ్దుల్ వాహబ్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. నెక్స్ట్ నేను డైరెక్ట్ చేయబోయో రెండు ప్రాజెక్ట్స్ ఓకే అయ్యాయి. వాటి వివరాలు త్వరలో తెలియజేస్తాను. ఈ రెండు సినిమాల తర్వాత రశ్మిక నేను కలిసి మరో సినిమా చేయబోతున్నాం. ఆ కథ లైన్ గా రశ్మికకు నచ్చింది. ఇంకా స్క్రిప్ట్ చేయాల్సి ఉంది. మా కాంబోలో ఆ మూవీ వస్తుంది.

## నవంబర్ 6న 'వృషభ' విడుదల
## మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్



నటించిన పాన్ ఇండియన్ మూవీ 'వృషభ'లో హీరోగా నటిస్తున్నారు. కన్నెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిల్మ్స్, అభిషేక్ ఎస్ వ్యాస్ స్టూడియోస్ బ్యానర్లపై 'వృషభ' చిత్రాన్ని శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, సి.కె. పద్మ కుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్ వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జూహి పరేఖ్ మెహతా నిర్మిస్తున్నారు. హిస్టారికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోన్న 'వృషభ' సినిమాకు నంద కిషోర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ప్రెస్టీజియస్ మూవీని నవంబర్ 6న ఈ సినిమా విడుదల చేస్తున్నారు.
నిర్మాత ఏక్తా కపూర్ మాట్లాడుతూ "ఎంతో ప్రతిష్టాత్మకంగా, భారీగా రూపొందిస్తోన్న 'వృషభ' సినిమాను నవంబర్ 6న విడుదల చేస్తున్నామని తెలియజేయటానికి సంతోషిస్తున్నాం. ఇది నా హృదయానికి ఎంతో దగ్గరైన కథ. బలమైన భావోద్వేగాలు, లార్జర్ దేన్ లైఫ్ డ్రామాతో ఇండియన్ సినిమాను గొప్పగా ఆవిష్కరిస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ ఎక్స్పీరియెన్స్ను అందించటానికి సిద్ధంగా ఉన్నాం" అన్నారు. మోహన్ లాల్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న ఈ చిత్రంలో సమర్జిత్ లంకేష్, రాగిణి ద్వివేది, నయన సారిక తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. సామ్ సి.ఎస్ సంగీతం అందించిన ఈ చిత్రానికి రసూల్ పూకుట్టి సౌండ్ డిజైన్ చేశారు. ఎస్.ఆర్.కె, జనార్ధన మహర్షి, కార్తీక డైలాగ్స్ రాసిన ఈ చిత్రానికి పీటర్ హెయిన్స్, స్టంట్ సిల్వ, నిఖిల్ యాక్షన్ కొరియోగ్రఫీ చేశారు.

## మార్చి 19న 'టాక్సిక్' విడుదల



రాకింగ్ స్టార్ యశ్ హీరో గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్ అప్స్'. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ, యశ్ సంయుక్తంగా ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఇప్పటికే 'టాక్సిక్' మీద భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాని హాలీవుడ్ స్థాయికి ధీటుగా తెరకెక్కిస్తున్నారు. అయితే ఈ సినిమా రిలీజ్ వాయిదా పడనుందంటూ పుకార్లు వచ్చిన నేపథ్యంలో ఫిల్మ్ క్రిటిక్ తరరణ్ ఆదర్శ్ నిర్మాతలను సంప్రదించి విడుదల తేదీపై క్లారిటీ తీసుకున్నారు. 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' సినిమా రిలీజ్ డ్పే వచ్చిన రూమర్స్‌కి చెక్ పెట్టారు. సినిమా రిలీజ్ డేట్లో ఎలాంటి మార్పు లేదని నిర్మాతలు ప్రకటించినట్లే మార్చి 19, 2026కే విడుదలవుతుందని ప్రకటించారు. ఏప్రిల్ నెల నుంచి పోస్ట్ ప్రొడక్షన్లో భాగంగా విఎఫ్ఎక్స్ పనులు ప్రారంభమయ్యాయి. మరో వైపు యష్ ముంబైలో రామాయణ సినిమా షూటింగ్ను స్టార్ట్ చేశారు. టాక్సిక్ సినిమాకు సంబంధించిన ప్రమోషనల్ వర్క్ వచ్చే ఏడాది జనవరి నుంచి ప్రారంభమవుతుంద'ని తెలియజేశారు. ఇంకా 140 రోజులు మాత్రమే ఉన్నాయని తెలియజేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. టాక్సిక్ మూవీ మార్చి 19, 2026లో విడుదలవుతుందని పేర్కొంది. కెజియఫ్ వంటి సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ తర్వాత యష్ నటిస్తోన్న సినిమా 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' . గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమా ఇంగ్లీష్, కన్నడలో తెరకెక్కుతోంది. దీన్ని హిందీ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై వెంకట్ కె. నారాయణ, యష్ సంయుక్తంగా నిర్మిస్తోన్న టాక్సిక్: ఎ ఫెయిరీ ఫర్ గ్రోన్‌అప్స్, దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా ఒకేసారి విడుదలవుతూ ఈ పండుగ సీజన్ను మరింత ఉత్సాహభరితంగా మార్చేందుకు సిద్ధమవుతోంది.

## అద్భుత విజయం
(మొదటి పేజీ తరువాయి)

జరిగిన చర్చల తర్వాత ట్రంప్ సానుకూల ధోరణి ప్రదర్శించినా, ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య ఉద్రిక్తతలు పూర్తిగా తొలగిపోయాయని చెప్పలేమని పరిశీలకులు అంటున్నారు పిటిఐ కథనం ప్రకార,. ఇరుదేశాలు తయారీ రంగంలో ఆధిపత్యం కోసం, కృత్రిమ మేధస్సు వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో ఆధిక్యం సాధించడానికి, రష్యా–ఉక్రేన్ యుద్ధం వంటి ప్రపంచ వ్యవహారాలలో ప్రభావం చూపడానికి పోటీ పడుతున్నాయి. రెండోసారి వైట్ హౌస్ లోకి తిరిగి వచ్చిన తర్వాత ట్రంప్ విధించిన కఠిన సుంకాలు, వాటికి ప్రతిగా చైనా అరుదైన భూలోహాల ఎగుమతిపై విధించిన పరిమితులు, ఈ సమావేశానికి అత్యవసరతను తెచ్చాయి. ఇరుపక్షాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రమాదంలోకి నెడే స్థాయిలో విరోధం వద్దన్న అవగాహనలో ఉన్నట్లు కనిపిస్తోంది. కాగా, సమావేశం ప్రారంభంలో జిన్‌పింగ్ ముందుగానే సిద్ధం చేసుకున్న ప్రసంగాన్ని చదివారు. 'మన దేశ పరిస్థితులు భిన్నమైనందున ప్రతి విషయంలో ఏకాభిప్రాయం ఉండకపోవచ్చు. ప్రపంచంలోని రెండు ప్రధాన ఆర్థిక వ్యవస్థలు అప్పుడప్పుడు విభేదించడం సహజం' అని అనువాదకుడి ద్వారా జిన్‌పింగ్ తెలిపారు. ఆసియాపసిఫిక్ ఎకనామిక్ కోఆపరేషన్ సదస్సు ప్రధాన వేదిక గ్యోంగ్జు నగరానికి 76 కి.మీ దక్షిణంగా ఉన్న దక్షిణ కొరియా పోర్ట్ సిటీ బుసాన్‌లో జరిగిన ట్రంప్, జిన్‌పింగ్ భేటీపై చైనా ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. ట్రంప్ చైనా వస్తువులపై అదనంగా 100 శాతం దిగుమతి పన్ను విధిస్తానని ఇటీవల చేసిన హెచ్చరికను అమలు చేయబోవడం లేదని సమావేశానికి ముందు అమెరికా అధికారులు సూచన ప్రాయంగా తెలిపారు. చైనా కూడా అరుదైన భూలోహాల ఎగుమతిపై పరిమితులను సడలించడమే కాకుండా అమెరికన్ సోయాబీన్లను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందన్న సంకేతాలు ఇచ్చింది. దీనితో అగ్ర నేతల మధ్య భేటీలో చర్చలు ఫలవంతమయ్యాయని అంటున్నారు.

## బీమా తిరస్కరించొద్దు
(మొదటి పేజీ తరువాయి)

వెలుపల జరిగిందని, అందువల్ల, బీమా పాలసీ పరిధికి వెలుపల ఉంది కాబట్టి బాధితుడికి లేదా బాధితుడిపై ఆధారపడినవారికి పరిహారాన్ని తిరస్కరించడం న్యాయ భావనకు అభ్యంతరకరంగా ఉంటుందని, ఎందుకంటే ప్రమాదం అతడి తప్పు లేకుండానే జరిగింది కాబట్టి అప్పుడు బీమా కంపెనీ కచ్చితంగా చెల్లించాల్సి ఉంటుంది' అని ధర్మాసనం పేర్కొంది. వాహన యజమాని, బీమా సంస్థ అయిన 'ది న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్' దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేస్తూ సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. 2014 అక్టోబరు 7న ఒ మోటార్ సైకిల్ నడుపుతున్న వ్యక్తిని అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపిన వాహనం ఢీకొట్టింది. ఫలితంగా అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మోటారు ప్రమాద క్లెయిమ్స్ ట్రిబ్యునల్ వడ్డీతో సహా రూ.18.86లక్షల పరిహారంగా చెల్లించాలని తీర్పు ఇచ్చింది. పరిహారం చెల్లించిన మొత్తంతో బాధపడుతున్న పిటిషనర్, ట్రిబ్యునల్ పరిహారాన్ని సరిగ్గా లెక్కించలేదని కర్ణాటక హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. బీమా సంస్థ పాలసీలో పేర్కొన్న షరతులను బీమాదారుడు ఉల్లంఘించారన్న కారణంపై బీమా కంపెనీ కూడా ట్రిబ్యునల్ ఆదేశాన్ని సవాల్‌చేసింది. ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును నెరవేర్చాలని బీమా కంపెనీని హైకోర్టు ఆదేశించింది. యజమాని నుండి ఆ మొత్తాన్ని తిరిగి పొందే హక్కును మంజూరు చేసింది. ముందుగా పరిహారం చెల్లించి, తర్వాత యజమాని నుండి రికవరీ చేయాలనే హైకోర్టు ఆదేశాన్ని బీమా సంస్థ సవాల్ చేయగా, యజమాని తన నుండి రికవరీకి అనుమతిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని సవాల్ చేశాడు.

## నిందితుడు హతం
(మొదటి పేజీ తరువాయి)

తరలించగా చికిత్స పొందుతూ చనిపోయినట్లు సమాచారం. ముంబయి పవయీ ప్రాంతంలోని ఆర్‌ఎ యాక్టింగ్ స్టూడియోలో రోహిత్ ఆర్య అనే వ్యక్తి గత నాలుగైదు రోజులుగా ఆడిషన్స్‌ను నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం 8–14 ఏళ్ల వయసులోపు ఉన్న 100 మంది చిన్నారులు స్టూడియోకు వచ్చారు. కొంత సమయం తర్వాత చిన్నారులను బయటకు పంపించిన రోహిత్.. కొంత మందిని మాత్రం బంధించాడు. దీంతో భయాందోళనలకు గురైన పిల్లలు స్టూడియో కిటికీల నుంచి సాయం కోసం అరిచారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమివ్వడంతో రంగంలోకి దిగి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. నిందితుడికి సర్దిచెప్పేందుకు పోలీసులు ప్రయత్నాలు చేసినప్పటికీ వారిని విడిచి పెట్టేందుకు అతడు నిరాకరించాడు. చిన్నారులకు హాని కలిగిస్తానని బెదిరించడంతో అప్రమత్తమైన రెస్క్యూ బృందం.. బాత్‌రూమ్ ద్వారా లోనికి ప్రవేశించి 17 మంది చిన్నారులు సహా 19 మందిని సురక్షితంగా రక్షించింది. ఆ సమయంలోనే నిందితుడు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలం నుంచి ఎయిర్‌గన్, కొన్ని రసాయనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అంతకుముందు ఓ ఆడియో విడుదల చేసిన నిందితుడు.. తన పేరు రోహిత్ అని, ఆత్మహత్యకు బదులు చిన్నారులను నిర్బంధించాలనే ప్లాన్ రచించినట్లు వెల్లడించాడు. తనకు డబ్బులు వద్దని, కొంతమందితో మాట్లాడాలని, వారి నుంచి కొన్ని సమాధానాలు తెలుసుకోవాలని పేర్కొన్నాడు.

## ఢిల్లీలో భారత్ ఇంటర్నేషనల్ రైస్ కాన్ఫరెన్స్

### ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన తెలంగాణ స్టాల్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** న్యూఢిల్లీలో నిర్వహిస్తున్నభారత్ ఇంటర్నేషనల్ రైస్ కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ బియ్యం ఎగుమతి సామర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసే ఉద్దేశంతో ఈ కాన్ఫరెన్స్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కలిసి ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు ఆహార, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వివరించారు. ఈ కాన్ఫరెన్స్ వచ్చిన వివిధ దేశాల ప్రతినిధుల దృష్టిని తెలంగాణ స్టాల్ ఆకర్షించిందన్నారు. కువైట్, ఆఫ్రికా దేశాల ప్రతినిధి.. ఎన్‌సిఈఎల్ ఎండి ఉనుపోమ్ కౌసిక్, ఇండియన్ రైస్ ఎక్స్‌పోర్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ప్రేమ్ గార్గ్, దేశ వ్యాప్తంగా ఉన్న అనేక మంది ప్రముఖ బియ్యం ఎగుమతిదారులు తెలంగాణ స్టాల్‌ను సందర్శించారని తెలిపారు. ఎంటియూ 1010, ఆర్‌ఎన్‌ఆర్ 15048, బిపిటి 5204, కెఎన్‌ఎం 1638, కెఎన్‌ఎం 118 జై శ్రీరామ్, హెచ్‌ఎంటీ సోనా, చిట్టిముత్యాలు వంటి ప్రీమియం రకాల బియ్యాన్ని తెలంగాణ స్టాల్‌లో ప్రదర్శించినట్లు స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. రాష్ట్రంలో పండించే బియ్యాన్ని ఇప్పటికే పిలిప్పిన్స్‌కు ఎగుమతి చేస్తున్నామని, అలాగే మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేసేలా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. బియ్యం ఎగుమతి పెరిగితే.. తెలంగాణ రైతులకు చాలా మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ కమిషనర్, ఎక్స్‌అఫీషియో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎం. స్టీఫెన్ రవీంద్ర, సెక్రెటరీ కోఆర్డినేషన్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్ ,ఇతర పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### హైదరాబాద్‌లో నాబార్డ్ ప్రాంతీయ కార్యాలయంలో..
## విజిలెన్స్ అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విజిలెన్స్ అవేర్నెస్ వీక్2025 సందర్భంలో, తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, హైదరాబాద్ సిటీ–I యూనిట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఆర్‌టిసి ఎక్స్ రోడ్‌లోని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ రూరల్ డెవలప్‌మెంట్ ( నాబార్డ్ ) తెలంగాణ ప్రాంతీయ కార్యాలయంలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాబార్డ్ జనరల్ మేనేజర్ ఆర్. గణపతి, డిజిఎం (అడ్మిన్) ఎం.వి.ఎస్.ఎస్. శ్రీనివాస్, హైదరాబాద్ సిటీ–I ప్రాంతీయ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి జి. శ్రీనివాస్, నాబార్డ్ డిజిఎంలు, సిబ్బంది, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు హాజరయ్యారు. సమావేశంలో రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రాముఖ్యత, పాత్ర, బాధ్యతలపై చర్చ జరిపి, ప్రతి ఉద్యోగి సమాజం పట్ల కలిగిన భాగస్వామ్య బాధ్యతను గుర్తు చేశారు. విధి నిర్వహణలో నిబద్ధత, జవాబుదారితనం, పారదర్శకత ఎంతో ముఖ్యమని నాబార్డ్ అధికారులకు వివరించారు. తాజాగా ప్రారంభించిన అధికారిక ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ హ్యాండిల్ @tgvigenfo, టోల్‌ఫ్రీ నెంబర్ 14432 లపై పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు.

## రేపటి నుంచి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 4.0 నవంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు కొనసాగుతుందని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ (పిఎఫ్ఎ) హేమ సునీత తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్ రైల్ నిలయంలో డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 4.0 పోస్టర్‌లను హేమ సునీత గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ఆర్థిక సలహాదారు, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ అభిషేకానందరావుతో పాటు పిఎఫ్ ఏ కార్యాలయం లోని ఇతర సీనియర్ అధికారులు, సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## ఎస్‌డిఆర్‌ఎఫ్, పిఆర్ నిధులు వాడుకోండి

### అప్రమత్తతతో ప్రమాదాన్ని నివారించగలిగాము
### వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తుఫాను నేపథ్యంలో సహాయ, పునరావాస చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టర్లు ఎస్‌డిఆర్‌ఎఫ్, పిఆర్27 నిధులను ఉపయోగించుకుని తదుపరి 30 రోజులలో రాటిఫై చేసుకోవాలని కలెక్టర్లను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ కేబినెట్ 48 గంటలు ముందుగా అందరినీ అలర్ట్ చేయడం, ప్రభుత్వ యంత్రాంగం అందుకు అనుగుణంగా స్పందించడంతో ప్రాణ నష్టాన్ని, భారీ ఆస్తి నష్టం నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోగలిగామని డిప్యూటీ సిఎం అన్నారు. రానున్న 24 గంటలు కలెక్టర్లు ఇతర అధికారులు సైక్లోన్ మాన్యువల్ ప్రకారం సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుఫాను ప్రభావం దురదృష్టకరం, కృష్ణా జిల్లా నుంచి నల్లగొండ, ఖమ్మం జిల్లా మీదుగా వెళ్లడంతో ఉత్తర తెలంగాణలో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని డిప్యూటీ సిఎం తెలిపారు. అధికారులు అప్రమత్తమై పత్తి తడవకుండా టార్పాలిన్లు కప్పడం, గోదాముల్లోకి పత్తి పంటను తరలించడంతో పత్తి పంటను కాపాడుకోగలిగామన్నారు. తుఫాను నేపథ్యంలో ఉత్తర, దక్షిణ సిఎండిలు మొదలుకుని విద్యుత్ శాఖ యావత్తు తుఫాను సహాయ చర్యల్లో నిమగ్నమయ్యాయని డిప్యూటీ సిఎం తెలిపారు. భారీ తుఫాను వచ్చినప్పటికీ ఎక్కడా విద్యుత్ సమస్య తలెత్తకుండా మొబైల్ వ్యాన్లు పెట్టుకుని సిబ్బంది ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసుకుంటూ ముందుకు వెళ్లారని వివరించారు.
తుఫాను నేపథ్యంలో రెండు డిసామ్‌ల పరిధిలో సబ్ స్టేషన్లు దెబ్బతినగా ఏడు సబ్ స్టేషన్ లను తిరిగి పునరుద్ధరించారని, మిగిలిన నాలుగు సబ్ స్టేషన్లను పునరుద్ధరిస్తారని వివరించారు.

## యుద్ధ ప్రాతిపదికన నష్ట నివారణ చర్యలు చేపట్టాలి

### అఖిల భారత రైతు కూలీ సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మెంథా తుఫాన్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు క్షేత్రస్థాయిలో బృందాలను ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన నష్ట నివారణ చర్యలు చేపట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న డిమాండ్ చేశారు. వరికి ఎకరా ఒక్కంటికి రూ.30వేలు పత్తికి 50 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం అందించాలన్నారు. అదేవిధంగా తేమతో సంబంధం లేకుండా మార్కెట్కు వచ్చిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, ఇసుక మేటలు పెట్టిన భూములను చదును చేసి సేద్యానికి అనుకూలంగా తయారు చేయటానికి ఖర్చు అంచనా వేసి ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. పూర్తిగా నష్టపోయిన మిరప తోటలకు ఎకరాల 50 వేలు నష్టపరిహారం చెల్లించాలి. వరదలో కొట్టుకుపోయి మరణించిన కోళ్లు, గొర్లు, పశువులకు అంచనా కట్టి తగిన విధంగా నష్టపరిహారం అందజేయాలన్నారు.

## రాష్ట్రపతి ఆమోదం
(మొదటి పేజీ తరువాయి)

అర్జున్ రామ్ మేఘవాల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'భారత రాజ్యాంగ ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్‌ను నియమించేందుకు రాష్ట్రపతి సంతోషంగా ఉన్నారు. ఆయన నవంబర్ 24 నుంచి బాధ్యతలు చేపట్టనున్నారు' అని పోస్టులో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఉన్న సిజెఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com